



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-12-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 324 పేజీలు: 8+4 వెల: 6.50





# ఆర్డీఎస్ఎస్ పనులు ముమ్మరం



వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యం

ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,డిసెంబరు 24ప్రభాతవార్తప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యతనివ్వాలని ఎస్పీడీసీఎల్ సిఎండి శివ శంకర్ లోతేటి సూచించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 45 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయడం జరిగిందని, ఈ డిసెంబర్ 31వ తేదీలోగా మరో 5 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదలచేయడం ద్వారా 50 వేల సర్వీసుల మార్కును చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్డీఎస్ఎస్) పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద అభివృద్ధి పనులను త్వరితగతన పూర్తి చేయడం ద్వారా వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా రూఫ్ టాప్ సోలార్ సిస్టంపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించాలని శివశంకర్ సూచించారు. కేవలం ఎస్సీ,ఎస్టీ గృహ వినియోగదారులకు మాత్రమే కాకుండా, ఎస్సీ ఎస్టీయేతర వినియోగదా రులు కూడా సోలార్ విద్యుత్ వైపు మొగ్గు చూపే విధంగా అధికారులు ప్రణాళికను రూపొం దించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి. అయూబ్ ఖాన్, కే.గురవయ్య, కే. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జే.రమణాదేవి, కె. ఆదిశేషయ్య, పీహెచ్ జానకిరామ్, ఎం. మురళి కుమార్, పి. సురేంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.





## ఎల్‌విఎం-3 ఎం6 రాకెట్‌ద్వారా నాలుగో ప్రయోగం కూడా సక్సెస్

### అమెరికాకు చెందిన ఉపగ్రహం రోదసిలోకి

### వాణిజ్య ప్రయోగాలకు రాచబాట వేసిన ఇస్రో

**సూళ్లూరుపేట, డిసెంబరు 24 ప్రభాతవార్త:** ఇస్రో అంతరిక్ష ప్రయోగాల్లో మరో భారీ ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించి సత్తా చాటింది. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్‌ద్వారా అమెరికాకు చెందిన వాణిజ్య ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్-2ను నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టి మరోసారి గగనతలంలో కీర్తిపతాకం ఎగుర వేసింది. బుధవారం శ్రీహరి కోటలోని రెండవప్రయోగ వేదికనుంచి 8.55.30 నిమిషాలకు నిప్పులుచెరుగుకుంటూ ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ నింగికి ఎగిసింది. షార్‌లోని శాస్త్రవేత్తలు, సందర్శకుల కరతాళ ధ్వనుల మధ్య రాకెట్ గమ్యస్థానం వైపు దూసుకెళ్లింది. నింగిలోకి >>2

# పిపిపి విధానంపై ముందుకే



పేదలకు నాణ్యమైన వైద్యంలో రాజీలేదు

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం విజిఎఫ్‌కు నిర్ణయం

ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ముందుకొచ్చిన సంస్థతో ఒప్పందం

వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పేదలకు నాణ్యమైన మెడికల్ విద్యను, వైద్యాన్ని అందించే విషయంలో ఎక్కడా రాజీ పడేది, వెనక్కి తగ్గేది ఉండదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వైద్యా రోగ్యశాఖపై సచివాలయంలో బుధవారం సీఎం సమీక్షి ంచారు. ఈ సందర్భంగా పీపీపీ విధా నంలో మెడికల్ కాలేజీల నిర్మాణం ప్రస్తావనకు వచ్చింది. దేశ వ్యాప్తంగా పీపీపీ విధానం అమల్లో ఉందని పేద వర్గాలకు నాణ్యమైన, కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో పీపీపీ విధానంలో ముందు కువెళ్లాలని సీఎం అధి కారులకు సూచించారు.

**పీపీపీలకు వయబులిటీ గ్యాప్ ఫండింగ్:** సమీక్ష సందర్భంగా పీపీపీ విధానంలో ఆసుపత్రులు, మెడికల్‌కాలేజీల నిర్మాణం, మౌలిక వసతులపై కేంద్ర ప్రభుత్వ సూచనలను, మార్గదర్శకాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పీపీపీ ప్రాజెక్టుల అమలును ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం, ఆర్థిక వ్యవహారాల విభాగం, ఆర్థిక మంత్రిత్వశాఖ ద్వారా పలు విధానపరమైన ఆర్థికసహాయ పథకాలను ప్రవేశపెట్టిందని అధికారులు చెప్పారు. ఈ క్రమంలో అమలులో ఉన్న వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద సామాజిక-ఆరోగ్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పీపీపీ ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద అందించే ఆర్థిక చేయూతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం సూచించిందని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా వైద్యరంగంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద ఇచ్చే 60శాతం ఆర్థిక మద్దతులో చెరో 30శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. వీజీఎఫ్ >>2

# పాస్టర్లకు క్రిస్మస్ కానుక

## 8,418 మందికి రూ.50.50కోట్లు విడుదల

### శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఫరూక్

**విజయవాడ డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్లకు కూటమి ప్రభుత్వం క్రిస్మస్ కానుకను అందించింది. మైనార్టీశాఖా మంత్రి ఫరూక్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.క్రైస్తవ సోదరులకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఈ విషయం తెలుపుతూ క్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పాస్టర్లకు నెలవారీ అందించే గౌరవవేతనాలను జమ చేసింది. 24వ తేదీ సాయంత్రంలోపు గౌరవ వేతనాలు చెల్లిస్తామని సెమీ క్రిస్మస్ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రంలోని 8,418 మంది పాస్టర్లకు గౌరవ వేతనం నిధులు బుధవారం విడుదలచేశారు. 2024డిసెంబర్ నుంచి ఈ ఏడాది నవం బర్‌వరకు మొత్తం రూ.50,50,80,000ను రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్ల ఖాతాలో వేసింది. >>2

# గ్రామాల్లోను అన్న క్యాంటీన్లు

## సంక్రాంతి నుంచి ప్రారంభం

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రజలకు సంక్రాంతి కానుకగా ఏపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఒకేసారి 70 అన్న క్యాంటీన్లు ప్రారం భించ నున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వివిధదశల్లో ఉన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు జనవరి 10లోగా పూర్తి చేయనుండగా, జనవరి 13నుంచి 15మధ్య క్యాంటీన్లు ప్రారంభించే >>2

# గిరిజన ప్రాంత ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా మందులు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** మారుమూల గిరిజన ప్రాంతాలకు అత్యవసర వైద్య సేవలను చేరువ చేసే లక్ష్యంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ "రెడ్ వింగ్" సంస్థతో కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా దూరప్రాంతాల్లోని ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా మందులు, >>2







రాకెట్ ప్రయోగం విజయవంతం అవడంతో ఆనందోత్సాహాలలో చైర్మన్ నారాయణ, ఇతర శాస్త్రవేత్తలు

# కక్ష్యలోకి 'బ్లూ బర్డ్'

>> ఎగిసిన అనంతరం 500 కిలోమీటర్ల దూరాన్ని 15 నిమిషాల 30 సెకన్లలో చేరుకుని అత్యంత బరువైన 610 టన్నుల ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది.

**రాకెట్ గమనం ఇలా..** రాకెట్ ప్రయోగాల్లో గతంలో నాలుగు దశలు ఉండగా, ప్రస్తుత ప్రయోగం మూడు దశల్లో ముగిసింది. మొదటి దశలో స్ట్రాపాన్ బూస్టర్లలో ఉన్న 400 టన్నుల ఘన ఇంధనం మండుకుని 105.98 సెకన్ల పాటు రాకెట్‌ను నింగిలోకి తీసుకెళ్లింది. అక్కడి నుంచి రెండో దశ ప్రారంభమైంది. 110 టన్నుల ద్రవ ఇంధనంతో రాకెట్ 301.70 సెకన్లపాటు మండుతూ రాకెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లింది. మూడో దశలో కీలకమైన క్రయోజనిక్ దశ ప్రారంభమై 304.36 సెకన్ల పాటు రోదశిలోకి బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఎఎస్‌పి స్పేస్ మొబైల్ సంస్థతో ఇండియాకు చెందిన ఎన్ఎస్ఐఎల్ చేసుకున్న వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఈ ప్రయోగం జరిగింది. రోదశి రంగంలో ప్రపంచ దేశాల్లో ప్రప్రథమంగా భారీ ఉపగ్రహ ప్రయోగం నిర్వహించి ఇస్రో మరో మైలురాయిని అధిగమించింది.

**భళారే బాహుబలి:** ఇస్రో బాహుబలి రాకెట్‌గా పేరొందిన ఎల్‌విఎం3-ఎం6 అత్యంత బరువైన బ్లూబర్డ్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి పంపి బాహుబలి పేరును సార్థకం చేసుకుంది. ఎల్‌విఎం సిరీస్‌లో ఇప్పటికి 8 ప్రయోగాలు సక్సెస్ కాగా, 9వ ప్రయోగం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ భారత ఉపగ్రహం కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఆశించిన దాని కన్నా ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి మంచి ఫలితం అందినట్లయింది. ఇస్రోకు ఇది 104వ ప్రయోగం. ఈ ప్రయోగ విజయంతో వాణిజ్య ప్రయోగాలకు ఇస్రో రాచబాట వేసినట్లయింది. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ద్వారా ఇప్పటివరకు మూడు వాణిజ్య ప్రయోగాలు జరిగి ఉన్నాయి. ప్రస్తుతం నాలుగవ ప్రయోగం కూడా విజయవంతం కావడంతో భవిష్యత్‌లో మరెన్నో ప్రయోగాలు ఇస్రో వాణిజ్యపరంగా చేసేందుకు ఈ ప్రయోగం దోహదపడుతుంది. ప్రపంచ దేశాల్లో భారీ ప్రయోగాలు చేసే సంస్థగా ఇస్రో గుర్తింపు తెచ్చుకుంది.

**ప్రయోగ విజయం స్ఫూర్తినిచ్చింది:ఇస్రో చైర్మన్ వి.నారాయణన్:** ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగ విజయం భవిష్యత్ ప్రయోగాల నిర్వహణకు నమ్మకంతో పాటు స్ఫూర్తినిచ్చిందని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. బుధవారం ఎల్‌విఎం3-ఎం6 ప్రయోగ విజయం అనంతరం ఆయన శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్2 వాణిజ్య ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టామని తెలిపారు. చంద్రయాన్-4, 5తో పాటు వీనస్ మిషన్, మరెన్నో ప్రయోగాలు, గగన్‌యాన్, మానవరహిత ప్రయోగం, ఎయిర్ స్పేస్ స్టేషన్ ప్రయోగాలకు ఈ రాకెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం జరిగిన ప్రయోగం అత్యంత కీలకమైనదని, భారత భూభాగం నుంచి అత్యంత బరువైన ఉపగ్రహాన్ని రోదశిలోకి పంపడం ఇదే ప్రథమ మని చెప్పారు. నవంబర్ 2వ తేదీన ప్రయోగం జరిగిన తర్వాత 52 రోజుల్లో తిరిగి భారీ ప్రయోగం చేపట్టి అది విజయవంతం చేయడం ఇస్రో శాస్త్రవేత్తల కృషికి నిదర్శనమన్నారు. నాసా, ఇస్రో సంయుక్త ఆధ్వర్యంలో 10,300 కోట్ల రూపాయలతో బ్రాడ్‌బ్యాండ్ సేవలు విస్తరించేందుకు ప్రత్యేకమైన యాంటెన్నా నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమైనట్లు నారాయణన్ చెప్పారు.

## ప్రభాకర్‌రావు పెన్‌డ్రైవ్, హార్డ్‌డిస్క్ స్వాధీనం

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో మలుపు

**హైదరాబాద్, డిసెంబర్ 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు బుధవారం కీలక మలుపు తిరిగింది. ప్రభాకర్ రావు నుండి ఫోన్ ట్యాపింగ్ సమాచారం వున్న పెన్ డ్రైవ్‌తో పాటు హార్డ్ డిస్క్‌ను సిట్ బృందం స్వాధీనం చేసుకుందని సమాచారం. ఇందులో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని సిట్ అధికారులు వెలికితీసినట్లుగా తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా మరికొందరు బ్యూరోక్రాట్లతో పా టు బీఆర్ఎస్ ముఖ్యులకు సిట్ తాఖీదులు జారీచేసి విచారించే వీలుంది. మరోవైపు ప్రభాకర్ రావు కస్టడీ గురువారంతో ముగియనుండడంతో పాటు శుక్రవారం ఉదయం విడుదల చేయాల్సిన తరుణంలో ఆయన కస్టడీని మరోదఫా పొడిగించాలని లేదా లై డిటెక్టర్ పరీక్షలకు అనుమతివ్వాలని సర్కా రు సుప్రీం కోర్టులో పిటిషన్ వేయనుందని తెలిసింది.

రాష్ట్రంలో రాజకీయంగా దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు చివరి దశకు చేరింది. రెండు వారాలుగా పోలీసు కస్టడీలో వున్న ప్రభాకర్ రావు పె ద్దగా ఎలాంటి సమాచారం పోలీసులకు వెల్లడించలేదని తెలిసింది. అయితే ఆయన వద్ద ఫోన్ ట్యాపింగ్ సమాచారం వున్న పెన్ డ్రైవ్‌తో పాటు హా ర్డ్ డిస్క్‌ను సిట్ అధికారులు బుధవారం ఉదయం జప్తు చేసినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు మిత్రుడు ఒకరి వద్ద నుంచి వీటిని జప్తు చేసినట్లు తెలి సింది. వీటిని వెంటనే విశ్లేశించిన సిట్ అధికారులకు అందులో కీలక సమాచారం లభ్యమైనట్లు తెలిసింది. ఇందులో ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమ యంలో ఏం జరిగిందనే విషయంతో పాటు ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ జరిగాయి...? ఎంతకాలం జరిగాయి..? దీనివల్ల ఎవరికి లబ్ది చేకూరింది ...? ట్యాపింగ్‌లో పాల్గొన్న అధికారులు ఎవరు...? ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగింది...? అనే సమాచారం వుందని తెలిసింది. ఈ సమాచారం అంతా ప్రభాకర్ రావు స్నేహితుడి వద్ద లభ్యమైన పెన్ డ్రైవ్, హార్డ్ డిస్క్‌లో వుందని తెలిసింది. ఈ సమాచారం ఫోన్ ట్యాపింగ్‌కు సం బంధించిన విచారణలో సిట్ అధికారులకు మరింత ఉపయోగపడుతుందని తెలిసింది. ఈ సమాచారం ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమయ ంలో పోలీసు శాఖతో పాటు సచివాలయంలో కీలక స్థానాల్లో వున్న బ్యూరోక్రాట్లను విచారించేందుకు సిట్ సమాయాత్తమవుతోంది. వీరిన విచారిం చిన తరువాత అప్పట్లో పాలకులుగా వున్న బిఆర్ఎస్ ముఖ్యులకు తాఖీదులు జారీ చేసి విచారించే వీలుంది. వీరు వెల్లడించే అంశాల ప్రకారం త రువాత ఏం చేయాలనే దానిపై సిట్ నిర్ణయించే వీలుంది.

**మరోదఫా కస్టడీ లేదా లై డిటెక్టర్ పరీక్షలు కోరనున్న సర్కారు:** ఇదిలావుండగా ప్రభాకర్ రావు పోలీసు కస్టడీ గురువారం సాయంత్రంతో ముగియనుండడంతో ఆయనను మరో దఫా కస్టడీ లేదా లై డిటెక్టర్ ప రీక్షలకు పిటిషన్ వేయాలని సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభాకర్ రావు రెండు వారాలుగా ఆయన పోలీసు కస్ట డీలో వుండడం తెలిసిందే. మొదట వారం రోజుల పాటు ప్రభాకర్ రావును విచారించిన పోలీసు అధికారులు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మరో వారం రోజులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. మొదటి దఫా విచారణకు ఎసిపి స్థాయి అధికారి నేతృత్వంలో విచారణ సాగగా రెండవ దఫా విచారణ సిటీ కొత్వాల్ సజ్జన్నార్ నాయకత్వంలోని సిట్ బృందం విచారించింది. ఇందులో ముగ్గురు ఐపిఎస్ అధికారులతో పాటు సాంకేతిక అం శాలపై పట్టువున్న మరో ఐదుగురు అధికారులున్నారు. అయితే రెండవ దఫా విచారణలో ఆయన నుంచి పెన్ డ్రైవ్, హార్డ్ డిస్క్ వంటివి లభ్యమవ డం మినహా పెద్దగా సమాచారం రాకపోవడంతో ఆయనను మరోదఫా కస్టడీకి ఇవ్వాలని పోలీసు శాఖ తరపున సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలయ్యే వీలుందని తెలిపింది. ఒకవేళ ఇందుకు సుప్రీం కోర్టు అంగీకరించకుండే లై డిటెక్టర్ పరీక్షలకు అనుమతించాలని కోరే వీలుంది,

## 15 గ్రామాల్లో మహిళలు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం

### రాజస్థాన్ జాలోర్ జిల్లాలో గ్రామపెద్దల 'ఫోన్' పంచాయితీ

**జాలోర్(రాజస్థాన్), డిసెంబరు 24:** ప్రపంచం మొత్తం 6జివైపు దూసుకుపోతుంటే రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాలోని 15 గ్రామాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. గ్రామాల్లోని మహిళలు కేవలం కీప్యాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. సంధమాత పట్టి పంచాయత్‌లోని చౌదరి కమ్యూనిటీ ఈమేకు మహిలలు, బాలికలు స్మార్ట్‌ఫోన్లు వినియోగించకూడదని నిషేధం విధించింది. దీనివల్ల మొబైల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని గ్రామపెద్దలు ఆరోపిస్తు చిన్నారుల్లో కంటిచూపులోపాలు కూడా పెరుగుతున్నట్లు చెప్పారు. వచ్చేనెల 26వ తేదీనుంచి ఈ నిషేధం నిర్ణయాలు అమలులో ఉంటాయి. మహిలలు కేవలం కీపాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాలి. అలాగే పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలయాలకు ఫోన్లు కూడా తీసుకువెళ్లకూడదు. ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లినా వెంట ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన పంచాయతీ తీర్మానం చదువుతున్న పెద్దతోపాటు ఇతర పెద్దల విడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. కెమేరా ఉన్న ఫోన్లు మహిలలు వాడకూడదు. మాట్లాడేందుకు కెమేరాలేని కీపాడ్‌ఫోన్లుమాత్రమే వాడాలి. విద్యార్థినులు ఇళ్లనుంచి వెళ్లేటపుడు బయటకు ఫోన్లు తీసుకెళ్లకూడదు. పాఠశాల వెళ్లే బాలికలు మాత్రం ఇంట్లో ఫోన్లు వాడుకోవచ్చు. బయటి ఫంక్షన్లకు వీటిని తీసుకెళ్లకూడదు. మహిళలకు స్మార్ట్‌ఫోన్లు ఉండటం వల్ల పిల్లలు వాటిని తీసుకుని బానిసలవుతున్నారని అందువల్లకంటిచూపు లోపిస్తోందని పెద్దలు చెపుతున్నారు. గాజిపూర్‌గ్రామంలోజరిగినీ పంచాయతీలో తీర్మానం చేసారు. పట్టి కులానికి చెందిన అధ్యక్షుడు సుజన్‌రామ్ చౌదరి ఈ తీర్మానం ప్రతిపాదించారు. ఈ కులపెద్దల నాయకత్వం ప్రకారం పంచ్ హిమమ్మతరం ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ నిర్ణయం ఇతర గ్రామాల్లోకూడా అమలుచేస్తున్నారు. భిన్మల్ ప్రాంతంలోని ఘాజిపూర్, పావాలి, కల్డా, మనోజ్‌ఉయావాస్, రాజికవాస్, దాట్లవాస్, రాజ్‌పుర, కోడి, సిద్‌రోడి, ఆల్డి, రోప్సి, ఖండేల్వాల్, సావిధర్, హాత్మికి ధని, ఖాన్‌పూర్ తదితర పంచాయితీల్లోకూడా ఈతీర్మానం అమలవుతోంది. సోషల్‌మీడియాలో తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తాయి.మహిళా హక్కుల సంఘాలు కూడా విమర్శించాయి. మహిళా వ్యతిరేకిగా ఈ తీర్మానం ఉందని, మహిళలపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు పెరిగాయి.

# పిపిపి విధానంపై ముందుకే

>> ద్వారా అరుణాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆసుపత్రులు, వైద్య కళాశాలు నిర్మించేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ఇప్పటికే అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం పీపీపీ విధానాన్ని ప్రోత్సాహిస్తోందని అధికారులు వివరించారు. దీని ద్వారా వైద్య కళాశాలలు, ఆసుపత్రుల వంటి కీలక ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం అభిప్రాయ పడినట్లు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

**ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి టెండర్ల దాఖలు**

రాష్ట్రంలో ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీలను ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన కార్యాచరణతో పనిచేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏపీలో పీపీపీ విధానంలో చేపట్టిన మెడికల్ కాలేజీల నిర్మాణానికి కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా వీజీఎఫ్ సహ ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం తొలి విడతగా ఆదోని, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు. నాలుగు మెడికల్ కాలేజీలకు పీపీపీ విధానంలో నిర్మించి, నిర్వహించేలా సెప్టెంబరు 18న ప్రభుత్వం టెండర్లు పిలిచిందని... అక్టోబర్ 6వ తేదీన నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి 6 జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొన్నాయని అధికారులు తెలిపారు.

క్షేత్ర స్థాయిలో బిడ్డర్ల పర్యటన..

కొందరు బిడ్డర్లు ప్రాజెక్ట్ స్థలాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను అంచనా వేసుకునేందుకు కొంత సమయం కావాలని కోరారన్న విషయాన్ని అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. కొందరు రెండవ ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించాలని కూడా అభ్యర్థించారని... బిడ్డర్ల అభ్యర్థన మేరకు అధికారులు ఆయా సంస్థల ప్రతినిధులకు సైట్ విజిట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం అక్టోబర్ 23న నిర్వహించిన రెండవ ప్రీబిడ్ సమావేశంలో కూడా బిడ్డర్లు పాల్గొన్నారని... రెండు దశల ప్రీబిడ్ సమావేశాల అనంతరం నాలుగు సంస్థలు మరింత సమాచారం కోరాయని అధికారులు వివరించారు. ప్రతి ప్రాజెక్టుకు గరిష్టంగా 50 ఎకరాల కేటాయింపు, డిజైన్ల వివరాలు వంటి అంశాలపై చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని... వీలిది నిబంధనలు అనుసరించి, భూమిని సమర్థవంతంగా వినియోగించుకునేలా డిజైన్లను రూపొందించుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, కన్సార్టియం సభ్యుల సంఖ్యను 2 నుండి 3కి పెంచాలని కూడా బిడ్డర్లు కోరితే అంగీకరించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఇదే సందర్భంలో ఆదోని మెడికల్ కాలేజ్ నిర్మాణానికి ఓ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. ముందుకు వచ్చిన సంస్థతో ఒప్పందం చేసుకుని కాలేజ్ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను సూచించారు. అలాగే మిగిలిన కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు.బిడ్డర్లతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**సంజీవిని ప్రాజెక్టుపై సమీక్ష..**

కుప్పంలో పైలెట్ గా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు అమలు పైనా సీఎం అధికారులతో చర్చించారు. త్వరలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టును అమలు చేసేలా అధికారులు ఎలాంటి కసరత్తు చేస్తున్నారని సీఎం ఆరా తీశారు. కుప్పంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తూ... వాటికి పరిష్కారం చూపేలా చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు ఇచ్చేలా రూపొందించిన ఈ ప్రాజెక్టును ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు.

# గ్రామాల్లోను అన్న క్యాంటీన్లు

>> యోచనలో ప్రభుత్వం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో 205 అన్న క్యాంటీన్లు ప్రారంభించి కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వీటిలో రోజూ మూడు పూటలా కలిపి 2 లక్షల మందికిపైగా ప్రజలు భోజనం చేస్తున్నారు. ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని పూటకు రూ.5కే అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి నేపథ్యంలో ప్రభుత్వం మరో 70 క్యాంటీన్లను మంజూరు చేసింది. పట్టణాలు, నగరాల్లో కొనసాగుతున్న 205 అన్న క్యాంటీన్ల ద్వారా ఇప్పటి వరకు 7.20 కోట్ల మందికిపైగా పేదలకు ఆహారం అందించారు. వీరిలో 3.16 కోట్ల మంది మధ్యాహ్న భోజనం చేయగా, 2.62 కోట్ల మంది ఉదయం అల్పాహారం, 1.42 కోట్ల మంది రాత్రి అల్పాహారం పొందారు. విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అన్న క్యాంటీన్లకు అత్యధిక స్పందన లభిస్తోంది.

## గిరిజన ప్రాంత ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా మందులు

### నెలాఖరు నుంచి ప్రారంభం

>> బ్లడ్ యూనిట్స్ పంపిణీ చేసేందుకు వీలుగా ఈ ఒప్పందం జరిగింది. ఇప్పటికే అరుణాచల్ ప్రదేశ్‌లో విజయవంతంగా సేవలు అందిస్తున్న సదరు సంస్థ, రాష్ట్రంలో ఖిప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌ఖి కింద మొదటి 67 నెలల పాటు ఉచితంగా సేవలు అందించడానికి అంగీకరించింది. ఈ ఒప్పందం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండ్యన్, సదరు సంస్థ ప్రతినిధి కుందన్ మాదిరెడ్డి మధ్య కుదిరినట్లు వైద్య ఆరోగ్య శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

**పాడేరు కేంద్రంగా కార్యకలాపాలు:** పాడేరును ప్రధాన కేంద్రం (హబ్)గా చేసుకుని, 60 నుంచి 80 కిలోమీటర్ల పరిధిలోని ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు డ్రోన్ సేవలు అందుతాయి. ఈ డ్రోన్లలో మందులు మరియు వ్యాక్సిన్లు పాడవకుండా ఉండేలా కోల్డ్ చైన్ సదుపాయం కూడా ఉంటుంది. ఒక్కో డ్రోన్ సుమారు 2 కిలోల బరువును మోసుకెళ్ళే సామర్థంతో పనిచేస్తుంది. ఈ డ్రోన్లు కేవలం మందులు తీసుకెళ్లడమే కాకుండా, తిరిగి వచ్చేటప్పుడు రోగుల నుంచి సేకరించిన రక్త, మల, మూత్ర నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు తీసుకొస్తాయి. వచ్చే నెలాఖరు నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని కమీషనర్ వీరపాండ్యన్ తెలిపారు.

**త్వరలో కెజిహెచ్ నుండి పాడేరుకు:** గిరిజన కొండ ప్రాంతాల్లో రోడ్డు మార్గాల ద్వారా మందులు పంపడం సమయంతో కూడుకున్న పని. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా డ్రోన్ల వినియోగంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. భవిష్యత్తులో ఈ సేవలను విశాఖ కేజీహెచ్ నుంచి పాడేరుకు మందుల రవాణాకు కూడా విస్తరింపచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ టెండర్‌పై పిల్.. కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం ఖరారు అయిన టెండర్ పై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఆ పిల్‌ను విచారించిన హైకోర్టు కొట్టేసింది. నోటిఫికేషన్ జారీ చేసిన ఏడాది తరువాత అందులోని నిబంధనలను సవాల్ చేయడం ఏమిటని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ఎల్ 1గా నిలిచిన బీఎస్సార్ సంస్థతో పాటు మొత్తం మూడు సంస్థలు బిడ్డింగ్‌లో పాల్గొన్నాయని ధర్మాసనం గుర్తుచేసింది ఎల్ 1గా నిలిచిన బీఎస్సార్ ఇన్‌ఫ్రాటెక్‌కు టెండర్ కేటాయిస్తే తప్పేముందని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం తరుపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తరుపున న్యాయవాది మెట్ల చంద్రశేఖర్ వాదించారు. నచ్చిన వారిని ఎంపిక చేసుకునే విధంగా టెండర్ నోటిఫికేషన్‌లో నిబంధనలు పెట్టారని పిటిషనర్ తరుపు న్యాయవాది మెట్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. పిల్ దాఖలు చేసే ముందు పిటిషనర్ కనీసం అధ్యయనం చేయలేదని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.. టెండర్ నిబంధనలపై అభ్యంతరం ఉంటే పాల్గొన్న సంస్థలు కోర్టును ఆశ్రయించాలి కాని, అడ్వకేట్ ముసుగులో పిల్ వేయ డానికి వీలులేదని దమ్మాలపాటి వాదించారు. దీంతో హైకోర్టు ఆ పిల్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చింది.

# అరుణాచల్‌పై చైనా రాజీలేని ధోరణి

### యుఎస్ రక్షణ వ్యవస్థ పెంటగాన్ నివేదిక

**ఇటానగర్, డిసెంబరు 24:** అరుణాచల్ ప్రదేశ్ తమకెంతో ముఖ్యమని, రాజీపడని ప్రయోజనాల్లో ఒకటిగా చైనా భావిస్తోందని అమెరికన్ కాంగ్రెస్‌కు సమర్పించిన నివేదికలో పెంటగాన్ పేర్కొంది. 2049 నాటికి జాతీయ పునరుజ్జీవనాన్ని సాధించాలనే లక్ష్యంతో చైనా ఉందని నివేదిక వెల్లడించింది. చైనా తన నాయకత్వ పరిధిని విస్తరించాలని భావిస్తున్నట్లు పెంటగాన్ అభిప్రాయపడింది. తైవాన్, సెంకాకు ద్వీపాలతో పాటు అరుణాచల్ ప్రదేశ్ కూడా బీజింగ్ యొక్క విస్తృత జాతీయ భద్రతా ప్రణాళికల్లో భాగమని తెలిపింది. ఈ భూభాగాలు చైనా జాతీయ పునరుజ్జీవనానికి కీలకమని డ్రాగన్ భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. చైనా కమ్యూనిస్టు పాలనను వ్యతిరేకించిన హాంగ్‌కాంగ్, టిబెట్, తైవాన్ రాజకీయ నాయకులను వేర్పాటువాదులుగా ముద్ర వేసినట్లు కూడా నివేదిక తెలిపింది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతూ భారత్, చైనా మధ్య కుదిరిన గస్తీ ఒప్పందం గురించి పెంటగాన్ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించడానికి చైనా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెంటగాన్ నివేదిక పేర్కొంది. అమెరికా, భారత్ మధ్య సంబంధాలు మరింత బలపడకుండా ఉండేలా చైనా జాగ్రత్త పడుతోందని వివరించింది. జాతీయ పునరుజ్జీవనానికి బీజింగ్ మూడు ప్రధాన ప్రయోజనాలను లక్ష్యంగా పెట్టుకుందని, చైనా కమ్యూనిస్టు పార్టీపై నియంత్రణ, దేశ ఆర్థికాభివృద్ధి, సార్వభౌమాధికారం, ప్రాదేశిక వాదనలు కొనసాగించడం వంటివి ముఖ్యంగా భావిస్తున్నట్లు పెంటగాన్ నివేదికలో విశ్లేషించింది.

## తైవాన్‌లో తీవ్రస్థాయి భూకంపం: రిక్టర్‌స్కేలుపై 6.1గానమోదు

**తైపేయి, డిసెంబరు 24:** తైవాన్ లో భారీ భూకంపం సంభవించింది. ఆగ్నేయ తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్ లో బుధవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రభావంతో రాజధాని తైపీ లో భవనాలు కుప్పకూలిపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం భూకంపం భూమికి 11.9 కిలోమీటర్ల లోతులో నమోదైంది.



బుధవారం స్వర్ణాంధ్ర-2047, 10 సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

# పది సూత్రాలే స్వర్ణాంధ్ర సాధనకు కీలకం

### 20 లక్షల ఉద్యోగాల కల్పనకే మొదటి ప్రాధాన్యత

### స్వర్ణాంధ్ర-2047, 10 సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి** స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో భాగంగా పౌరులకు మెరుగైన సేవలు వేగంగా అందించేందుకు ప్రతీ ప్రభుత్వ శాఖ ఇండికేటర్లను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధన కోసం రూపొం దించిన పది సూత్రాలను పది మిషన్లుగా నిర్దేశించుకుని పనిచేయాలని సీఎం సూచించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా శాఖల నోడల్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మిషన్ ఫ్రేమ్ వర్క్ రూపకల్పన, ఆయా ప్రభుత్వ శాఖలు మెరుగైన పనితీరు కోసం ముఖ్యమైన ఇండికేటర్లను గుర్తించి వాటికి అనుగుణంగా పనిచేయాలని సీఎం సూచించారు. జీరో పావర్టీ మిషన్లో భాగంగా పీ4 విధానాన్ని ముందుకు తీసుకెళ్లటంతో పాటు వాటి అమలును విజన్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతీ కుటుంబమూ సాధికారిత సాధించాలని అలాగే వ్యక్తులకు ఆర్థిక భద్రత కల్పించటమే ఈ మిషన్ ముఖ్య లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలో ఉన్న దాదాపు 30 లక్షల బీపీఎల్ కుటుంబాలకు ఎంత ప్రయో జనం కలిగిందో అంచనా వేయాలని సూచిం చారు. పాపులేషన్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఓ విధానాన్ని రూపొందించాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. నైపుణ్యాలు ఉద్యో గాల కల్పన అనేది అత్యంత ప్రాధాన్యత అం శంగా తీసుకోవాలని సూచించారు. మొట్టమొదటి ప్రాధాన్యతగా 20 లక్షల ఉద్యోగాలను కల్పించటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో ఉంచాలని సూచించారు. పది సూత్రాలకు సంబంధించిన అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని అన్నారు. కీలక మిషన్ గా నీటి భద్రత అంశంపైనా ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు. నీటి వనరుల సమర్ధ వినియోగంతో పాటు నీటి ఆడిట్ నిర్వహించాలని సూచించారు. నీటి వినియోగంలో ఎక్కడా వివాదాలు లేకుండా చూడాలని.. రెండు తెలుగు రాష్ట్రాలూ సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. టెక్నాలజీ వినియో గంతో సాగు వ్యయం తగ్గేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డిమాండ్ ఆధారిత పంటల ఉత్పత్తి, కోల్డ్ చైన్, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి అంశాలపై దృష్టి పెట్టి రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు.

**ఇండికేటర్లు ఆధారంగా లక్ష్యాలు:** రాష్ట్రంలో రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించేలా లాజిస్టిక్స్ రంగాన్ని తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. రోడ్లు, రైలు, అంతర్గత జలరవాణా, సీ కార్గో, ఎయిర్ కార్గో లాంటి అంశాలతో పాటు కోల్డ్ చైన్ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. విద్యుత్, ఇంధన వ్యయాల తగ్గించే అంశంపై కూడా దృష్టి పెట్టాలని ఉత్పత్తిదారు వినియోగదారు అనే విధానంలో అలోచన చేయాలని సూచించారు.

రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యత అనేది కీలకమైన అంశమని ప్రొడెక్ట్ పర్ఫెక్షన్ తో పాటు మేడ్ ఇన్ ఆంధ్రా బ్రాండ్ ను ప్రపంచవ్యాప్తం చేసేలా స్పష్టమైన విధానం ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి సంబంధించి కేంద్ర నిధుల్ని సమర్ధంగా వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఆర్గానిక్ కూరగాయల ఉత్పత్తి చేయాలని ఆలోచన చేస్తున్నట్టు సీఎం వెల్లడించారు.

ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, సహ నోడల్ ఆఫీసర్లుగా ఉన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డైట్ కళాశాలలో విషాదం

# వసతిగృహంలో ఉరి వేసుకుని మహేష్ బలవన్మరణం

### ఆర్థిక సమస్యలే కారణం?



కూనేటి మహేష్(ఫైల్)

**నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), డిసెంబరు 24 ప్రభాతవార్త:** స్థానిక వేణు గోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాల విద్యార్థి కూనేటి మహేష్(24) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల సమీపంలో ఉన్న వసతిగృహంలోని రీడింగ్ రూమ్‌లో ఉరి వేసుకుని చనిపోయాడు. మంగళవారం అర్ధ రాత్రి చనిపోగా, బుధవారం ఉదయం 6 గం టలకు తోటి విద్యార్థులు గమనించారు. విజ యనగరం రూరల్ ఎస్సై అశోక్ కుమార్, విద్యార్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం జిల్లేడువలస గ్రామానికి చెందిన మహేష్ డిగ్రీ పూర్తిచేసిన అనంతరం 2024లో ఉపాధ్యాయ శిక్షణ నిమిత్తం డైట్ కళాశాలలో చేరాడు. డైట్ క్యాంపస్‌లోనే ఉన్న బాలుర వసతిగృహంలో తోటి విద్యార్థులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వసతిగృహంలో ఉన్న రీడింగ్ రూమ్‌లో సహ విద్యార్థులతో కలిసి చదువుకున్నాడు. అందరూ గదుల్లోకి వెళ్లిపోయినా మహేష్ మాత్రం అక్కడే ఉండిపోయాడు. రాత్రంతా రూమ్‌కు రాకపోవడంతో ఉదయం 6 గంటలకు ఆయన రూమ్మేట్స్ రీడింగ్ రూమ్‌కు వెళ్ళి చూశారు. అప్పటికే మహేష్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. సమాచారం అందుకున్న విజయనగరం రూరల్ ఎస్సై అశోక్ కుమార్ తన సిబ్బందితో కలిసి వసతిగృహాన్ని సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆర్‌జె డి విజయ్ భాస్కర్, డీఈఓ మాణిక్యం నాయుడు, రిటైర్డ్ డీఈఓ డాక్టర్ ఎన్ టి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. మహేష్ మృతి పట్ల ప్రిన్సిపల్ రామకృష్ణారావు, అధ్యా పకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాగా మహేష్ మృతికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. మహేష్ సూసైడ్ నోట్ రాసినట్లు తెలిసింది. ఆ నోట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కుటుంబ, ఆర్థిక సమ స్యలు కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లుతెలుస్తోంది. విషయం తెలుసుకున్న తల్లి,బంధువులు డైట్ కళాశాలకు చేరుకుని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించి, అనంతరం మృతదేహాన్ని బంధువులు స్వగ్రామానికి తరలించారు.

## పాస్టర్లకు కిస్మస్ కానుక

>> దీంతో ఒక్కో పాస్టర్‌కు నెలకు రూ.5,000 చొప్పున ఒకొక్కరికి 12 నెలల మొత్తం రూ. 60,000 అందించింది.

## వారం - వర్జ్యం

25-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
పంచమి మ.1.39
ధనిష్ఠ ఉ.8.17, మూల కార్తె
వర్జ్యం : మ.3.41-5.20
దు.ఉ.10.17-11.02, 2) మ.2.44-3.29
శుభసమయం :ఉ.8.15-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:**తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. మీలో దాగివున్న నైపుణ్యం వెలుగులోనికి వస్తుంది.

**వృషభం:**అన్ని పనులు మీరే స్వయంగా చూసుకోవలసి వస్తుంది. మీకు అనుకూలాంశాలు ఎక్కువగా ఉంటాయి.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వివాహ యత్నాలు లభిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:**నూతన కాంట్రాక్టులకు సంబంధించి ఒప్పందాలు చేసుకుంటారు. విహార యాత్రలు చేస్తారు.

**సింహం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. ఉద్యోగులకు పదో న్నతులు పొందుతారు. ప్రయాణాలు జాగ్రత్త.

**కన్య :**విద్యావకాశాలు పొందుతారు. సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు. వస్త్రలాభం.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. పదవులలో, హెూదాలు లభించటానికి సమయం పడుతుంది.ఇంటా బయటా ప్రోత్సాహం.

**వృశ్చికం:** పాతబాకీలు వసూలవుతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాహ యత్నాలు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు:** పెద్దల శ్రేయోభిలాషులు ఇచ్చిన సలహాలు పాటించటానికి కాలం కలసి రాదు. క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మకరం:** విదేశాలలోని మీ సన్నిహితుల క్షేమ సమాచారం ప్రశాంతతకు కారణం అవుతుంది. ధన లాభం.బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** సంక్షేమ సంఘాల వలన లాభ పడతారు. మీ మేధస్సుతో ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుంటారు.ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం:** చాలాకాలంగా పరిష్కారం కాని కుటుంబ సమస్యలు ఈ రోజు పరిష్కార మవుతాయి.వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## హోల్డ్ వాహనాల ఫిట్‌నెస్ చార్జీల పెంపు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం రూ.1,300 ఉన్న ఫిట్‌నెస్ ఛార్జీలను ఒకేసారి రూ.33 వేలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టడంతో లారీ యజమానులకు భారీ ఊరట లభించిందని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వైవి ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ ఛార్జీలు రాష్ట్రంలో అమలు చేయొద్దని తాము సిఎం చంద్రబాబు, మంత్రి, రవాణాశాఖ అధికారులను ఇటీవల కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

## దూడపై దాడి చేసి చంపిన రేసు కుక్కలు

**గుడిపాల, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా గుడిపాల మండలం వెప్పాలమానుచేను గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ దూడను తీవ్రంగా గాయపరచి చంపివేయడంతో ఆ గ్రామస్తులకు చిరుత భయం వెంటాడింది. అయితే అటవీశాఖ అధికారులు వచ్చి దూడను చంపినది రేసు కుక్కలను నిర్ధారించడంతో అప్పటి వరకు భయాందోళనలు చెందిన గ్రామస్తులు స్థిమితపడ్డారు. వివరాలిలా వున్నాయి. గ్రామానికి చెందిన శివశంకర్ అనే రైతు దూడ బుధవారం తెల్లవారుజాము మేతకు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంకు వెళ్ళింది. ఈ క్రమంలో అటవీ సమీపంలోని పొలంలోకి ఎదో ఒక మృగం ప్రవేశించి గడ్డి మేస్తున్న దూడపై తీవ్రంగా దాడి చేసి చంపివేసింది. ఆ మృగం దూడ శరీరంలోని సగం మాంసంను భుజించివేయడంతో అక్కడికి చేరుకున్న గ్రామస్తులు తమ ప్రాంతానికి చిరుత వచ్చి దూడపై దాడి చేసి దాని శరీరంను తినివేసిందని ఆందోళన చెందిన సమాచారంను ఫారెస్టు అధికారులకు అందజేశారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమ సంఘటనా స్థలం చేరుకుని మృతి చెందిన దూడ ప్రక్కన వున్న కాళ్ళ గుర్తులను పరిశీలించి తనకు సైతం అనుమానం రావడంతో పశుసంవర్ధకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అక్కడికి చేరుకున్న పశుసంవర్ధకశాఖ అధికారులు దూడను చంపింది చిరుతపులి కాదని, రేసు కుక్కలని నిర్ధారించారు. దీందో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుసుమ మాట్లాడుతూ అటవీ పరిసరాల్లో గ్రామం వుండటంతో గ్రామస్తులు నిత్యం అప్రమత్తంగా వుండాలని, రాత్రి సమయాల్లో పశువులను పొలాల వద్దకు వెళ్ళనీయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# నకిలీ దర్శన టోకెన్లతో వస్తే కేసులు తప్పవు

### ఇ డిప్ టోకెన్లుంటేనే దర్శనానికి అనుమతి
### డ్రోన్‌కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ
### తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీసుబ్బరాయుడు

**తిరుమల,డిసెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఇప్పటికే టిటిడి ఆన్‌లైన్‌లో జారీచేసిన ఇడిప్ దర్శన టోకెన్లు పొందిన భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్పష్టం చేశారు. టోకెన్లు లేని భక్తులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో తిరుమలకు వచ్చినా ఆలయంలోనికి వెళ్ళేందుకు అవకాశం లేదని తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సంయమనంతో, నిబంధనల మేరకు తిరుమలకు చేరుకున్నా పవిత్రంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే, నకిలీ దర్శన టోకెన్లతో తిరుమలకు వస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి పోలీసుశాఖ పరంగా తీసుకున్న చర్యలు, భద్రత, క్యూలైన్ల నియంత్రణపై బుధవారం ఉదయం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మీడియాతో పలు అంశాలపై చర్చించారు. తొలిమూడురోజులు 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి పర్వదినాలతోబాటు జనవరి 1న దర్శన టోకెన్లు ఉన్న భక్తులనే ఆలయంలోనికి అనుమతించడంజరుగుతుందన్నారు. ఈ విషయాన్ని భక్తులు అందరూ తెలుసుకుని తిరుమలకు చేరుకోవాలని కోరారు. జనవరి 2 వతేదీ నుండి 8వరకు సాధారణ సర్వదర్శనంలో భక్తులను అనుమతించడం జరుగుతుందన్నారు. పోలీసుశాఖ పరంగా భక్తుల భద్రతకు చర్యలు తీసుకున్నామన్నారు. కొందరు దళారులు, ట్యాక్సీ డ్రైవర్లు, ట్రావెల్స్ నిర్వాహకులు నకిలీ టోకెన్లు తయారుచేసి భక్తులకు అందించేందుకు చూస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వాటిని భక్తులు నమ్మవద్దని, నకిలీ టోకెన్లు ఇచ్చినా, తీసుకున్నా చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. నకిలీ టోకెన్లు తీసుకుని భక్తులు కూడా మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. భక్తులు ఎలాంటి మధ్యవర్తులు, దళారుల మాటలు నమ్మకుండా నకిలీ టోకెన్లకు మోసపోవద్దని హెచ్చరించారు. తిరుమలతోబాటు తిరుపతి జిల్లాలోని ఇతర దేవాలయాలలో భక్తుల సౌకర్యార్థం, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుచేపట్టినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో మూడువేలమంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. తిరుమలలో రియల్ టైమ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంద్వారా సిసికెమెరాలతో, తిరుపతిలోని ఆర్టీసి బస్టాండ్, అలిపిరి,శ్రీవారిమెట్లు నడకమార్గాల్లో డ్రోన్‌కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ సాగుతుందని ఎస్పీ చెప్పారు. మొదటిమూడు రోజులకు ఇడిప్ దర్శన టోకెన్లు ఉన్న భక్తులను మాత్రమే దర్శనాలు ఉంటాయనేది పోలీసులు కూడా అలిపిరి, శ్రీవారిమొట్టుమార్గాల్లో అవగాహన కల్పిస్తారన్నారు. దళారుల మాటలు నమ్మవద్దని, టిటిడి అధికారిక మాధ్యమాల ద్వారా మాత్రమే సమాచారం తెలుసుకోవాలన్నారు. టోకెన్లు కలిగిన భక్తులు తప్పనిసరిగా ఆయా రోజుల్లో, సూచించిన నిర్దిష్టసమయానికి ఆ ప్రాంతానికి చేరుకుని క్యూలైన్లలో ప్రవేశించాలని సూచించారు. ఎవరైనా తప్పుడు సమాచారం ప్రచారం చేసినా, భక్తులను తప్పుదోవపట్టించినా చట్టపరమైన చర్యలు. ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహార చారి, శ్రీనివాసులు, డిఎస్పీలు వెంకట నారాయణ, భక్తవత్సలం, రామకృష్ణమా చారి, రమణారావు (డిసిఆర్‌బి), చంద్రశేఖర్, సిఐలు మద్దయ్యాచారి, విక్రమ్,ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## 30 తెల్లవారుజామున తెరచుకోనున్న వైకుంఠద్వారం - 30న ఏకాదశి, 31న ద్వాదశి



**తిరుమల,డిసెంబర్ 24ప్రభాత వార్తప్రతినిధి:** పవిత్రమైన ధనుర్మాసం ఈనెల 30వతేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి,ద్వాదశి ఘడియల సందర్భంగా కలియుగవైకుంఠం ఏడకొండల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారాలు మంగళవారం వేకువజామున 1.30గంటలకు తెరవనున్నారు. వైఖానస ఆగమోక్తంగా విశేష పూజాదికార్యక్రమాలు, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు తెల్లవారుజామున 1.40గంటలకు బంగారువాకిలికి సమీపంలో ఉన్న వైకుంఠద్వారాలను తెరిచి,ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం తెల్లవారుజామున 2గంటల నుండి రాజ్యాంగపరిధిలోని ప్రముఖులుకు దర్శనం కల్పిస్తారు. ఆ తరువాత ఉదయం 5గంటల నుండి ఆన్‌లైన్‌లో డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులను దర్శనానికిఅనుమతించేలా ఏర్పాట్లు చేపట్టారు. రెండురోజుల వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో తిరుమలలో విశేష ఉత్సవాలు జరుగుతాయి. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వయం పర్యవేక్షణలో ఈ ద్వార దర్శనాలు చేయించేలా ఏర్పాట్లు చేపట్టారు.

**-తొలిరోజు స్వర్ణరథం:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి స్వర్ణరథాన్ని ఉభయదేవేరులతో అధిరోహించి ఆలయ మాఢవీదుల్లో భక్తులను కటాక్షించనున్నారు.

**- రెండోరోజు చక్రస్నానమహోత్సవం:** ద్వాదశి పర్వదినాన పవిత్రపుష్కరిణిలో వేకువజామున చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు కూడా పవిత్ర స్నానాలాచరిస్తారు.

## శ్రీవారి సేవలో లక్ష్మీంద్రతీర్థస్వామి



**తిరుమల,డిసెంబర్ 24ప్రభాత వార్తప్రతినిధి:** కర్నాటక బెంగుళూరు కుందాపురం వ్యాసరాజమఠం పీఠాధిపతి లక్ష్మీంద్రతీర్థ స్వామికి టిటిడి చిన్నమర్యాద చేసింది. బుధవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయంవద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ పేష్కార్ రామకృష్ణ ,అర్చకులు ఇస్తికఫాలత్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులతో మనసు ఆనందం: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 24ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటే మనసు ఆనందంగా ఉంటుందని ప్రముఖులు విశ్వాసం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం స్వామివారి నైవేద్యవిరామసమయంలో సింగపూర్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టీస్ రమేష్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు, పారిశ్రామికవేత్త గల్లా జయదేవ్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం లోపలకు చేరుకున్న ప్రముఖులు శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో మీడియాకు దూరంగా ఉన్నారు.

# మరో సారి మాట నిలుపుకున్న డిసిఎం పవన్

**- అభిమాని నాగేశ్వరమ్మ కిచ్చిన మాట కోసం ఇప్పటం వెళ్లిన ఉప ముఖ్యమంత్రి - అండగా ఉంటానని భరోసా.. - రూ. 50 వేల ఆర్థిక సాయం - మనుమడి చదువులకు రూ. లక్ష అందజేత - నాగేశ్వరమ్మ పోషణకు తన జీతం నుంచి ప్రతి నెలా రూ. 5 వేలు**



అక్కున చేర్చుకుని తన బాధలు చెబుతున్న అభిమాని నాగేశ్వరమ్మ

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరో సారి తన మానవత్వాన్ని చాటుకున్నారు.ఇప్పటంలో తన అభిమాని,వృద్ధురాలు నాగేశ్వరమ్మ ఇంటికి స్వయంగా వెళ్ళారు."అమ్మా నీ పెద్ద కొడుకుని వచ్చా.. నిన్ను చూడడానికి వచ్చా.. బాగున్నావా.. నీ ఆరోగ్యం ఎలా ఉంది.. నాలుగు రోజులుగా నిన్ను చూసేందుకు వద్దామంటే ఆధికారిక కార్యక్రమాల వల్ల వీలుపడలేదు.. నీకిచ్చిన మాట కోసం ఈ రోజు పనులన్నీ వాయిదా వేసుకుని నీ కోసం వచ్చా." అంటూ మంగళగిరి నియోజకవర్గం, ఇప్పటం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లిన సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆమెను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని పలకరించారు. గత ప్రభుత్వ హయాంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారన్న అక్కసుతో ఇప్పటంలో ఇళ్ల కూల్చివేతల సమయంలో గత పాలకుల ఎదురు నిలచిన నాగేశ్వరమ్మ నా బిడ్డ ( పవన్ కళ్యాణ్ వస్తారు.. మీ బెదిరింపులకు భయపడం అంటూ రోడ్డెక్కారు. పవన్ కళ్యాణ్ స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి అందరికీ భరోసా ఇచ్చారు. శ్రీమతి నాగేశ్వరమ్మ గారి ఇంటి కొడుకుగా అండగా నిలుస్తాను అని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఆ సందర్భంలో – గెలిచిన తరవాత తన ఇంటికి రావాలని నాగేశ్వరమ్మ కోరారు. ఆమెకు ఇచ్చిన మాట మేరకు బుధవారం నాగేశ్వరమ్మ ఇంటికి వెళ్లి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులందరినీ పేరుపేరునా పలుకరించారు.సంక్రాంతికి చీర, ఖర్చులకు రూ. 50 వేల ఆర్థిక సాయం ఆ ఇంటికి కుమారుడిగా శ్రీమతి నాగేశ్వరమ్మ గారికి సంక్రాంతి పండుగ కానుకగా చీర బహూకరించారు. ఖర్చుల నిమిత్తం మరో రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మాటల మధ్యన ఈ రోజుకీ కుటుంబ పోషణ నిమిత్తం పొలం పనులకు వెళ్తున్నట్టు శ్రీమతి నాగేశ్వరమ్మ గారు చెప్పారు. ప్రతి నెలా తన జీతం నుంచి పిఠాపురంలో అనాథ చిన్నారులకు ఇచ్చిన విధంగా రూ. 5 వేలు పోషణ నిమిత్తం ఇంటికి పంపనున్నట్టు తెలిపారు. దివ్యాంగుడైన నాగేశ్వరమ్మ మనుమడు మనోజ్ సాయి చదువుల నిమిత్తం రూ. లక్ష సాయం చేశారు. ఆమె కుమారుడు శ్రీ కొండయ్య క్యాన్సర్ తో బాధపడుతున్న విషయం తెలుసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3 లక్షలు ఇచ్చారు.

# రుషికొండ ప్యాలెస్ వినియోగంపై త్వరలో నిర్ణయం

**- ప్రజలకు ఉపయోగపడేలా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా రుషికొండ ప్యాలెస్‌ను వినియోగించాలని భావిస్తున్నాం.. - హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ఇస్తే బాగుంటుందని చర్చించామని వెల్లడి - 28న మరోసారి భేటీ.. కేబినెట్ దృష్టికి ప్రతిపాదనలు: మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్**

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడకుండా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా విశాఖలోని రుషికొండ ప్యాలెస్ ను వినియోగించాలని భావిస్తున్నట్లు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ తెలిపారు. రుషికొండ ప్యాలెస్ ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ మూడవ భేటీ బుధవారం సచివాలయం రెండో బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీఏ సీఈవో, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు శ్రీనివాస్, ఈశ్వరయ్యలు రుషికొండ ప్యాలెస్ కు సంబంధించిన వివరాలు కమిటీకి వివరించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్యాలెస్ వినియోగంపై వచ్చిన పలు ప్రతిపాదనలను చర్చించామని, తాజ్, లీలా ప్యాలెస్, అట్మాస్ కోర్, ఫెమా సంస్థలు ముందుకొచ్చినట్లు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్ లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రుషికొండ భవనాలు హోటళ్లకు పూర్తి అనుకూలంగా లేవని తెలిపారు. ప్యాలెస్ లపై అదనంగా భవంతులు నిర్మిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వచ్చినట్లు మంత్రులు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలపై మరోసారి ఈనెల 28న ఆన్ లైన్ జీవోఎం మీటింగ్ లో చర్చిస్తామన్నారు.ఆ సమావేశంలో వచ్చే తుది ప్రతిపాదనలను రాష్ట్ర కేబినెట్ ఆమోదం కోసం పంపనున్నామన్నారు. అంతిమంగా హాస్పిటాలిటీ వైపు మొగ్గు చూపుతూ వయబుల్ మోడ్ లో ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు సబ్ కమిటీ పేర్కొంది. బీచ్ ఫ్రంట్ వినియోగంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తూ మాల్దీవులు, పుదుచ్చేరి తరహా విధానాలను అనుసరిస్తే బాగుంటుందని చర్చించామన్నారు. గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల పర్యాటక శాఖకు భారీ నష్టం వాటిల్లిందని మంత్రులు విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రుషికొండ ప్యాలెస్ ను హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ఇస్తే బాగుంటుందని భావిస్తున్నట్లు తెలిపారు. కానీ కొంతమంది రుషికొండ కింద ఉన్న 9 ఎకరాలు హోటల్స్ కోసం అదనంగా అడిగారని తెలిపారు. సీఆర్ జెడ్ నిబంధనల ప్రకారం 7 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదని తెలిసిందన్నారు. మిగిలిన 2 ఎకరాలను ఎలా వినియోగిస్తే బాగుంటుందో చర్చించామన్నారు. రుషికొండ ప్యాలెస్ లోని చివరి రెండు బ్లాక్ లు ప్రజలకు ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం, ఇతర అవసరాల కోసం ఉంచుతామన్నారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రజాధనం వృధా అయిందన్నారు. ఇవాళ జరిగిన భేటీలో పర్యాటక శాఖ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించామని నివేదిక వచ్చిన అనంతరం తదుపరి భేటీలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రుషికొండ ప్యాలెస్ వైట్ ఎలిఫెంట్ లా మారిందని విమర్శించారు.

## నెల్లూరును స్మార్ట్ సిటీగా మార్చాలన్నదే నా లక్ష్యం : మంత్రి నారాయణ



**నెల్లూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని పలు డివిజ న్ల లో శంకుస్థాపన చేసి న మంత్రి ప్రభుత్వ పాఠశాలలో క్రీడామైదాన మైన కోర్టులను పరిశీ లించిన మంత్రి అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు మంత్రి వెల్లడి నెల్లూరును సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి దిశలో ముందడుగు వేసేలా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా సిటీ నియోజవర్గ పరిధిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు బుధవారం ఒక్కరోజే అనేక కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి చేశారు.

39 వ డివిజన్‌లో రామిరెడ్డి, ఇల్లి, రేవల పాటి కాలువల ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నారాయణ ఆశయాలు నెరవేరాలని ముస్లిం పెద్దలు దువా చేసి ఆశీర్వదించారు. మూలాపేట బాలికోన్నత పాఠశాలలో ఆధునీకరణ పనులు పరిశీలించి మూలాపేట చమ్మండి వారి తోట పార్కులో 15 లక్షలతో సిద్ధమోతున్న వాలీబాల్ కోర్టును పరిశీలించారు .అదేవిధంగా 39వ డివిజన్ లో వాకర్స్ రోడ్ వద్ద ఉన్న వెంగన్న కాలువ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు 42వ డివిజన్ మన్సూర్ నగర్ లో గచ్చుకాలువ ఆధునీకరణ పనులు పరిశీలించి భూమి పూజ చేశారు. అనంతరం డివిజన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులకు స్థానిక హర్షం వ్యక్తం చేస్తూ అభివృద్ధి ప్రదాత నారాయణ అంటూ గుమ్మడి కాయతో దిష్టి తీశారు.48వ డివిజన్ లో ఘోషాసుపత్రి ఆధునీకరణ పనులు పరిశీలించి 49వ డివిజన్ లోని మోడల్ హైస్కూల్ లో బాస్కెట్ బాల్ బ్యాట్మెంటన్ ,త్రోబాల్ కోర్టుల పనులను పరిశీలించారు. పలు సలహాలు ఇచ్చి గ్రౌండ్ కి నాలుగు వైపులా సోలార్ ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 52వ డివిజన్ పీ ఎం అర్ హైస్కూల్ లో వాలీబాల్, బ్యాట్మింటన్ కోర్టుల పనులను పరిశీలించారు వెళ్లిన ప్రతీ చోటా మంత్రికి అడుగడుగు స్థానిక ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు నెల్లూరుకు ముంపు ముప్పు తప్పించాలని సంకల్పించానని 2017 లో వర్షాలకు నెల్లూరు మునిగిపోయిందన్నారు.

## త్వరలోనే సినిమా టికెట్ రేట్లకు ఒకే జీవో ఉండేలా నిర్ణయం : మంత్రి కందుల దుర్గేష్

**- సామాన్యులకు భారం లేకుండా, సినీ పరిశ్రమకు మేలు జరిగేలా త్వరలోనే నిర్ణయం..**

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సినిమా టికెట్ ధరల విషయంలో నెలకొన్న గందరగోళానికి తెరదించుతూ, అన్ని సినిమాలకు వర్తించేలా ఒకే సమగ్ర జీవోను తీసుకురావాలని భావిస్తున్నట్లు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం సచివాలయంలో జరిగిన సినిమా టికెట్ ధరల హేతుబద్ధీకరణ కమిటీ సమీక్షా సమావేశం అనంతరం మంత్రి దుర్గేష్ మీడియాతో మాట్లాడారు. ప్రతి సినిమా బడ్జెట్‌ను బట్టి విడివిడిగా జీవోలు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలికి, ఒకే విధానం కింద టికెట్ ధరలు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సినిమా పరిశ్రమ మనుగడ సాగించడంతో పాటు, సామాన్య ప్రేక్షకుడిపై భారం పడకుండా సమతుల్యత పాటిస్తామని, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సినీ పరిశ్రమకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. పెద్ద బడ్జెట్ సినిమా, ఆర్టిస్టుల రెమ్యూనరేషన్ పై చర్చించి ఒక నిర్ణయానికి వస్తామన్నారు. అన్నింటికీ కేటగిరీ ప్రకారం సమానంగా టికెట్ల ధరలు పెంచే విధానం పరిశీలిస్తున్నామన్నారు. త్వరలోనే డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సినీ పరిశ్రమ సమస్యలు కూడా విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలుగు సినిమా పాన్ ఇండియా దాటి పాన్ వరల్డ్ అయిందని అన్నారు. పాన్ ఇండియా సినిమా వల్ల నిర్మాతలకు బడ్జెట్ విపరీతంగా పెరుగుతోందన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఏపీలో సినిమా టికెట్ల రేట్ల హేతుబద్ధీకరణపై ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్, ఏపీ ఎస్ ఎఫ్ టీవీ మరియు టీడీసీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, లా డిపార్ట్ మెంట్ సెక్రటరీ, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమీక్షా సమావేశం ఇవాళ జరిగిందన్నారు. మల్టీప్లెక్స్ లు, సింగిల్ స్క్రీన్ల టికెట్ ధరల హేతుబద్ధీకరణపై, హై బడ్జెట్ సినిమా టికెట్ల పెంపునకు అనుసరించాల్సిన విధానాలపై కమిటీ చర్చించిందన్నారు. సమగ్రంగా చర్చించిన అనంతరం కమిటీ ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుందని వెల్లడించారు. ఇప్పటివరకు పాత జీవో ప్రకారం హోం శాఖ ద్వారా సినిమా టికెట్ రేట్లు పెంచుతున్నామని, ప్రస్తుతం లో బడ్జెట్, హై బడ్జెట్ సినిమాలకు ఎంత ధర ఉండాలనే అంశంపై కమిటీ చర్చిస్తోందన్నారు. ఎంత శాతం ఏపీలో చిత్రీకరణ జరపాలన్న అంశంపై నిబంధనలు నిర్ణయిస్తామన్నారు. షూటింగ్ లతో పాటు పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయాలుంటాయన్నారు. ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్న తర్వాత త్వరలోనే కొత్త జీవో జారీ చేస్తామన్నారు. అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత నిర్మాతలకు ప్రభుత్వం అండగా ఉండేలా కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇండియాలో ఏపీని చలచిత్ర నిర్మాణానికి ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. చలనచిత్ర, టెలివిజన్ పరిశ్రమ వృద్ధిని ప్రోత్సహిస్తామన్నారు.


## సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు : మంత్రి బిసి జనార్ధనరెడ్డి



**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాత వార్తప్రతి నిధి:** గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పవిత్ర తిరుమల క్షేత్రంలో అనేక అక్రమాలు, మహాపాపాలు జరిగాయని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారి సౌకర్యాల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా నిరక్ష్యం వహించిందని జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పాత్రపై కూడా ఇప్పుడు ప్రజలకు స్పష్టత వస్తోందని, అయితే ఆ వ్యవహారాలు న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున ఎక్కువగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టామని, ప్రసాదాలకు వాడే నెయ్యితో సహా అన్ని పదార్థాలను కఠినంగా పరీక్షించాకే వినియోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఏకాదశి రోజున వైకుంఠం దర్శనం ద్వారా 90 శాతానికి పైగా సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. అసలు దేవుడిపై నమ్మకం లేని వ్యక్తికి టీటీడీ లాంటి పవిత్ర సంస్థ బాధ్యతలు అప్పగించడమే గత ప్రభుత్వపు పెద్ద తప్పిదమని ప్రజలు భావిస్తున్నారన్నారు. గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని జనార్ధన్ రెడ్డి చెప్పారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు చేపట్టామని, సీఐఐ సదస్సుల ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు విశ్వసనీయ గమ్యస్థానంగా మారిందన్నారు. కొత్త పోర్టులు, ఐదు విమానాశ్రయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ప్రతిపక్షం తీరు మారాలి ప్రతిపక్ష నేతలు పెట్టుబడిదారులను భయపెట్టేలా మాట్లాడటం దురదృష్టకరమని, వారి బెదిరింపులకు ఎవరూ భయపడరని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు వైసీపీని 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ

## బ్రాడ్‌గేజ్ లైన్ కోసం మరో 300 ఎకరాల భూసేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ

**- అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు స్టేషన్ల మధ్య ఈ లైన్ నిర్మాణం**



**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** సుదీర్ఘకాలం స్వప్నంగా మిగిలిన ఎన్టీ జిల్లా (పశ్చిమకృష్ణా)పశ్చిమ ప్రాంత వాసులకే రైలు సదుపాయం అందుబాటులోకి రానున్నది.అమరావతి మీదుగా ఎర్రుపాలెం- నంబూరు స్టేషన్ల మధ్య నిర్మిస్తున్న బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ కోసం మరో 300 ఎకరాల భూసేకరణకు రైల్వేశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రమారమీ నాలుగున్న దశాబ్దాలుగా ఉమ్మడి ఏపీలోను,ఇప్పటి నవ్యాంధ్రలోను రైలు లైను ఏర్పాటు ప్రతిపాదనలున్నా, కార్యచరణకు నోచలేదు.జగ్గయ్యపేటలో రైలు స్టేషన్ ఉన్నా అది గూడ్స్ బండ్లకు పరిమితమైంది.దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా రైలు లైను ప్రతిపాదనలు ముందుకు సాగలేదు.అమరావతి మీదుగా ఎర్రుపాలెం- నంబూరు స్టేషన్ల మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణంకు కేంద్రం అనుమతినివ్వడంతో ఆ కల నెరవేరే అవకాశాలు మెరుగుపడ్డాయి.ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లాలోని వీరులపాడు, కంచికచర్ల మండలాల్లోని 8 గ్రామాల్లో 495 సర్వే నంబర్ల పరిధిలోని భూములను సేకరించాలని నిర్ణయించింది. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ, ఎసైన్డ్ భూములున్నాయి. పరిటాల గ్రామ పరిధిలో ఒక చోట 2.942 ఎకరాల గెస్ట్‌హౌస్ సైట్‌కు సంబంధించి హైకోర్టులో 3 పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది. ఈ భూముల సేకరణకు 2024 డిసెంబర్ 21న ప్రకటన ఇచ్చిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సంబంధిత అధీకృత అధికారి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని, వాటన్నింటినీ పరిశీలించిన తర్వాత ఈ రైల్వే లైన్ నిర్మాణం కోసం ఈ భూములను సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఇందులో పేర్కొన్న భూములన్నీ ఇక మీదట కేంద్ర ప్రభుత్వానికి చెందుతాయని స్పష్టం చేసింది. అమరావతి మీదుగా ఎర్రుపాలెం నంబూరు మధ్య నిర్మించనున్న 56.53 కి.మీ. బ్రాడ్‌గేజ్ లైన్ నిర్మాణం కోసం ఇబ్రహీంపట్నం మండలంలో 77.154 ఎకరాల భూమి సేకరించాలన్నారు.


వార్త

చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.

-ఐ.జాన్సన్

# ముదిమిలోనూ ఊరట!

వృద్ధాప్య వేగాన్ని వ్యాయామం ద్వారా తగ్గించుకోవచ్చునంటే ఓస్ ఇంతేనా!? అని అనిపిస్తుంది. అలా అనడమే తప్ప రోజూ ఓ అరగంట వ్యాయామం చేద్దామంటే అసలు తీరికే చిక్కదు. ప్రతి ఒక్కరు తమ జీవనశైలిని ఎప్పటికప్పుడు ఒత్తిడి, నిద్రలేమి, ఊబకాయాల దుష్ప్రభావాల నుంచి బయటపడే స్థాయిలోకి మార్చుకోవాలంటే కాస్త కష్టమే మరి! అలా మార్చుకోకపోతే ఆరోగ్య రీత్యా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని 'న్యూ సైంటిస్ట్' అనే శాస్త్ర విజ్ఞాన ఆంగ్ల పత్రిక ఒక అధ్యయన వ్యాసంలో ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధాప్య ఛాయలు తమ సహజ పెరుగుదలతో నిమిత్తం లేకుండా ముందస్తుగానే హెచ్చరించే పరిస్థితి కనపడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒత్తిడి, వేడిమి, ఊబకాయం, హృద్రోగాలు, కేన్సర్ మనుషుల సహజ వయసుపై ప్రభావం చూపుతున్నాయన్న విషయం విదితమే. వాటి తీవ్రత తెలుసుకోకపోతే ముందస్తు మరణాలు సంభవించే అవకాశం లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా గతంలో కంటే వేగంగా వృద్ధాప్యం తరుముకొస్తున్నట్లు వస్తున్న తాజా అధ్యయనాలు కొంత భయపెట్టేవే. అయితే ఇలాంటి ప్రమాదాన్ని తగ్గించుకోగల అవకాశాలపై శాస్త్రవేత్తల పరిశోధనలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఒకనాడు వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులు ఇప్పుడు అంతకన్నా చిన్న వయసులోనే సంక్రమిస్తున్నాయని వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో తాజాగా జరిగిన అధ్యయనంలో తేలింది. 1965కి ముందు జన్మించిన వ్యక్తులలో, ఇటీవలి దశాబ్దాలలో పుట్టిన వారిలో కంటే నిదానంగా వృద్ధాప్యపు ఛాయలు కనిపిస్తున్నాయి. 1965 తర్వాత జన్మించిన వారు ఎక్కువ ప్రభావానికి లోనవుతున్నారని, వీరికే వార్ధక్య లక్షణాలు కనపడుతున్నాయని గుర్తించింది. వృద్ధాప్యం, వృద్ధాప్య బాధలు, వ్యాధుల లక్షణాలు, సంక్రమిస్తున్న వ్యాధులపై జరిగిన అధ్యయనంలో ఎన్నో విషయాలను శాస్త్రజ్ఞులు గుర్తించారు. 2016లోఊబకాయంపై అధ్యయనం చేస్తున్న స్పెయిన్ వైద్య పరిశోధకులబృందం గుర్తించింది. ఊబకాయ జీవ సంబంధమైన ప్రభావాలు వృద్ధాప్యాన్ని ముందే తెస్తున్నాయని చెప్పారు. ఊబకాయం వల్ల కొవ్వు కణాలు పెరిగే పరిస్థితులు, ఆ తర్వాత అవి కరిగే అంశాల్ని పరిశీలించి చూస్తే వ్యాయామం వల్లకలిగే ప్రయోజనాలు తెలుస్తాయి. సామర్థ్యం క్షీణించటం, జీవక్రియల్లో చురుకుదనం తగ్గటం, వాతం మూలంగా కండరాలు, ఎముకలు, గుండె నాళాల వ్యవస్థ సహా శరీరంలోని అనేక అవయవాల పనితీరు సన్నగిల్లటం ఇందుకు కారణమని పరిశోధకుల శాస్త్రీయ అంచనా. నిరుడు వాషింగ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధన శాలలలో శీఘ్ర వృద్ధాప్యాలను గమనించేందుకు 1లక్ష 50వేల మంది రక్త నమూనాలను ప్రదర్శించారు. ఆ నమూనాలన్నీ 37నుంచి 54 ఏళ్ల వయసు వారివే. ఆ పరిశోధనలో 1965 తర్వాత జన్మించిన వారిలో 17శాతం వృద్ధాప్య ఛాయలు ఎక్కు వ వేగవంతంగా ఉన్నట్లు తేలింది. వారిలో ముందుగానే ఊపిరితిత్తులు, జీర్ణావయవ, గర్భాశయ, పేగు క్యాన్సర్లు వచ్చే సంకేతాలు కనిపించాయి. నడి వయస్కులు కేవలం ఊబకాయం వల్లనే వృద్ధాప్యానికి చేరువవుతున్నారని నిర్ణయించారు. వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్ డేటా ప్రకారం 519ఏళ్ల వారిలో ఊబకాయం రేట్లు 1975 – 2022మధ్య సుమారు 1000 శాతం వరకు పెరిగాయి. జీవనశైలిలో మార్పులు చేసుకోవటం ద్వారా ఊబకాయాన్ని, వృద్ధాప్య వేగాన్ని తగ్గించుకోవచ్చని శాస్త్రజ్ఞులు సూచిస్తున్నారు. వయోవేగాన్ని గుర్తించి వారు అంత వేగంగా ఎందుకు వృద్ధాప్యంలోకి జారుకుంటున్నారో తెలుసుకునేందుకు 'ఎపి జెనెటిక్' పరీక్ష చేస్తారు. తద్వారా ఆ వ్యక్తి డీఎన్ఏలో మార్పులను గమనించి వారి వృద్ధాప్యవేగాన్ని అంచనా వేస్తారు. దానిని బట్టి కూడా పలు జాగ్రత్తలు తీసుకునే వీలుంది. ఇది రోజువారీ ప్రక్రియ కాదు. కనుక తరచు పరీక్షలు చేసుకోవడం సాధ్యంకాదు. ఊబకాయులందరూ సాధారణంగా తీసుకునే జాగ్రత్తలే తీసుకుంటే అనారోగ్యం పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. జీవన శైలి తేడా లతో కొంతమంది వారి వాస్తవ వయసు కంటే 10 ఏళ్లు ఎక్కువగాలేదా 10ఏళ్లు తక్కువగా కనిపిస్తున్నారు. ఆరోగ్య కరమైన ఆహారం, లేదా బరువు తగ్గించే మందుల ద్వారా ఊబకాయాన్ని నివారించటం ద్వారా వయసు మీద పడే వేగాన్ని తగ్గించవచ్చు. ముందస్తు వార్ధక్యానికి కేవలం ఊబకాయం, ఒత్తిడి, కాలుష్యం కాదు. వాతావరణ మార్పులూ దోహదపడుతున్నాయి. శరీరంలోని అవయ వాలు సతాయించకుండా ఉంటే శతాధిక వత్సరాలు బతి కేయడం అలాంటి పరిస్థితి చక్కని వ్యాయామం ద్వారానే సాధ్యమని చెప్పిన మాటలను నమ్మడం తప్పని సరి. ప్రపంచంలోనే అమెరికాలో ఉన్న కెన్ని నికోలే 115 ఏళ్లు బతికింది. జపాన్‌కు చెందిన మి స్వాజుకి 117 ఏళ్లు. ఇప్పటికీ బతికేఉంది. ఇవి నిదర్శనాలు కాదనగలమా! ఈ ఏడాది ఆరంభంలో సదరన్ కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో 50 ఏళ్ళు పైబడిన 3,686 మంది వివరాలను పరిశోధించారు. వాతావరణంలోని అధిక స్థాయిలకు గురైన వ్యక్తులు మరింత వేగంగా వృద్ధాప్యానికి చేరువవుతున్నారని, ఉష్ణోగ్రతలో ప్రతి 10శాతం పెరుగుదల వారి వయసును 1.4 నెలలు పెంచుతోందని కనుగొన్నారు. గత ఆగస్టులో హాంకాంగ్ విశ్వవిద్యాలయం లో జరిగిన మరో అధ్యయనంలో 25 వేల మంది వయోజనుల డేటా పరిశీలన చేసి వారి శారీరక, మాన సిక ఆరోగ్య పరిస్థితులను బట్టి స్థిరమైన వ్యాయామమే మేలని నిర్ణయించారు. వృద్ధాప్య వేగాన్ని వ్యాయామం ద్వారా తగ్గించుకోగలగడం శుభకరం.



దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.

హెచ్. లాంగ్‌ఫెలో



విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.

డబ్ల్యు. ఎమర్సన్

## ప్రజావాక్కు



### వృద్ధులు అనాథలు కాకూడదు !

తల్లిదండ్రుల ఆస్తులుపంచుకోవటానికి కొడుకులు, కూతుళ్లు ముందుకు వస్తారు. తల్లిదండ్రుల్ని ప్రేమగా చూసుకునేందుకుమాత్రంవాళ్ళమనస్సు లు వెనక్కిపోతున్నాయి. ఇప్పుడేదోవయస్సులో వుండి, ఆరోగ్యంతో, ఒంటిబలంతో ఉన్నామనుకుంటే పొరపాటు. ఎప్పుడూ ఇలాగే ఉంటామనుకుంటే మహాపొరపాటు. అందరికీ వయస్సు పెరుగుతుంది. వృద్ధాప్యం వస్తుంది. చేసుకోలేని స్థితి దాపురిస్తుంది. ఇప్పుడు కళ్ళుమూసుకుపోయికన్నవాళ్ళని అనాదరణకి గురిచేసి, అసహించుకొని, అన్యాయంచేస్తే చేసుకున్నవాడికిచేసుకున్నంత మహదేవ!అన్నట్లు రేపువీళ్ల కొడుకులు, కూతుళ్లు అలాగేచేస్తారు. అప్పుడు తెలుస్తుంది చేసిన పాపమేమిటో! కొడుకులు, కూతుళ్ళ అభివృద్ధి కోసంఇదివరకు అమ్మ, నాన్నపడిన ఆరాటాన్ని, ఆతృతని, ఆవేదనని గుర్తు చేసుకొని, అర్థం చేసుకొని, తమ ఇంత అభివృద్ధికి వాళ్లే కారణమని వాళ్ళనిఅనాథల్ని చేయకుండా, చూసుకోవాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

ఇటీవలి కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగేవిధంగా తయారయ్యాయి. అదేవిధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగివాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి.

- టి. యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా

### ఆయుర్వేద వైద్యంపై దృష్టి

మనదేశంలో 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగామారింది. ఇటీవల జాతీయస్థాయిలో సంప్రదాయవైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు, మందులు వగైరా ఏర్పాటు నిమిత్తం దృష్టిసారించారు. ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలు అలవాటు పడడం మంచిది.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### భారత్‌కు కృతజ్ఞత చూపాలి

భారత్‌చరిత్రలో నిలచిపోయే గొప్పసహాయం 1971లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ మొక్కవోని సంకల్పంతో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి బంగ్లాదేశ్ అనే దేశాన్ని నిర్మించినందుకు ప్రతీ బంగ్లా పౌరుడు భారత్‌కు జీవితాంతం కృతజ్ఞత చూపాలి. ఈ ప్రయత్నంలో బంగ్లా బంధువుగా పేరుగాంచిన షేక్ ముజఫర్ రహ్మాన్‌నిత్యంమన మహాత్మాగాంధీని స్మరించుకోవాలి. ఆయన విగ్రహానికి జయంతి, వర్ధంతి రోజున పూలదండలు వేసి ఆయన చేసిన కృషిని తలచుకోవాలి. ఆయన కుమార్తె షేక్ హాసీనా పాలనవరకు భారతదేశంతో స్నేహహస్తాన్నిసారించింది. ఇప్పుడా బంగ్లాదేశ్ కృతజ్ఞతగా మెలగవలసిన సమయంలో కృతఘ్నత చూపిస్తున్నది. అవామీలీగ్ పార్టీ ప్రభుత్వాన్ని గద్దెదించిన మూల విరాట్టుగా చెప్పబడుతున్న షరీఫ్ ఉస్మాన్ హాది మరణంతో ఈ విధ్వంస కాండ జరిగిందని వార్త. అన్ని ప్రజా ప్రభుత్వాలు ఈ చర్యను తీవ్రంగా ఖండించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్య విద్యను, ఆరోగ్య సేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగాఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రైవేటువైద్య కళాశాలల సంఖ్య ప్రభుత్వ కళాశాలల కంటే ఎక్కువగాఉంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణలో ఇటీవల 8 కొత్త కళాశాలలు మంజూరు కావడంతో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 34కి పెరిగింది. ప్రభుత్వ వైద్య కళాశాలలు విద్యా, సామాజిక రీత్యా అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సర్పంచ్‌ల బాధ్యతలు

నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు ఆయా గ్రామాలలో ఇతర కులాలు, గ్రామాలు, ఇతర మండలాలకు చెందినవాళ్ళు ఎస్సి, ఎస్టీ, వికలాంగులకు సంబంధించిన ఇంటి స్థలం అక్రమంగా ఆక్రమించి మరుగు దొడ్లు, స్నానం గదులు నిర్వహించడం జరుగుతుంది. ఎస్సి ఎస్టీ అట్రాసిటీచట్టం కిందకేసులు నమోదు చేసి ఎస్సీ ఎస్టీల వికలాంగుల భూములు వారికి అప్పగించి తగిన న్యాయం చేసే విధంగా ప్రభుత్వం నూతన సర్పంచులకు ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామీణ ఉపాధి 'భరోసా' పదిలమేనా?

**ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సమయంలో కోట్లాదిమంది వలస కూలీలు మనదేశంలో ఆర్థికంగా ఎటువంటి ఒడిదొడుకులను ఎదుర్కోలేదంటే ప్రత్యేక కారణం ఉపాధి హామీ చట్టమే. రాష్ట్ర విభజన సందర్భంలో సాక్షాత్తు పార్లమెంట్లో ముక్తకంఠంగా ఇస్తామన్న ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తాన్నన్నవారు ఇప్పటివరకు ఆ ఊసేలేదు. అటువంటిది 40శాతం నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలంటే ప్రస్తుతమున్న తెలుగు రాష్ట్రాలకు వీలవుతుందా, పనిరోజులు పెంచి కేంద్రం నిధులకు నీళ్లొదిలింది ఈ కొత్త చట్టంతో. పార్లమెంటులో మన రాష్ట్ర పార్టీలు ఈపథకంపై రాష్ట్ర ఆర్థిక, సామజిక పరిస్థితిని లేదా వారిసలహాలు, సూచనలు ఇవ్వకపోవడం గ్రామీణ పేదకూలీలను పరిహసించ డమే అవుతుంది.**

డా. ఎ . భాగ్యరాజ్

చారిత్రాత్మక ఉపాధి హామీ చట్టంలో వచ్చిన మార్పులు గ్రామీణ కూలీ, కార్మికుల హక్కులను బలపరుస్తాయా లేదా అనే భయాలు మొదలయ్యాయి. బలహీనత చట్టంలో కాదు ఉద్దేశంలోను, నిర్మాణపరంగా ఉందా అనేది చూడాలి. ఉపాధి హామీ ఒక పథకం కాదు, ఒక హక్కు. భారత ప్రజాస్వామ్యంలో ఉపాధిహామీ పథకం (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) కేవలం పేదలకు పనికల్పించే ప్రభుత్వ పథకం మాత్రమే కాదు. అది గౌరవంగా బతికే హక్కుకు అనుబంధమైన ఒక సామాజిక భద్రతా చట్టం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు అంటే కేవలం ప్రాణం నిలుపుకోవడం కాదు, గౌరవంతో బ్రతికేందుకు అవసరమైన పని, ఆహారం, ఆశ్రయం, భద్రత అన్నీకూడా ఈ చట్టంలో భాగమే. ఈపథకానికి చట్ట రూపం ఇచ్చిందే 2005లో వచ్చిన ఉపాధి హామీ చట్టం. 1990ల తర్వాత భారతదేశం ప్రైవేటీకరణ, ప్రభుత్వ ఉద్యోగాల తగ్గింపు, వ్యవ సాయ రంగంలో సంక్షోభం, గ్రామీణ నిరుద్యోగం పెరుగు దలవలన రైతులు కూలీలు, కూలీలు, వలస కూలీలు గ్రామాలు వదలి వెళ్లటం వలనఖాళీ అవుతున్న ఊర్లుగా మారాయి. ఈ సామాజిక విపత్తుకు సమాధానంగా రూపొందిందేఉపాధి హామీ చట్టం. ఈ చట్టం వలన ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజులు పని హక్కుగా ఇవ్వడం జరిగింది. స్థానికంగా ఉపాధి కల్పించడం వలన వలసలను అరికట్టడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రధానమైనది. ఉపాధి లేకపోతే ఆహారం లేదు, ఆరోగ్యం లేదు, విద్య లేదు, స్వేచ్ఛలేదు. ఉపాధి హామీ చట్టం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పథకంకాదు, డిమాండ్ చేసినప్పుడు పని ఇవ్వాల్సినది ప్రభుత్వ బాధ్యత. పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇదే చట్టం లక్షణం. స్వాతంత్ర్యానంతరం ప్రజలలో గణనీయమైన మార్పును అందించిన పథకాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ఒకటి. మన్మోహన్ సింగ్ ప్రధాని కాలంలో ప్రముఖంగా చెప్పుకోవలసిన ప్రధానమైన పథకంగా చెప్పుకోవచ్చు. ఇది నగర గ్రామీణ ఆర్థిక వ్యత్యాసాలను రూపుమాపడానికి, గ్రామాల్లో పంటకాలం మినహా నిరుద్యోగం ఎక్కువగా ఉంటుంది. దాని వలన వలస కూలీలుగా పక్క రాష్ట్రానికో, పట్టణానికో ఎక్కువగా ఉండేది. దానిని రూపుమాపడానికి వచ్చిన పథకమే ఈ ఉపాధి హామీ పథకం(2005). తరువాత ఇది చట్టంగా రూపు దిద్దుకొని 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా మారింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం ప్రజల మధ్య ధనచక్రాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశం. తొలిదశలో ఉపాధి హామీ 2006–2013 మధ్య కోట్లాది మంది గ్రామీణ పేదలకు ఉపాధి, మహిళల భాగస్వామ్యం 50 శాతానికి పైగా దళితులు, ఆదివాసీలకు ఉపాధి కల్పించింది. గ్రామాల్లో చెరువులు తవ్వడం, రహదారులు, కాలువలు నిర్మించుకోవడం వలన గ్రామీణ పేదల ఆదాయం పెరగడం, స్థానిక మార్కెట్లకు గిరాకి, పేదరికం తగ్గడానికి ముఖ్య కారణంగా మారింది. 2014 తర్వాత పాలకుల దృష్టిలో ఉపాధి హామీ చట్టం భారంగా, పేదలను సోమరులుగా చేసే పథకంగా, ఉత్పాదకత లేని ఖర్చుగా చూడడం కారణంగా బడ్జెట్ కత్తిరింపులు, చెల్లింపుల్లో ఆలస్యం, పని దినాల తగ్గింపు, హక్కుగా ఉన్న ఉపాధి వారి దయా దాక్షిణ్యాలపై ఆధారపడింది. ఉపాధి హామీ చట్టం ప్రకారం డిమాండ్ ఉన్నంత పని ఇవ్వాలి. నిధులు అడ్డంకికాకూడదు. కానీ వాస్తవం ఏంటంటే సంవత్సరాంతానికి నిధులు ఖాళీ అని, నెలల తరబడి కూలీ వేతనాలు బకాయి చెల్లించక పోవడం, రాష్ట్రాలపై నిందలేయడం పూర్తిగా చట్ట ఉల్లంఘన తప్పించుకొనే ప్రక్రియగా మారింది. ప్రస్తుత పథకం (విబిజి రామ్‌జి)బిజెపి ప్రభుత్వం ఎటువంటి ముందస్తుగా



ప్రతిపక్షాలకు తెలియజేయకుండా, చర్చలు జరపకుండా నిన్నటి శీతాకాల సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదంపొందిన ఈ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబిజిరామ్‌జి) గురించి మొదటిదిగా చెప్పుకోవలసింది ఏదైనా పని ఉంటే మాత్రమే పనికి తీసుకుంటాము అనేది. దీనివలన పని ఇవ్వాలనే చట్టం నీరుగారిపోతుంది అనేది ప్రతిపక్షాల ఆందోళన. రెండోది డిమాండెపై పని చేయండి అనేది పోయి, ఆ గ్రామంలో ఉండే పనికి ఎంతమంది, ఎన్నిరోజులు అవసరమో అన్నిరోజులు మాత్రమే పని ఉంటుంది. ఒకొక్క రాష్ట్రానికి తగ్గట్టు రోజు కూలీ నిర్ణయించబడుతుని అని చెబుతూ రాష్ట్రాలు 40 శాతంనిధులు సమకూర్చుకోవాలని పెట్టడం రాష్ట్రాలకు ఇబ్బందికరమైనది. రాష్ట్రాల నుంచి పన్నులన్నీ కేంద్రంతీసుకొని రాష్ట్రంపై బరువు పెడితే ఎలా? చట్టంగా ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం సరిగా నిధులివ్వడం లేదు. అటువంటిది బాధ్యతల పేరుతో రాష్ట్రంపై40శాతం నిధులను సమకూర్చుకోవడానికి భాగస్వామ్యం చేసి కేంద్రం వెనక్కితగ్గడమే ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇది ఒకరకంగా కేంద్రం చేస్తున్న రాజకీయమే. పాత ఉపాధి హామీలో 33శాతం మహిళలకు ప్రథమంగాఉండాలి. కానీ ఈ చట్టంలో కచ్చితమైన సంఖ్య చెప్పలేదు. మహిళలు, దళితులు, ఆదివాసీలు మొదట నష్టపోతారు. ఉపాధి హామీ బలహీనపడితే ముమ్మాటికీ గ్రామాలలో పేదమహిళల ఆదాయం తగ్గుతుంది. దళితుల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింటుంది. ఆదివాసీల జీవనాధారం కూలిపోతుంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, సామాజిక న్యాయంపై దాడిగా చూడవలసి వస్తోంది. డిజిటలైజేషన్ పేరుతో ఆధార్ లింకింగ్, మస్టర్ (హాజరు పట్టిక)రోల్ ఫోటోలు పెట్టడం మంచిదే. వాటివలన గ్రామాలలో పని వాటి విలువలలో పారదర్శకత ఉంటుంది. కానీ అందరికి ఆండ్రాయిడ్ చరవాణి అందుబాటులో ఉంటుందా అనేది ప్రశ్న. దేశవ్యాప్తంగా ఉన్న పేదవారికి అడిగినన్ని రోజులు వారు డిమాండ్ చేసినన్ని రోజులు పని ఇవ్వాలనేది పాత చట్ట రూపకల్పనకు ఆత్మ. కానీ ఈ చట్టంలోని సెక్షన్ 5(1) ప్రకారం ఎప్పుడు, ఎక్కడ పథకం అమలౌతుందనే విచక్షణాదిహారం కేంద్రం చేతిలో ఉంటుంది. ఇది ఆమోద యోగ్యమైనది కానిది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నడిపించిన గాంధీ పేరుని ఈ పథకంపేరు నుండి తీసివేయడం వారిరాజకీయ దురుద్దేశాన్ని తెలియజేస్తుంది. చూస్తుంటే ఒక విధంగా ఇది రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. బిజెపి గత పదిసంవత్సరాలనుండి మొదటి నాళ్లలో ఇందిరాగాంధీని అత్యవసర (ఎమర్జెన్సీ) కాలాన్ని చూపించి పదేపదే ఆమెను తక్కువ చేసి చెప్పారు. తరువాత నెహ్రూని చైనాతోయుద్ధం, కాశ్మీర్ వ్యవహారం, సోషలిజంపై నిరంతరం చిన్నబుచ్చే పనిచేయడం చేస్తున్నారు. ఆ క్రమంలోనే గాంధీ పేరును ఈ ఉపాధి హామీపేరును మార్చి రాముడి పేరు చేర్చిమత రాజకీయానికి స్థిరమైన బీజంవేస్తోంది. అన్ని మతాలవారు ఈ పథకంలో పనిచేసే వారుంటారు. కానీ ఈ ప్రభుత్వం జాతీయ నాయకుల స్ఫూర్తిని మరచి మతరాజకీయానికి తెరలేపింది. రాముడి పేరుచేర్చాలంటే కొత్తగా ఒకపథకం పెట్టిచేయలేరా! ఒక విధంగా భవిష్యత్తు తరాలకు మతవాదాన్ని పెంచే విధంగా ఉంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముందుండి నడిపించిన నాయకులను దూరంచేయడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. గాంధీ దేశ నిర్మాణాన్ని తన సిద్ధాంతాలతో, త్యాగాలతో, పోరాటాలతో ఒక్క చుక్క రక్తం చిందించకుండా ముందుకు నడిపించి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడు. ఇప్పటికీ ఈదేశంలో అంతఃకలహాలు, మతకలహాలు లేకుండా ఉన్నాయంటే కారణం ఆయన నడిచిన, చూపిన దారి వల్లనే. అంతటి మహనీయుని పేరుని గ్రామీణ ఉపాధి చట్టం నుంచి తొలగించడం దేశానికే అవమానకరమైనది. ఈ పథకం వలన ముఖ్యంగా రైతుల ఆత్మహత్య, వలసలు తగ్గింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం, కరోనా సమయంలో కోట్లాదిమంది వలస కూలీలు మనదేశంలో ఆర్థికంగా ఎటువంటి ఒడిదొడుకులను ఎదుర్కోలేదంటే ప్రత్యేక కారణం ఉపాధి హామీ చట్టమే. రాష్ట్ర విభజన సందర్భంలో సాక్షాత్తు పార్లమెంట్లో ముక్తకంఠంగా ఇస్తామన్న ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తాన్నన్నవారు ఇప్పటివరకు ఆ ఊసేలేదు. అటువంటిది 40శాతం నిధులు రాష్ట్రాలు సమకూర్చుకోవాలంటే ప్రస్తుతమున్న తెలుగు రాష్ట్రాలకు వీలవుతుందా, పనిరోజులు పెంచి కేంద్రం నిధు లకు నీళ్లొదిలింది ఈ కొత్త చట్టంతో. పార్లమెంటులో మన రాష్ట్ర పార్టీలు ఈపథకంపై రాష్ట్ర ఆర్థిక, సామజిక పరిస్థితిని లేదా వారిసలహాలు, సూచనలు ఇవ్వకపోవడం గ్రామీణ పేదకూలీలను పరిహసించడమే అవుతుంది. మన తెలుగు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు బెంగాల్, తమిళనాడు సభ్యులను చూసినేర్చుకోవాలి. ప్రభుత్వాలకు పథకాల పేర్లమార్పు మీదఉన్న శ్రద్ధకంటే నిర్వహణ మీదచూపిస్తే బాగుంటుంది. ●

# కమ్యూనిస్టు ఆలోచనల తిరోగమనం!



అభిషేక్ జగిని

ఇటీవల కేరళ రాష్ట్రంలో ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు భారత రాజకీయాల్లో ఓ కొత్త అధ్యాయానికి నాంది పలికాయి. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ–ఎన్డీయే కూటమి స్పష్టమైన మెజారిటీ సాధించి, 45 ఏళ్లుగా కొనసాగిన ఎల్డీఎఫ్ ఆధిపత్యాన్ని చరిత్రలో నిలిచిపోయేలా తుడిచిపెట్టింది. 100 వార్డుల్లో 51 స్థానాలు గెలుచుకుని, తొలి సారిగా మేయర్ పదవిని చేపట్టబోతోన్న బీజేపీ విజయం, కేరళ యువత అభివృద్ధి, ఆధునికత వైపు తలంచిన స్పష్టమైన సంకేతం. ఇది కేవలం రాజకీయ విజయం కాదు. కమ్యూనిస్టు ఆలోచనాపద్ధతి కూలిపోతున్న సంకేతం. త్రిపుర, బెంగాల్ అనంతరం ఇప్పుడు కేరళలో కమ్యూనిస్టు ఆధిపత్యం వెనక్కి వెళ్లడం, భారత రాజకీయ పరిణామంలో సహజమైన తదుపరి ఎనర్జీ మార్పు అని చెప్పవచ్చు. తిరువనంతపురంతోపాటు మొత్తం 93వార్డులు గెలుచుకున్న బీజేపీ, పాలక్కాడ్ మున్సిపాలిటీలో తన పట్టు కొనసాగించింది. త్రిపునితురలో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించడం, గత ఎన్నికలతో పోలిస్తే గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీనడ్డా ఈ విజయాన్ని కేరళలో మార్పుకోసం ప్రజల కోరికగా విశ్లేషించారు. ప్రధాని నరేంద్ర మోడీ వికసిత కేరళ దృష్టి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన రహదారులు, ఆరోగ్యం, విద్యవంటి అభివృద్ధి కార్యక్రమాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఉదాహరణకు, తిరువనంతపురంలో డెలివరీ వర్కర్‌గా ప్రారంభించి ఎన్నికల్లో విజయం సాధించిన శ్రుతి ఎమ్ వంటి అభ్యర్థులు పార్టీని ప్రతిబిం బించే మెరిట్ ఆధారిత వ్యవస్థకు నిదర్శనం. ఇది వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక విలువలను నిలబెడుతోంది. కమ్యూనిస్టు ఆధిపత్యం కుంగిపోతుంది. త్రిపురలో ఒకశాతం ఓట్లతో ప్రారంభించి బీజేపీ రెండుసార్లుప్రభుత్వం ఏర్పాటు చేసింది. బెంగాల్‌లో సీపీఎమ్ ఆస్తిత్వమే ప్రశ్నార్థకమైంది. ఇప్పుడు కేరళలో ఎల్డీఎఫ్ ఒక్క కార్పొరేషన్‌కే పరిమితమైంది. ఉత్తర కేరళలో ముస్లిం ఓటర్ల లో కూడా కొత్త తరహా ఆలోచన చోటు చేసుకుంటోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పినట్టుగా, కేరళలో 25శాతం ఓటు షేర్ సాధించాలని బీజేపీ తీసుకున్న సంకల్పం ఈ ఫలితాలతో మరింత బలమైనది. బీజేపీ నాయకులు సోషల్ మీడియాలో యువత అభివృద్ధి, జాతీయ వాదం వైపు మొగ్గ చూపుతున్నట్టు విశ్లేషిస్తున్నారు. న్యూస్ రిపోర్టులు కూడా ఈ ధోరణిని ధృవీకరిస్తున్నాయి. హిందూ ఓటర్లు బీజేపీ వైపు సానుకూలంగా మారుతున్నారు. ఎల్డీ ఎఫ్ హిందూ అవుట్‌రీచ్ విఫలమైంది. సమతుల్య దృష్టితో చూస్తే యూడీఎఫ్ (కాంగ్రెస్ నేతృత్వం) ఇప్పటికీ నాలుగు కార్పొరేషన్లు, అనేక పంచాయతీలు గెలుచుకొని ఆధిక్యంలో నిలిచింది. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ బీజేపీ ప్రదర్శన 'చారిత్రాత్మకమని'పేర్కొనడం, రాష్ట్రరాజకీయ డైనమిక్స్ మార్పుకు ప్రతీక. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బీజేపీ బలపడటం అవసరమే అయినప్పటికీ, ఈఎన్నికల ఫలితాలు యూడీఎఫ్–ఎల్డీఎఫ్ మధ్యసుదీర్ఘ ద్వంద్వ రాజకీయాలకు సవాల్ విసురుతున్నాయి. ముగింపుగా, కేరళ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ వ్యాప్తిని, కమ్యూనిస్టు క్షీణతను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ఉత్తరంనుంచి దక్షిణం వరకు వికసిత భారత్" దిశగా యువత ముందుకు సాగుతోంది. ●

# సామాజిక రుగ్మతల నుంచి బయటపడలేమా?

మేకిరి దామోదర్

ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని అందరికీ తెలుసు. దీనిపై ప్రభుత్వాలూ, వైద్య నిపుణులూ ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. పొగాకు, మద్యం ఉత్పత్తులపై భయానక చిత్రాలు, ప్రకటన బోర్డులు, సినిమాల్లో కూడా మద్యపానం, ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే హెచ్చరికలు తప్పనిసరిగా దర్శనమిస్తుంటాయి. అయితే ఈ హెచ్చరికలు చూసి నిజంగా ఎంతమంది ఈ దురలవాట్లకు దూరమవుతున్నారు? సమాధానం అందరికీ తెలిసినదే. హెచ్చరికలు పెరుగుతున్నా, వ్యసనాలు తగ్గడం లేదు. ఫలితంగా ప్రాణాంతకమైన క్యాన్సర్లు, గుండె జబ్బులు, కాలేయవ్యాధులు వంటి అనేక రుగ్మతలు పెరుగుతున్నాయి. ఎన్నో పచ్చటి సంసారాలు ఈ వ్యసనాలబారిన పడి ఛిన్నాభిన్నమవుతున్నాయి. ధూమపానం, మద్యపానం వంటి ప్రజారోగ్యానికి తీవ్ర హాని కలిగించే ఉత్పత్తులను సమూలంగా నిర్మూలించాల్సిన ప్రభుత్వాలు, వాటిపై పన్నులు పెంచడమే పరిష్కారమని భావిస్తున్నాయా? పన్నులు పెరిగితే ప్రజలు వాడకం మానేస్తారని ప్రభుత్వంఆశిస్తుందా? వాస్తవానికి ఇది పనిచేయడం లేదు. ఎందుకంటే ఈ ఉత్పత్తులపై వచ్చే ఆదాయమే ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆధారంగా మారింది. గ్రామీణ పేదలు, మధ్యతరగతి కుటుంబాల సంపాదన ఈ దురలవాట్లలోనే కరిగిపోతోంది. ఒకవైపు ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరిట ఒక చేయి ధనం ఇస్తూ, మరోవైపు మద్యపానం, ధూమపానం ద్వారాపన్నుల రూపంలో ప్రజల జేబులను ఖాళీ చేయడం పరిపాటిగా మారింది. ఇది నిజంగా సంక్షేమ పాలనా? లేక ద్వంద్వ విధానమా? ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే ఈ వ్యసనాల ద్వారా ఆదాయం సంపాదించడమే అత్యంత విషాదకరమైన వాస్తవం. ప్రజల ఆరోగ్యం కంటే ఆదాయమే ముఖ్యమన్న భావన ప్రభుత్వ విధానాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ధూమపానం, మద్యపానం విడివిడిగా ప్రమాదకరమే అయినా, ఈ రెండూ కలిస్తే ఆరోగ్యానికి మరింత ప్రమాదకరమని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు వ్యసనాలకు పరస్పర సంబంధం ఉందని శాస్త్రీయంగా రుజువైంది. సాధారణంగా ధూమపానం చేయని వారు కూడా మద్యం సేవించే సమయంలో పొగతాగడం గమనించవచ్చు. దీనికి కారణం ఏమిటి అనే అంశంపై సీసీఎంబీ పరిశోధకులు అధ్యయనం చేశారు. పొగాకులోని నికోటిన్ మద్యం తాగాలనే కోరికను పెంచుతుందని, అలాగే మద్యం సేవించిన వారికి నికోటిన్ తీసుకోవాలనే కోరిక మరింత బలపడుతుందని వారి పరిశోధనలో తేలింది. ఆల్కహాల్, నికోటిన్ పదేపదే తీసుకోవడం వల్ల మెదడులోని అభ్యాస సర్క్యూట్‌లో ఇవి జతగా మారతాయి. దాంతో ఒకటి తీసు



కుంటే మరొకటి కావాలనే తపన పెరుగుతుంది. ఈప్రక్రియ వ్యాధుల ప్రమాదాన్ని మరింత పెంచుతుందని, ప్రాణాంతకమయ్యే అవకాశాలుఎక్కువగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ రెండు వ్యసనాలు క్యాన్సర్, గుండె జబ్బులు, కాలేయ సమస్యలతోపాటు మానసిక ఆరోగ్యంపైకూడా తీవ్ర ప్రభావం చూపుతాయి. విడివిడిగా ఈ వ్యసనాలను మాన్పించడానికి చికిత్సలు, మందులు ఉన్నప్పటికీ, రెండు అలవాట్లు కలిగినవారిలో చికిత్స ప్రభావం తక్కువగా ఉంటోంది. ఒక వ్యసనాన్ని లక్ష్యంగా చేసుకుని చికిత్సఅందిస్తే, మరో వ్యసనం మరింత పెరిగే ప్రమాదం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. వ్యసనాల మూలం మద్యపానం, ధూమపానం ఒకదానితో ఒకటి బలంగా జతకట్టడానికి కారణం గ్లూటమేట్ అనే న్యూరోట్రాన్స్‌మిటర్. ఇది మెదడులోని అతిపెద్ద ఉత్తేజక రసాయనం. ఆల్కహాల్, నికోటిన్ తీసుకోవడం వల్ల గ్లూటమేట్ స్థాయి పెరుగుతుంది. దీంతో మెదడులోని"రివార్డ్ సర్క్యూట్రీ" మరింత చురుకుగా మారి వ్యసనాన్ని కొనసాగించేలా చేస్తుంది. న్యూరాన్లు పరస్పరం సంభాషించుకునే విధానం, ఆనందం–విశ్రాంతి వంటి అనుభూతులు కలిగించే ప్రక్రియలపై ఈ పదార్థాల ప్రభావం ఇప్పటికే శాస్త్రవేత్తలకు స్పష్టమైంది. ఆహారం, శృంగారం, సామాజిక సంబంధాలు సహజంగా ఈ సర్క్యూట్రీని యాక్టివేట్ చేస్తాయి. కానీ మద్యపానం, ధూమపానం వంటి కృత్రిమ ఉత్తేజకాలు ఈ ప్రక్రియను దుర్వినియోగం చేసి మనిషిని వ్యసనాల బానిసగా మారుస్తాయి. ఇంతగా ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న మద్యపానం, ధూమపానాన్ని నియంత్రించి ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడం రాజ్యాంగం ప్రభుత్వాలకు విధించిన కర్తవ్యం. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈబాధ్యతను పూర్తిగా నిర్వర్తించలేకపోతున్నాయి. మద్యపానం, ధూమపానం వల్ల అధికంగా డబ్బు ఖర్చు చేసి అనారోగ్యం పాలవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆరోగ్యవంతమైన రాష్ట్రం, దేశంఎలాసాధ్యమవుతుంది? సామాజిక రుగ్మతల వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నప్పటికీ, వీటిపై వచ్చే ఆదాయాన్ని ప్రధాన వనరుగా భావించడం అమానవీయతకు పరాకాష్ట. ఇది సంక్షేమ రాజ్యం, శ్రేయో రాజ్య భావనకు పూర్తిగా విరుద్ధం. జబ్బు ఒకటి – మందొకటి అనే ద్వంద్వం విడనాడాలి. నిజంగా ప్రజా సంక్షేమమే ప్రభుత్వాల ఆశయమైతే, మద్యపానం, ధూమపానంపై పన్నులు వేస్తూ హెచ్చరిక ప్రకటనలతో కాలం గడపడం సరిపోదు. ఈ ఉత్పత్తులే ప్రధాన ఆదాయ వనరుగా భావించడం మానవీయ పాలన కాదు. మద్యపానం, ధూమపానం తదితర మత్తుపదార్థాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వాలు కట్టుబడాలి. వాటి ఉత్పత్తి కేంద్రాలను దశలవారీగా మూసివేయాలి. ప్రభుత్వాల ప్రచార ఆర్భాటాలు, దుబారా ఖర్చులను తగ్గించి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయాలి. ప్రజారోగ్యాన్ని కేంద్రీకృతంగా చూసే విధానాలకు మారాల్సిన అవసరం ఉంది. ఈ విషవలయంలో నుంచి ప్రజలను బయటకు తీసుకురావడమే నిజమైన సంక్షేమం, శ్రేయో రాజ్య నిర్మాణానికి సరైన మార్గం. ●

# ప్రపంచంలో అతిపెద్ద మెట్రో..ఢిల్లీ




## మరో మూడు కారిడార్లకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

## ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.12,014.91 కోట్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌కమిటీ ఢిల్లీమెట్రో ఐదో దశ ప్రాజెక్టును ఆమోదించింది. మొత్తం రూ. 12,014,91కోట్ల వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆర్‌క ఆశ్రమ్ మార్గ్‌నుంచి ఇంద్రప్రస్థ, ఏరోసిటినుంచి ఐజిడి ఎయిర్‌పోర్టు టెర్మినల్ వన్, తుగ్లకాబాద్‌నుంచి కాలిందికుంజ్‌వరకూ మొత్తంమూడు మెట్రో కారిడార్లను అఉమతించింది. ఢిల్లీమెట్రో ఐదోదశ ప్రాజెక్టు మొత్తం 16.076 కిలోమీటర్ల నిడివితో ఉంటుందని మొత్తం ప్రాజెక్టు వ్యయం 12వేల కోట్లకుపైబడి ఉంటుందని కేబినెట్ సమావేశం తర్వాత పీఎంఒ ప్రకటన విడుదల చేసింది. అలాగే సెంట్రల్ విస్టా కారిడార్‌తో కర్తవ్యభవన్‌లు అన్నింటికీ కనెక్టివిటీపెరుగుతుంది. ఆఫీసులకువెళ్లేవారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సుమారు 60వేలమంది ఆఫీసులకు వెళ్లేవారు, రెండు లక్షలమందికిపైగా సందర్శకులకు ఈ కారిడార్‌వల్ల ఎంతోమేలు జరుగుతుంది. అలాగే శిలాజ ఇంధనాలవల్ల ఎలాంటి కాలుష్యం ఉండదని కేంద్రం చెపుతోంది. ఈ విస్తరణ పనుల్లో మొత్తం 13 స్టేషన్లు ఉంటాయి. వీటిలో పది స్టేషన్లు భూగర్భంలోను మూడు స్టేషన్లు ఎలివేటెడ్ స్థాయిలో ఉంటాయి. నాలుగోదశనిర్మాణంలో ఉంది. 111 కిలోమీటర్లు 83 స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. 80.43 శాతం నిర్మాణం పూర్తికావచ్చింది. డిసెంబరు 2026 నాటికి మొత్తం పూర్తవుతుందని అంచనా. ఢిల్లీ మెట్రో సాయంతో మొత్తం 65 లక్షలమంది ప్రయాణీకుల రాకపోకలకు వీలవుతోంది. ఒక్కోసారి రోజుకు 81.87 లక్షలమంది కూడా ప్రయాణిస్తుంటారు. మొత్తం 12 మెట్రో లైన్లు 395 కిలోమీటర్ల నిడివితో 289 స్టేషన్లతో ఢిల్లీమెట్రో నడుస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రోప్రాజెక్టుగా ఢిల్లీమెట్రో నడుస్తోంది.

# బిజెపి విధానాలు చిన్నవ్యాపారులకు దెబ్బ

## కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చిన్న వ్యాపారాలు చేసే వారిని ముఖ్యంగా వైశ్య వర్గాన్ని దెబ్బతీస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఆ వర్గానికి తాను మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిజెపి మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వైశ్యవర్గానికి చెందిన వ్యాపారులతో రాహుల్ భేటీ అయ్యి మాట్లాడారు. చర్చల అనంతరం వారి సమస్యలపై రాహుల్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. మా వ్యాపారం పతనానికి దగ్గరగా ఉంది అంటూ వైశ్య సమాజం నుంచి వచ్చిన ఆవేదన నన్ను తీవ్రంగా కలచివేసింది. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో దోహదపడిన సమాజం నేడు ఇలా నిరాశలో కూరుకుపోవడం ఓ హెచ్చరిక లాంటిది. గుత్తాధిపత్య సంస్థకు స్వేచ్ఛనిచ్చి చిన్న, మధ్యతరహా వ్యాపారులపై అధికారం, జిఎస్టీ వంటి విధానాలతో ప్రభుత్వం భారం మోపుతోంది. ఇది కేవలం విధాన వైఫల్యం మాత్రమే కాదు. ఉత్పత్తి, ఉపాధితో పాటు భారత భవిష్యత్తుపైనా ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. బిజెపి ప్రభుత్వ మనస్తత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని రాహుల్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో దేశ వాణిజ్యానికి వెన్నెముక అయిన వైశ్య వర్గానికి తాను మద్దతుగా నిలబడతానన్నారు.

# 20 యేళ్ల తర్వాత కలిసిన థాకరే సోదరులు

## మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని వెల్లడి



**ముంబయి, డిసెంబరు 24:** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. విభేదాలతో విడిపోయిన థాక్రే సోదరులు ఉద్ధవ్ థాక్రే రాజ్ థాక్రే మళ్లీ కలిశారు. ముంబై స్థానిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడి పోటీ చేస్తామని ప్రకటించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో అన్నదమ్ములిద్దరూ కీలక ప్రకటన చేశారు. జనవరి 15న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో శివసేన (ఠాక్రే వర్గం), మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. ముంబైకి మరాఠీ మేయర్ రానున్నారని వెల్లడించారు. కాగా, 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకున్నారు. ఈ ఏడాది జులైలో ముంబైలో నిర్వహించిన వాయిస్ ఆఫ్ మరాఠీ కార్యక్రమంలో తొలిసారి ఒకే వేదికపై కనిపించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇకపై ఇద్దరం కలిసే ఉంటామని సోదరులు అప్పుడు స్పష్టం చేశారు. ఇక అన్నదమ్ముల కలయికపై ఇరు పార్టీల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విడాకుల నోటీసు పంపించిందని భార్యను కాల్చి చంపిన ఐటి ఉద్యోగి



**బెంగళూరు, డిసెంబరు 24:** తనతో విడిపోయి దూరంగా ఉంటున్న భార్య విడాకుల నోటీసు పంపడంతో తట్టుకోలేకపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆమెను కాల్చి చంపాడు. ఆపై పోలీసులకు లొంగిపోయాడు. ఐటీహబ్ బెంగళూరులో జరిగిందీ ఘటన. పోలీసుల కథనం ప్రకారం నిందితుడు బాలమురుగన్ (40), భువనేశ్వరి (39) 2011లో ప్రేమ వివాహం చేసుకున్నారు. బాలమురుగన్ గతంలో ప్రముఖ ఐటీ సంస్థ క్యాప్‌జెమినిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాడు. భువనేశ్వరి యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై బాలమురుగన్ అనుమానం పెంచుకోవడంతో వారి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. ఈ క్రమంలో ఏడాదిన్నర కాలంగా వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. భర్త వేధింపులు తట్టుకోలేక ఆరు నెలల క్రితం భువనేశ్వరి తన పిల్లలతో కలిసి వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఇల్లు తీసుకుని రహస్యంగా ఉంటోంది. భార్యపై కక్ష పెంచుకున్న బాలమురుగన్ ఆమె ఎక్కడ ఉందో ఆరా తీసి, నాలుగు నెలల క్రితమే ఆమె నివసించే ప్రాంతానికి సమీపంలోనే అద్దెకు దిగాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం భార్య నుంచి విడాకుల నోటీసు అందడంతో బాలమురుగన్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మంగళవారం సాయంత్రం 6:30 గంటల సమయంలో భువనేశ్వరి బ్యాంక్ పని ముగించుకుని ఇంటికి వస్తుండగా, ఆమె కోసం అప్పటికే మాటు వేసిన బాలమురుగన్ తన వద్దనున్న పిస్టల్‌తో అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపాడు. బుల్లెట్లు శరీరంలోకి దూసుకెళ్లడంతో రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హత్య అనంతరం నిందితుడు నేరుగా మగడి రోడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తన భార్యను తానే చంపినట్లు నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అతడికి తుపాకీ ఎక్కడి నుంచి వచ్చింది దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భార్య కస్టడీకి పిల్లలను అప్పగించాలన్న కోర్టు

# పిల్లలను చంపి, తల్లితో సహా భర్త ఆత్మహత్య

**తిరువనంతపురం, డిసెంబరు 24:** విడిగా నివసిస్తున్న భార్య కస్టడీకి పిల్లలను అప్ప గించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒక వ్యక్తి ఇద్దరు పిల్లలను హత్యచేశాడు. ఆ తర్వాత తల్లితో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేరళలోని కన్నూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పయ్యన్నూర్ గ్రామంలోని రామంతలికి చెందిన 36 ఏళ్ల కళాధరన్ భార్య నయనతార విడాకుల కోసం కోర్టును ఆశ్రయించింది. భర్త నుంచి విడిగా నివసిస్తున్న ఆమె ఇద్దరు పిల్లల సంరక్షణను తనకు అప్పగించాలని కోర్టును కోరింది. కాగా, పిల్లల కస్టడీని నయనతారకు అప్పగించాలని ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. దీంతో పిల్లల స్వాధీనానికి ఆమె పోలీసుల సహాయం కోరారు. ఈ నేపథ్యంలో పిల్లలను భార్యకు అప్పగించాలని కళాధరన్‌కు పోలీసులు చెప్పారు. అయితే ఆరేళ్ల హిమ, రెండేళ్ల కన్నన్‌ను భార్యకు అప్పగించడానికి ఇష్టపడని కళాధరన్ మరునాడు దారుణానికి పాల్పడ్డాడు. డిసెంబర్ 22న రాత్రి వేళ 56ఏళ్ల తల్లి ఉషాతో కలిసి వారిని చంపాడు. పురుగుమందు కలిపిన పాలు పిల్లలకు తాగించగా వారు మరణించారు. మరోవైపు కళాధరన్, అతడి తల్లి ఉషా కూడా పురుగుమందు కలిపిన పాలు తాగారు. ఇంట్లో సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒక సూసైడ్ నోట్‌ను డోర్ ముందు ఉంచారు. మంగళవారం ఉదయం ఆటో డ్రైవర్ అయిన కళాధరన్ తండ్రి ఇంటికి చేరుకున్న తర్వాత ఎవరూ ఎంతకీ డోర్ తెరువలేదు. అక్కడ ఉన్న సూసైడ్ నోట్‌ను గమనించిన ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. తలుపులు తొలగించి లోపలకు వెళ్లి చూశారు. కళాధరన్, అతడి తల్లి ఉషా, ఇద్దరు పిల్లల మృతదేహాలను కనుగొన్నారు. పోస్ట్‌మార్టం తర్వాత మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# టర్కీ విమానప్రమాదంలో మృతిచెందిన లిబియా సైనిక చీఫ్



**అంకారా, డిసెంబరు 24:** టర్కీ రాజధాని అంకారాలో మంగళవారంరాత్రి ఘోర విమాన ప్రమా దం సంభవించింది. లిబియా సైన్యాధిపతి జనరల్ మహమ్మద్ అలీ అహ్మద్ అల్‌హద్దాద్‌తో సహా ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ప్రైవేట్ జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక లోపంతో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఐదుగురు ఉన్నతాధికారులు, ముగ్గురు సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రక్షణ రంగ చర్చల నిమిత్తం టర్కీకి వచ్చిన లిబియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పర్యటన ముగించుకుని తిరిగి బయలుదేరిన 30 నిమిషాలకే ఈ విషాదం చోటు చేసుకుంది. అంకారాలోని ఎసెన్‌బోగా విమానాశ్రయం నుంచి రాత్రి 8:30 గంటలకు బయలుదేరిన ఫాల్కన్ 50 బిజినెస్ జెట్ దక్షిణాన ఉన్న హేమనా జిల్లా వద్దకు రాగానే రాడార్‌తో సంబంధాలు కోల్పోయింది. విమానంలో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు స్థానిక టీవీ చానళ్లు ప్రసారం చేసిన సీసీటీవీ దృశ్యాల్లో కనిపిస్తోంది. ఈ ప్రమాదంపై లిబియా ప్రధాని అబ్దుల్ హామీద్ దబీబా స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశం ఒక గొప్ప సైనిక మేధావిని కోల్పోయిందని, ఇదొక తీరని లోటని పేర్కొన్నారు. మృతుల్లో అల్‌హద్దాద్‌తో పాటు గ్రౌండ్ ఫోర్స్ చీఫ్ జనరల్ అల్‌ఫితౌరీ ఘ్రైబిల్, మిలిటరీ మాన్యుఫ్యాక్చరింగ్ అథారిటీ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ మహమూద్ అల్‌ఖతావి వంటి కీలక అధికారులు ఉన్నారు.

పశ్చిమ లిబియాలో అత్యున్నత కమాండర్‌గా సేవలందిస్తున్న అల్‌హద్దాద్ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో విచ్ఛిన్నమైన లిబియా సైనిక విభాగాలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అటువంటి నాయకుడు మరణించడం లిబియా అంతర్గత భద్రతా వ్యవహారాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అంకారా విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, పలు విమానాలను దారి మళ్లించారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు టర్కీ ప్రభుత్వం నలుగురు ప్రాసిక్యూటర్లను నియమించింది. సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది.

# ఢిల్లీ కాలుష్యంతో మూడురోజుల్లోనే అలర్జీ

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీ కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ఉన్న మూడు రోజుల్లోనే తనకు అలర్జీ వచ్చిందని వెల్లడించారు. దేశ రాజధానిలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను. ఈ కాలుష్యం వల్ల నాకు ఎలర్జీ వచ్చింది. నేను రవాణాశాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. శిలాజ ఇంధనాల వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉంది. శిలాజ ఇంధనాలు



పరిమితంగా ఉన్నాయి. కానీ కాలుష్యం మాత్రం పెరిగిపోతోంది. మనం వాటి వాడకాన్ని తగ్గించలేమా? కాలుష్యాన్ని తగ్గించే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ ఆధారిత వాహనాలకు ప్రోత్సాహం లభించాలి అని గడ్కరీ వ్యాఖ్యలు చేశారు. భారతదేశం శిలాజ ఇంధనాలపై ఏటా దాదాపు రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. కేంద్రమంత్రి ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా తయారుచేసిన తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ అని పిలుస్తారు. ఇది కాలుష్యాన్ని, శిలాజ ఇంధనాలపై ఆధారప డటాన్ని తగ్గిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

## ఇల్లినాయ్‌పై ట్రంప్ నిర్ణయాన్ని

# తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**వాషింగ్టన్, డిసెంబరు 24:** ఇల్లినాయ్ రాష్ట్రంలోకి నేషనల్ గార్డ్ బలగాలను పంపాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. 63 ఓట్ల తేడాతో ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది. ఇల్లినాయ్‌లో చట్టాలను అమలు చేయడానికి మిలిటరీని ఉపయోగించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడి నుంచి వచ్చిందో నిరూపించడంలో యంత్రాంగం విఫలమైందని కోర్టు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ వివాదం అక్టోబర్ 4న మొదలైంది. షికాగో పరిసర ప్రాంతాల్లో భద్రత కోసం ఇల్లినాయ్ నేషనల్ గార్డ్‌కు చెందిన 300 మంది సభ్యులను ట్రంప్ ఫెడరల్ సర్వీసులోకి పిలిచారు. ఆ తర్వాతి రోజే టెక్సాస్ నేషనల్ గార్డ్‌ను కూడా షికాగోకు పంపారు. అయితే, ఫెడరల్ బలగాల మోహరింపును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై గతంలోనే జిల్లా కోర్టు, అప్పీల్ కోర్టు స్టే ఇచ్చాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆ స్టేను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. కోర్టు తీర్పుపై వైట్ హౌస్ అధికార ప్రతినిధి అబిగైల్ జాక్సన్ స్పందిస్తూ.. ఫెడరల్ భవనాలు, ఆస్తులను అల్లరిమూకల నుంచి రక్షించడానికి, ఫెడరల్ అధికారులకు రక్షణ కల్పించడానికే అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నారని సమర్థించుకున్నారు. బలగాల మోహరింపును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న ఇల్లినాయ్ డెమొక్రాటిక్ గవర్నర్ జేబీ ప్రిట్జ్కర్, షికాగో మేయర్ ఈ తీర్పును స్వాగతించారు. ఇది ఇల్లినాయ్ రాష్ట్రానికి, అమెరికా ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని అభివర్ణించారు.



# యూనస్ ఏదో ఒకరోజు దేశం వీడి పోవాల్సిందే

## హత్యకు గురైన హదీ సోదరుడు హెచ్చరిక

**ఢాకా, డిసెంబరు 24:** బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారి హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడుకుతోంది. ఇటీవల జరిగిన యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హత్య దేశవ్యాప్తంగా హింసకు దారితీసింది. తాజాగా హదీ సోదరుడు ఒమర్ సంచలన ఆరోపణలు చేశారు. హదీ హత్యలో తాత్కాలిక ప్రభుత్వం పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. మీరు హదీని చంపారు. ఈ ఘటనను వాడుకుని వచ్చే ఏడాది జరగాల్సిన ఎన్నికలను రద్దు చేయాలని చూస్తున్నారు. హదీని హత్య చేసిన వారిని వెంటనే పట్టుకోండి. హదీ హత్య విషయంలో న్యాయం జరగకుంటే, తాత్కాలికక ప్రభుత్వ అధినేత ముహమ్మద్ యూనస్ కూడా ఒక రోజు బంగ్లాదేశ్‌ను విడిచి పారిపోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. హదీ గతేడాది విద్యార్థి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఆ ఉద్యమం షేక్ హసీనా ప్రభుత్వాన్ని దేశం వీడే స్థితికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో, హదీ హత్య ఘటన బంగ్లాలో ఉత్కంఠకర రాజకీయ పరిణామాలను సృష్టించింది. ఇక, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీపై తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించింది. దీని వలన వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్ణయంపై అమెరికా చట్ట సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు పారదర్శకంగా, స్వేచ్ఛాయుత విధానంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఉంది. అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఎన్నికలు నిర్వహించేందుకు తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నించాలి అని వారు సూచించారు. అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని పునః సమీక్షించాలని కోరారు.



# ప్రియాంకకు ప్రధాని పదవి ప్రతిపాదనపై బిజెపి ఎద్దేవా

## కాంగ్రెస్‌లో ఎప్పుడూ గందరగోళమే: షెహజాద్ పూనావాలా

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండాలనే చర్చపై బీజేపీ స్పందించింది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గందరగోళంలో ఉంటుందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనవాలా విమర్శించారు. ఐఎన్‌ఎస్ అంటే సాధారణంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అని కానీ ఈ పేరు కంటే ఐ నీడ్ కన్ఫ్యూజన్ అనే పేరు ఆ పార్టీకి బాగా సరిపోతుందని ఎద్దేవా చేశారు. జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో ముఠా రాజకీయాలు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా షెహజాద్ పూనవాలా పలు అంశాలను ఉదహరించారు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్, అశోక్ గెహ్లాట్, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతిభా సింగ్, సుఖ్వీందర్ సింగ్ సఖు, కర్ణాటకలో డీ.కే. శివకుమార్, సిద్ధరామయ్య ఇలా నేతల మధ్య గ్రూపులు ఉన్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో రాహుల్ కాంగ్రెస్, ప్రియాంక కాంగ్రెస్ వర్గాలుగా చీలిపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రకటనలు రాహుల్ గాంధీపై విశ్వాసం లేనట్లుగా స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. కొన్నిసార్లు శశిథరూర్, రాహుల్ గాంధీ ప్రకటనలతో విభేదిస్తారని, ఇమ్రాన్ మసూద్ ప్రియాంక గాంధీని ప్రధానమంత్రిగా ప్రతిపాదిస్తారని, ఆ తర్వాత వివరణ ఇస్తుంటారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నుంచి బహిష్కరించబడిన మహమ్మద్ మోక్విమ్ కూడా రాహుల్ గాంధీ నాయకత్వ సామర్థ్యాన్ని ప్రశ్నించారని గుర్తు చేశారు.

ప్రియాంక గాంధీకి పార్టీలో మరింత కీలక పాత్ర ఇవ్వాలని ఆయన సూచించారని గుర్తు చేశారు. ప్రియాంక గాంధీ ప్రధానమంత్రి కావాలనే వ్యాఖ్యలకు రాబర్ట్ వాద్రా కూడా మద్దతు పలికారని, ఇది కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సంక్షోభాన్ని వెల్లడిస్తోందని పూనవాలా అన్నారు. రాహుల్ గాంధీ సామర్థ్యంపై రాబర్ట్ వాద్రాకు నమ్మకం లేనట్లుగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీకి ప్రజల్లోనే కాదు, సొంత పార్టీలో కూడా నమ్మకం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబ పార్టీ అని ఆయన విమర్శించారు.

# హెచ్1బి వర్క్ వీసా లాటరీ రద్దు..




**వాషింగ్టన్, డిసెంబరు 24:** అమెరికాలో హెచ్1బీ వర్క్ వీసా విధానాన్ని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం పూర్తిగా మార్చేందుకు సిద్ధమైంది. ఇప్పటివరకు అమలులో ఉన్న లాటరీ విధానాన్ని రద్దు చేసి, నైపుణ్యం, అధిక వేతనాల ఆధారంగా వీసాలు కేటాయించే వెయిటెడ్ సెలక్షన్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. కొత్త నిబంధనలు 2026 ఫిబ్ర వరి 27 నుంచి అమల్లోకివస్తాయి. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్1బీ రిజిస్ట్రే షన్ సీజన్ నుంచే ఈ మార్పులు వర్తిస్తాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకారం ప్రతి ఏడాది సుమారు 85 వేల హెచ్1బీ వీసాల కేటాయింపుపై ఈ విధానం ప్రభావం చూపనుంది. తక్కువ వేతనాలకు విదేశీ కార్మికులను తీసుకొచ్చేందుకు కొందరు యజమానులు లాటరీ వ్యవస్థను దుర్వినియోగం చేశారని యూఎస్‌సీఐఎస్ ప్రతినిధి మాథ్యూ ట్రాగెసర్ ఆరోపించారు. అందుకే అధిక నైపుణ్యం, ఎక్కువ జీతాలు పొందే ఉద్యోగులకు ప్రాధాన్యం ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం భారతీయులపై భారీ ప్రభావం చూపనుంది. హెచ్1బీ వీసా ద్వారా అమెరికాలో ఉద్యోగాలు పొందుతున్న వారిలో భారతీయ టెక్ నిపుణులు, వైద్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా కెరీర్ ఆరంభ దశలో ఉన్న యువ భారతీయులకు ఈ కొత్త వేతన ప్రమాణాలు అడ్డంకిగా మారనున్నాయి. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసాలపై ఏడాదికి అదనంగా 1 లక్ష డాలర్ల ఫీజు విధించే ప్రకటన చేసింది. మరోవైపు ధనవంతుల కోసం 10 లక్షల డాలర్ల గోల్డ్ కార్డ్ వీసాను కూడా ప్రవేశపెట్టింది. అమెరికా కంపెనీలు ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధికి హెచ్1బీ వీసాలు కీలకమని సమర్థిస్తుంటే, విమర్శకులు మాత్రం ఇవి ఎంట్రీలెవెల్ ఉద్యోగాలకే ఎక్కువగా వెళ్తున్నాయని వాదిస్తున్నారు. మొత్తం మీద ఈ కొత్త విధానం అమెరికా ఉద్యోగ విపణిపైతో పాటు వేలాది భారతీయుల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపనుంది.

# సంక్షిప్తంగా..

## కాలిఫోర్నియాలో 30 మంది భారతీయులు అరెస్టు



**కాలిఫోర్నియా, డిసెంబరు 24:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 30 మంది భారతీయులను యుఎస్ బోర్డర్ పెట్రోల్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరు కమర్షియల్ డ్రైవర్ లైసెన్సులు (సీడీఎల్) కలిగి ఉండి, భారీ సెమీ ట్రక్ వాహనాలను నడుపుతున్నట్లు గుర్తించారు. కాలిఫోర్నియాలోని ఎల్ సెంట్రో సెక్టర్‌లో జరిగిన తనిఖీల్లో ఈ అరెస్టులు జరిగాయని యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) వెల్లడించింది. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 12 వరకు ఇంటర్ స్టేట్ హైవేలు, ఇమిగ్రేషన్ చెక్‌పోస్టుల వద్ద జరిగిన తనిఖీల్లో మొత్తం 42 మంది అక్రమ వలసదారులను పట్టుకున్నారు. వీరిలో 30 మంది భారతీయులు కాగా, మిగిలిన వారు ఎల్‌సాల్వడార్, చైనా, హైటీ, మెక్సికో, రష్యా తదితర దేశాలకు చెందినవారు. వీరికి కాలిఫోర్నియా సహా ఫ్లోరిడా, న్యూయార్క్, న్యూజెర్సీ వంటి రాష్ట్రాలు కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## టొరాంటోలో భారత్ యువతి దారుణ హత్య



**టొరంటో, డిసెంబరు 24:** కెనడాలోని టొరంటోలో భారతసంతతికి చెందిన 30 యేళ్ల యువతి హిమాన్షు ఖురానా దారుణ హత్యకు గురయ్యారు. ఈ ఘటనలో 32 ఏళ్ల అబ్దుల్ గఫూరి అనే వ్యక్తిని ప్రధాన నిందితుడిగా గుర్తించిన పోలీసులు, అతనిపై ఫస్ట్‌డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేసి, దేశవ్యాప్తంగా అరెస్ట్ వారెంట్ జారీచేశారు. బాధితురాలు, నిందితుడు ఇద్దరికీ ముందునుంచే పరిచయం ఉందని, ఇది ఇంటిమేట్ పార్టనర్ వయలెన్స్ (సన్నిహిత భాగస్వామి హింస) కేసుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈనెల 19వతేదీ రాత్రి హిమాన్షి ఖురానా కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా, 20వ తేదీ ఉదయం 6:30 గంటలకు స్ట్రాచన్ అవెన్యూ, వెల్లింగ్టన్ స్ట్రీట్ వెస్ట్ ప్రాంతంలోని ఒక నివాసంలో ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. దీనిని హత్యగా నిర్ధారించిన పోలీసులు, దర్యాప్తును హోమిసైడ్ విభాగానికి అప్పగించారు.

## ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



**నోయిడా, డిసెంబరు 24:** గ్రేటర్ నోయిడాలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. చదువులో రాణించలేకపోతున్నానంటూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. చనిపోవడానికి ముందు సూసైడ్ నోట్ రాశాడు. తాను ఓడిపోయానని, చదువుకోసం ఇంకా డబ్బును వృథా చేయాలనుకోవడం లేదని అందులో పేర్కొన్నాడు. ఈ మేరకు తన తల్లిదండ్రులకు క్షమాపణలు కోరాడు. బీహార్‌కు చెందిన ఆకాష్ దీప్.. ఢిల్లీ టెక్నికల్ క్యాంపస్‌లో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) మొదటి సంవత్సరం చదు వుతున్నాడు. అతడు గ్రేటర్ నోయిడాలోని నాలెడ్జ్ పార్క్ ప్రాంతంలో గల ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉం టూ చదువును కొనసాగిస్తున్నాడు. అయితే, ఆకాష్ దీప్ మంగళవారం సాయంత్రం రూమ్‌మేట్ బయ టకు వెళ్లిన సమయంలో తన గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

## జామియా మిలియా వర్సిటీ ప్రొఫెసర్ సస్పెన్షన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో ఒక సెమిస్టర్ పరీక్షా పత్రంలో సామాజిక సమస్యలపై అడిగిన ఒక ప్రశ్న అభ్యంతరకరంగా ఉందన్న ఆరోపణలతో ప్రొఫెసర్ వీరేంద్ర బాలాజీ షహారేను యూనివర్సిటీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఈ వారం ప్రారంభంలో జరిగిన బీఏ (ఆనర్స్) సోషల్ వర్క్ మొదటి సెమిస్టర్ పరీక్షలో భారతదేశంలో సామాజిక సమస్యలు అనే పేపర్‌లో ఒక ప్రశ్న ఇచ్చారు. అందులో భారతదేశంలో ముస్లిం మైనారిటీలపై జరుగుతున్న అకృత్యాల గురించి తగిన ఉదాహరణలతో చర్చించండి అని 15 మార్కుల ప్రశ్నను అడిగారు. ఈ ప్రశ్నపత్రం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఇది ఒక వర్గాన్ని కించపరిచేలా లేదా రాజకీయ ప్రేరేపితంగా ఉందని పలువురు విమర్శించారు.

## ఎయిరిండియా పైలట్‌కు సంజాయిషీ నోటీసులు

**న్యూఢిల్లీ, డిసెంబరు 24:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో ప్రయాణికుడిపై భౌతికదాడికి పాల్పడిన ఘటనను ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్ తీవ్రంగా పరిగణించింది. సదరు పైలట్‌కు అధికారికంగా షోకాజ్ నోటీసు జారీచేసింది. తన ప్రవర్తనపై 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పైలట్ దురుసు ప్రవర్తన సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసిందని పేర్కొంటూ ఎయిర్ ఇండియాఎక్స్‌ప్రెస్ ఈ నోటీసు ఇచ్చింది. దీనిపై ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపేందుకు ఈవారమే ఒకఎక్స్‌టర్నల్ ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఎయిర్ లైన్స్ ప్రకటించింది. బాధితుడు అంకిత్ దేవాన్ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఇప్పటికే పైలట్‌పై స్వచ్ఛందంగా గాయపరచడం, అక్రమంగా అడ్డుకోవడం వంటి అభియోగాల కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

# గుంటూరు రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ఏర్పాటు



గుంటూరు రైల్వే స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్లీపింగ్ పాడ్స్‌ను ప్రారంబిస్తున్న అధికారులు

**తార్నాక, డిసెంబర్ 24 ప్రభాతవార్త :**అతితక్కువ ధరలకు ప్రయాణీకులకు ఈ సౌకర్యం దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజన్, ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు నాన్‌ఫేర్ ఆదాయాలను పెంచే లక్ష్యంతో గుంటూరు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో స్లీపింగ్ పాడ్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం ప్లాట్‌ఫామ్ నెం. 1, గేట్ నెం. 3 వద్ద ఏర్పాటుచేశారు. ఈ సౌకర్యం ప్రయాణీకులకు, కుటుంబాలకు,మహిళా ప్రయాణీకులకు సురక్షితమైన, ఆధునిక,సరసమైన స్వల్పకాలిక వసతి సౌకర్యాన్ని అందిస్తుంది. ప్రస్తుతం ఇటువంటి సౌకర్యం విశాఖపట్నం, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో అందుబాటులో ఉంది. ముఖ్యమైన సౌకర్యాలు.......స్లీపింగ్ పాడ్స్ సౌకర్యం 52 సింగిల్ బెడ్లు,12 డబుల్ బెడ్లతో మొత్తం 64 పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మొత్తం 64 బెడ్లలో, కుటుంబాలు మరియు మహిళలకు బెడ్లు కేటాయించబడ్డాయి. వాటిలో 10 డబుల్ బెడ్లు, 12 సింగిల్ బెడ్లు ఉన్నాయి.ఈ సౌకర్యం ప్రయాణీకులకు అనుకూలమైన అనేక సౌకర్యాలతో కూడి ఉంది. ఇందులో ఉచిత వైఫై సౌకర్యం, వేడి నీటి సరఫరా, స్నాక్స్ బార్, ట్రావెల్ డెస్క్, విశాలమైన మరియు పరిశుభ్రమైన నిద్ర ప్రాంతాలు, శుభ్రమైన టాయిలెట్ సౌకర్యాలు, వస్తువులను సురక్షితంగా నిల్వ చేయడానికి లాకర్ సౌకర్యం ఏర్పాటుచేశారు. దీనికి అతితక్కు వ ధరలతో టారిఫ్ నిర్ణయించారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకులకు అనుకూలమైన స్నేహ పూరకమైన చొరవకు ప్రయాణ సమయంలో సౌకర్యవంతమైన బసను అందించినందుకు గుంటూరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ గుంటూరు డివిజన్ బృందానికి అభినందనలు తెలిపారు. నాన్‌ఫేర్ ఆదాయాన్ని సృష్టించడం కోసం చర్యలు తీసుకున్నందుకు ఆయన డివిజన్ ను అభినందించారు. ఈ చొరవ ప్రారంభం ఆధునిక మోలిక సదుపాయాల ద్వారా ప్రయాణీకుల సౌలభ్యాన్ని పెంపొందించడానికి దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన నిరంతర ప్రయత్నాలను ప్రతిబింబిస్తూ అదే సమయంలో ప్రధాన రైల్వే కార్యకలాపాలకు మించి ఆదాయాన్ని సృష్టిస్తుందన్నారు.

# వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలి

## - పౌరసరఫరాల శాఖ ఎండి ఢిల్లీరావు



వినియోగదారులకు అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఢిల్లీరావు తదితరులు

**విజయవాడ (గన్నవరం), డిసెంబర్ 24, ప్రభాతవార్త :** వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పౌరసరఫరాలశాఖ యండి ఢిల్లీరావు సూచించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్బంగా రాష్ట్రస్థాయి వేడుకలను బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఢిల్లీరావు మాట్లాడుతూ వినియోగదారుల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని, వినియోగదారులకు నష్టం కలిగితే వెంటనే వినియోగదారులకోరు ట్లో ఫిర్యాదు చేయాలన్నారు. గతంలో వస్తువు కొన్న చోట కేసు పెట్టాల్సి ఉండేదని, ప్రస్తుత చట్టం ప్రకారం వినియోగదారులు నివసించే చోట ఇంటివద్ద నుండే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, కేసు విచారణకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరుఅయ్యే అవకాశం ఉందన్నారు. బిస్‌కేర్ యాప్‌ద్వారా హాల్‌మార్క్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఈ-జాగృతి యాప్‌ద్వారా కేసు స్థితిని తెలుసుకునే అవకాశం ఉందని ఢిల్లీరావు తెలిపారు. నూతన చట్టం ప్రకారం నష్టపరిహారం ఎంతైనా అగడవచ్చని కానీవస్తువు కొనుగోలు కోసం చెల్లించిన విలువ రూ.50లక్షలలోపు ఉండాలన్నారు. వ్యక్తిగత అవసరాల కోసం వస్తువులు కొనుగోలు చేసేవారు మాత్రమే వినియోగదారుల చట్టం పరిధిలోకి వస్తారని, వ్యాపార లావాదేవీల కోసం వస్తువులు కొనుగోలు చేసేవారు ఈచట్టం పరిధిలోకి రారని వివరించారు. పౌరసరఫరాలసంస్థ సంచాలకులు ఆర్.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బంగారు దుకాణాల్లో ఒక మిల్లీగ్రామ్ స్కేల్ ఖచ్చితత్వాన్ని అమలు చేయటం గొప్ప విజయంగా అభివర్ణించారు. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ సమాజంలో ఏవృత్తిలో ఉన్నవారైనా ప్రతి ఒక్కరూ వినియోగదారులేనన్నారు. ఇంటర్నెట్ వినియోగం పెరగటం, స్మార్ట్‌ఫోన్‌ని విరివిగా వాడటం వల్ల సమాజంలో సైబర్‌మోసాలు పెరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈసందర్భంగా వినియోగ దారుల హక్కులపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బిస్ డైరెక్టర్ ప్రేమ్ సజానీ, లీగల్‌మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ కృష్ణచైతన్య, జేసి ఎస్.ఇలక్కియ, పౌరసరఫరాలశాఖ అదనపు సంచాలకులు కె.రంగకుమారి, డిఈఓ చంద్రకళ, పౌరసరఫరాలశాఖ జిల్లాఅధికారి ఏ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# అటల్, మోడీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన: బిజెపి ఎపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



విజయవాడ, డిసెంబర్ 24,ప్రభాతవార్తప్రతినిధి: అటల్ మోదీ సుపరిపాలన యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో వాజ్‌పేయి విగ్రహాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నేటి తరానికి వాజ్‌పేయి విలువలు ఆదర్శమని అన్నారు. వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకుని అందరూ ఆశ్చర్యవ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సుపరిపాలన యాత్ర గురించి సీఎం చంద్రబాబుకు చెప్పిన వెంటనే ఆనందం వెలిబుచ్చారని తెలిపారు. ఈ యాత్రకు కూటమిపరంగా , ప్రభుత్వపరంగా సహకారం అందించారని చెప్పారు. ఈ యత్రలు, సభల్లో కూటమి పార్టీల నేతలను భాగస్వామ్యం చేశారన్నారు. అటల్, చంద్రబాబులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లకు నాడు వాజ్‌పేయి సహకారం అందించారని గుర్తుచేశారు. సుపరిపాలన యాత్రలో బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారన్నారు. వాజ్‌పేయి ఈ దేశానికి చేసిన సేవకు, త్యాగాలను గురించి అందరూ ముక్త కంఠంతో కీర్తిస్తున్నారని తెలిపారు. ఈనెల 25న వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా అమరావతిలో స్మృతి వనం, విగ్రహాన్ని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ధర్మవరం నుంచి అమరావతి వరకు తమ యాత్రకు ప్రజలు నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలకు రోడ్లు, ఐటీ, టెలికం, పొలిటికల్ కనెక్టివిటీలకు ఆద్యులు వాజ్‌పేయి అని కొనియాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా ప్రజలు నుంచి వస్తున్న స్పందన అపూర్వమన్నారు. నేటి యువతరం, భవిష్యత్తుతరాలు వాజ్‌పేయి గొప్పతనం తెలుసుకోవాలని సూచించారు. తాము ఏర్పాటు చేసిన విగ్రహాలు, యాత్ర ద్వారా వాజ్‌పేయి నుంచి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారన్నారు.

# మోసపూరిత ప్రకటనలపై వినియోగదారులు అప్రమత్తం

## - జిల్లా కన్స్యూమర్ కమిషన్ ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ సలీం



వినియోగదారుల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్స్యూమర్ కమిషన్ ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ సలీం

**చిత్తూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** మోసపూరిత ప్రకటనల పట్ల వినియోగదారులు నిత్యం అప్రమత్తంగా వుండాలని జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జీ ప్రెసిడెంట్ సలీం పేర్కొన్నారు. చిత్తూరు బిఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాతీయ వినియోగదారుల రక్షణ చట్టం-2025 సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కన్స్యూమర్ కమీషన్ ఇన్‌ఛార్జీ ప్రెసిడెంట్ సలీం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలన్నారు. వినియోగదారుల సంక్షేమం కోసం వారికి అవగాహన కల్పించడానికి, వారి హక్కులను గుర్తు చేయడం కోసం ప్రతి ఏడాది డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. 2025 సంవత్సరంలో డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన తొలగింపు అనే థీమ్‌తో మార్గనిర్దేశం జారీ చేయడం జరిగిందన్నారు. ప్రతి వస్తువు కొనుగోలుపై బిల్లును కచ్చితంగా పొంది మీకు వున్న అధికారంను పొందాలన్నారు. జిల్లా కమీషన్‌లో రూ.50 లక్షల వరకు ఫిర్యాదు చేయవచ్చునని, రూ.2 కోట్ల వరకు రాష్ట్ర కమీషన్‌కు ఫిర్యాదు చేసి సత్వర న్యాయంపొందవచ్చు నన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన కన్నన్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో ఒకొక్క విభాగం నుండి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలును అతిధులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు 12 బహుమతులు, జూనియర్ కళాశాల విద్యార్థులకు 12 బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శంకరన్, సర్వశిక్షాభియన్ పిఓ వెంకటరమణ, లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ రమాదేవి, బిఎస్ ప్రభుత్వ బిఎస్ కన్నన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్‌మౌలా, బిఎస్ కన్నన్ పాఠశాల హెడ్మాస్టర్ కోమల, పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్ర, చిత్తూరు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నప్పశ్రీనివాస్, డిటిసి ఎఓ చక్రపాణి, చిత్తూరు అర్బన్ తహసిల్దారు కులశేఖర్, రూరల్ తహసిల్దారు కళ్యాణి,

సమగ్ర శిక్ష అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ బి.మధుసూధన్‌నాయుడు, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బి.అరుణ్‌కుమార్, బంగారుపాళ్యం, యాదమరి, పులిచెర్ల, ఐరాల, జిడినెల్లూరు, నగరి కన్స్యూమర్ వాలంటీర్ అర్గనైజేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి క్యాంటిన్‌లో ఆహార పదార్థాలపై ఎలుకల దాడి



విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతి నిధి:** విజయవాడలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకలి రాజ్యం క్యాంటీన్‌లో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ప్రైవేటు హోటల్లో ఎలుకలు నూడిల్స్ తింటూ కనిపించాయి. ఈ దృశ్యాలను అక్కడ చదువుకుంటున్న ఓ పీజీ విద్యార్థి తన మొబైల్ లో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇప్పుడు ఆ వీడియో కొన్ని గంటల్లోనే విపరీతంగా వైరల్ అయింది. డ్వాక్రా మహిళల కోటాలో టిఫిన్, భోజనం సరఫరా చేయడానికి విజయవాడ కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి ప్రాంగణంలో "ఆకలి రాజ్యం" పేరుతో హోటల్ ని ప్రారంభించారు. అక్కడ కేవలం టిఫిన్ భోజనం సరఫరా చేయడానికి మాత్రమే అనుమతి ఉంది. కానీ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి ఫాస్ట్ ఫుడ్ , పిజ్జా నూడిల్స్ కూడా అందుబాటులో ఉంచారు. అయితే అక్కడ ఉన్న సిబ్బంది నిరక్ష ్యంతో ఉడికించిన నూడిల్స్ ను పక్కన ఉంచి.. కనీస శుభ్రత పాటించడం లేదు. ఈ క్రమంలో క్యాంటీన్ లోపల ఉన్న ఎలుకలు వాటిని తినడం ప్రారంభించాయి. అక్కడికి వచ్చిన ఓ పీజీ విద్యార్థి ఆసుపత్రి క్యాంటీన్లో నూడిల్స్ తింటున్న ఎలుకల వీడియో తీసి వైరల్ చేశాడు.

# ఇనుమూరులో మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోండి : సిపిఎం శ్రీనివాసరావు

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏలూరు జిల్లా ఇనుమూరులో గిరిజనులు వేసిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసి అడ్డొచ్చిన గిరిజనులపై, గిరిజన మహిళలపై దాడికి పాల్పడిన పోలీసు, రెవెన్యూ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణం ఈ విషయంలో పోలీసు జోక్యాన్ని ఆపాలని డిజిపికి ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టిముట్టి భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, వారిని ఉపసంహరించి పేద గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్.. రెవెన్యూ అధికారుల జోక్యాన్ని ఆపాలన్నారు.గిరిజనేతర భూస్వాములకు అనుకూలంగా పోలీసులు, మండల రెవెన్యూ అధికారులు దౌర్జన్యంగా పంటను ధ్వంసం చేయడం దుర్మార్గమని తెలిపారు. గిరిజన మహిళలపై మగ పోలీసులే దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను గిరిజనులు తమ పూర్వీకుల నుంచి చదును చేసి సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అసైన్‌మెంట్ చేయాలని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని తెలిపారు. ఈ సమస్యపై ఇప్పటికే హైకోర్టులో కేసు నమోదై ఉన్నప్పటికీ పోలీసులు భూస్వాముల పక్షం వహించడం కోర్టు ధిక్కరణే అవుతుందని పేర్కొన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీలో ఈ రకంగా పోలీసు, అధికార యంత్రాంగం వ్యవహరించడం, గిరిజనులపై చట్టవిరుద్ధంగా దాడికి దిగడాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యా ప్రమాణాలు మెరుగుకు 'మన బడి మన బాధ్యత'



**విజయవాడ, డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాల విద్యా ప్రమాణాలు మెరుగుకు గుంటూరు జిల్లా యంత్రాంగం వినూత్న కార్యక్రమం ప్రారంభించింది. ముఖ్యంగా తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాలు పట్ల అవగాహన కల్పించడం తద్వారా పది పరీక్షలలో శత శాతం ఫలితాలు సాధించడం లక్ష ్యంగా "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో గల 185 ఉన్నత పాఠశాలలకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఆయా పాఠశాలల పర్యవేక్షణ చేయుటకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. తొమ్మిది, పది విద్యార్థుల్లో మానసిక ఆందోళన తగ్గించడం, చదువు పట్ల ఏకాగ్రత కలిగించడం, విద్యార్థులు ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి వాటిలో మంచి తర్ఫీదు ఇవ్వడం, అందులో ఉన్న భయం పోగొట్టడం, అదే సబ్జెక్టుల్లో ఉన్నత విద్య అభ్యసించి అందులో నిపుణులుగా తయారు అయ్యే విధంగా మలచడం వంటి అంశాలు పట్ల దృష్టి సారించారు. విద్యార్థులకు ప్రత్యేక అధికారులు మార్గదర్శిగా, కౌన్సిలింగ్ అందించడం చేస్తారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన వ్యక్తుల జీవిత చరిత్రలు తెలియజేస్తూ ప్రేరణ కలిగించడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ విద్యార్థులు సరైన అవగాహన లేక అనేక అవకాశాలు చేజార్చుకుంటున్నా రన్నారు. విద్యార్థులకు మంచి మార్గదర్శకత్వం, సూచనలు, సలహాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు అందించడం వలన భవిష్యత్తుకు గట్టి పునాది పడుతుందన్నారు. అందుకే "మన బడి మన బాధ్యత" కార్యక్రమాన్ని అమలు చేస్తూ జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులు.

# జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు రాహుకేతుదోష నివారణ పూజలు



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధూ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు.పివి సింధూ గతంలో కకూడా పలుమార్లు శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పాల్గొన్నారు. బుధవారం సింధూ కుటుంబసభ్యులతో రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో వేదపండితులతో ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ స్వాగతం పలికారు. ఏర్పాట్లను ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు స్వాగతం పలికారు.ఆమె ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణపూజలు జరిపించుకోవాలని

కోరగా అలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎపిఆర్ఓ రవి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామి సహస్రలింగేశ్వరాలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు. పూజల అనంతరం ఆమెకు అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు,తీర్థ ప్రసాదాలుఅందించారు.స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

**చైర్మెన్‌చే సన్మానం:** భారతదేశంలో క్రీడల ప్రాధాన్యత మహిళల కు అవకాశాలకు హద్దులేదని నిరూపించిన పివి సింధూ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి రాగా ఆమెకు సాదర స్వాగతాలు ఏర్పాటు చేయటమే కాకుండా శ్రీకాళహస్తి ప్రాధాన్యతను వివరిస్తూ ఆమెను దుశ్శాలువతో సత్కరించారు.

# విజయవాడ- గూడూరు మధ్య నాలుగో రైల్వేలైన్ నిర్మాణం!

**విజయవాడ,డిసెంబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి.ఇందుకు సంబంధించి డీపీఆర్ సిద్ధమవుతుంది. దీని వలన ప్రయాణం కూడా సులభతరం అవుతుంది.గూడ్స్ రవాణాలో విజయవాడ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ప్యాసింజర్ రైళ్లతో కలిపి రోజుకు సగటున 170 వరకు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే విజయవాడ నుంచి గూడూరు మధ్య రూ.6,238 కోట్లతో 280 కి.మీ. మూడో రైల్వేలైను నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో 260 కి.మీ. పూర్తయ్యింది. త్వరలోనే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. తీరం వెంబడి సరకు రవాణాను మరింతగా పెంచడం కోసం ఇప్పటికే కేంద్రం పారిశ్రామిక కారిడార్లకు రూపకల్పన చేసింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని నాలుగో రైల్వేలైను నిర్మాణానికి సెమీ హైస్పీడ్ ప్రాజెక్టులో భాగంగా రైల్వేశాఖ డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. రానున్న బడ్జెట్‌లో కేంద్రం దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లు కూడా పెరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడో లైన్ వెంబడి 293 కి.మీ. మేర కొత్తగా నాలుగో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు, నాలుగు లైన్ల నిర్మాణం పూర్తయితే విజయవాడగూడూరు మధ్య ప్రయాణ సమయం మరింతగా తగ్గుతుంది. గూడ్స్ రైళ్లు సాఫీగా వెళ్లే అవకాశం కూడా ఉంది. హైస్పీడ్ రైళ్లు గంటకు 200 కి.మీ. వేగంతో పరుగులు తీయనున్నాయి. ప్రస్తుతం మూడోలైను పక్కనే నాలుగో లై ను అవసరాలకు అనుగుణంగా వంతెనలను, ఆర్వోబీలను నిర్మిస్తున్నారు. దీంతో నాలుగోలైన్ పూర్తిగా కార్యరూపం దాల్చితే ట్రాక్ పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. తీరం వెంబడి సరకు రవాణాను మరింతగా పెంచడం కోసం ఇప్పటికే కేంద్రం పారిశ్రామిక కారిడార్లకు రూపకల్పన చేసింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని నాలుగో రైల్వేలైను నిర్మాణానికి సెమీ హైస్పీడ్ ప్రాజెక్టులో భాగంగా రైల్వేశాఖ డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. రానున్న బడ్జెట్‌లో కేంద్రం దీనికి నిధులు కేటాయించే అవకాశం ఉంది. వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లు కూడా పెరగనున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ నుంచి గూడూరు మధ్య మూడో లైన్ వెంబడి 293 కి.మీ. మేర కొత్తగా నాలుగో లైన్ ఏర్పాటుకు సన్నాహాలు.

# సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిది : మంత్రి నారాయణ

**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త :** సిఎం సహయనిధి పేదలకు ఒక వరంలాంటిదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాకటర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. 29మందికి 22,42,308రుపాయల చెక్కులు అందజేశారు. సిఎంఆర్ఎఫ్ మంజూరుకు సహకరించిన మంత్రి నారాయణకు లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం చంద్రబాబు పదికాలాలుపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిల మారిందన్నారు. పేదల ప్రాణరక్షణకు సిఎం రిలీఫ్‌ఫండ్ అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదల ప్రణాలకు భరోసా కల్పిస్తోందన్నారు. దరఖాస్తు చేసుకొన్న వారందరికి సిఎం సిఎం సహాయనిధి మంజూరు చేస్తున్నారని తెలిపారు. సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 292మందికి 3కోట్లా2లక్షల 12వేల 700రుపాయల చెక్కులు అందచేస్తామని పేదల సంక్షేమానికి సిఎం చంద్రబాబు నాయుడు గారు అత్యధిక ప్రాదాన్యత ఇస్తున్నారన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం మాదని ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో కమీషనర్ నందన్, రాష్టట వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పోరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి, నగరపార్టీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పోరేటర్లు, డివిజన్ ముఖ్య నేతలుపాల్గొన్నారు.

# అటవీశాఖ భూములకు రెవెన్యూ పట్టాలు

## పెన్సింగ్ తొలగించి నిమ్మ, మామిడి చెట్లు నాటారంటూ అటవీశాఖకు ఫిర్యాదు

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని సింహాచల కండ్రిగలో ఎంతో కాలంగా రగులుతున్న అటవీభూముల వివాదం రోజు రోజుకు ముదురుతుంది.ఈ వివాదాలకు సంబంధించి కోర్టులో స్టేటస్‌కో అమలులో ఉంది. వివాదాస్పదమైన భూముల్లో ప్రవేశించి అటవీశాఖ అస్తులను ధ్వంసం చేసినారంటూ అటవీశాఖ సెక్షన్ అధికారి గిరిశం ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు 27మందిపై కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకటేశ్ బుధవారం వివరించారు. శ్రీకాళహస్తి అటవీశాఖ పరిధిలో సింహాచల కండ్రిగ గ్రామానికి సమీపంలో అటవీ భూములున్నాయి. ఈ భూములకు గతంలో రెవెన్యూ శాఖ రైతులకు పట్టాలుజారి చేసారు. అయితే ఈ భూములకు సంబంధించి అటవీశాఖ పేచీ పెట్టింది. దాంతో ఈ సమస్య కోర్టుకు వెళ్ళింది. పలు పరిశీలనల తరువాత ఈ భూములు అటవీశాఖకు చెందినవే అంటూ కోర్టు తీర్పు చెప్పింది.ఈ భూముల్లో చెట్లను నాటటానికి నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు వెళ్ళినపుడు ఆర్నేల్ల క్రితం పట్టాలు పొందిన వారు అడ్డుకున్నారు. దాంతో ఈ సమస్య రాజకీయంగా మారింది.. మండలంలోని సింహాచల కండ్రిగ గ్రామంలో అటవీశాఖకు చెందిన భూములున్నాయి. ఇక్కడి అటవీభూములకు గతంలో పని చేసిన రెవెన్యూ అధికారులు కొందరు రైతులకు పట్టాలు ఇచ్చారు. దాంతో గ్రామస్తులు అటవీశాఖకు మధ్య పోరు ప్రారంభం అయ్యింది. ఈ పోరు శాంతి భద్రతల సమస్యగా మారింది.ఈ సమస్యకు సంబంధించి ఒక దశలో స్థానిక నాయకుడు ఒకరు కల్పించుకున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి.సింహాచల కండ్రిగకు సంబంధించి అటవీభూములకు సంబందించి గ్రామస్తుల మధ్య వివాదం చోటు చేసుకోగా సమస్యను పెంచకుండా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్‌ను రప్పించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు. వివాదాలకు సంబంధించిన సింహాచలకండ్రిగ వాసులకు, అటవీ ఉన్నత శాఖ అధికారులను రప్పించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానికులను ఒదార్చారు. ప్రత్యామ్నాయం భూముల ఇస్తామని నమ్మబలికారు.అయితే గ్రామస్తులకు సమీపంలో ఇస్తామన్న హామీని అమలు చేయటానికి సాధ్యం కాలేదు.రెవెన్యూ శాఖకు అందుబాటులో ఉన్న 6కిలో మీటర్ల రూరంలోని ఆంజనేయ పురం గ్రామానికి సమీపంలో ఇచ్చారు. అయితే బాధితులు అందుకు అంగీకరించక మళ్ళీ కోర్టును ఆశ్రయించారు. దాంతో సమస్య మొదటికి వచ్చింది.కానీ కోర్టులో ఈ భూముల కు సంబంధించి స్టేటస్‌కో ఉన్నా గ్రామస్తులు భూముల్లోకి ప్రవేశించి అటవీశాఖ నాటిన చెట్లను తొలగించి తమ చెట్లను నాటుకొని తమ ఫెన్సింగ్‌ను వేసుకున్నారు. అయితే అటవీశాఖ అధికారులు ఫిర్యాదుతో సరిపెట్టుకున్నారు.

# వాయులింగేశ్వరుని సేవలో సుప్రీం కోర్టు జడ్జి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 24 ప్రభాతవార్త** సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా కుటుంబసభ్యులతో కలసి బుధవారం వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఇఓ టి.బాపిరెడ్డి వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించగా వేదపండితులతో వేదమంత్రాలతో ఆశీర్వదించారు.



# 15 గ్రామాల్లో మహిళలు స్మార్ట్‌ఫోన్ వినియోగంపై నిషేధం

## రాజస్థాన్ జాలోర్ జిల్లాలో గ్రామపెద్దల 'ఫోన్' పంచాయితీ

**జాలోర్(రాజస్థాన్), డిసెంబరు 24:** ప్రపంచం మొత్తం 6జివైపు దూసుకుపోతుంటే రాజస్థాన్‌లోని జాలోర్ జిల్లాలోని 15 గ్రామాలు మాత్రం స్మార్ట్‌ఫోన్ వినియోగంపై ఆంక్షలు పెట్టాయి. గ్రామాల్లోని మహిళలు కేవలం కీప్యాడ్‌ఫోన్లు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. సంధమాత పట్టి పంచాయత్‌లోని చౌదరి కమ్యూనిటీ ఈమేకు మహిలలు, బాలికలు స్మార్ట్‌ఫోన్లు వినియోగించకూడదని నిషేధం విధించింది. దీనివల్ల మొబైల్‌ఫోన్లకు బానిసలవుతున్నారని గ్రామపెద్దలు ఆరోపిస్తు చిన్నారుల్లో కంటిచూపులోపాలు కూడా పెరుగుతున్నట్లు చెప్పారు. వచ్చేనెల 26వ తేదీనుంచి ఈ నిషేధం నిర్ణయాలు అమలులో ఉంటాయి. మహిలలు కేవలం కీపాడ్‌ఫోడ్లు మాత్రమే వినియోగించాలి. అలాగే పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలయాలకు ఫోన్లు కూడా తీసుకువెళ్లకూడదు. ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లినా వెంట ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆంక్షలు విధించారు. ఇందుకు సంబంధించిన పంచాయతీ తీర్మానం చదువుతున్న పెద్దతోపాటు ఇతర పెద్దల విడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. కెమేరా ఉన్న ఫోన్లు మహిలలు వాడకూడదు. మాట్లాడేందుకు కెమేరాలేని కీపాడ్‌ఫోన్లుమాత్రమే వాడాలి. విద్యార్థినులు ఇళ్లనుంచి వెళ్లేటపుడు బయటకు ఫోన్లు తీసుకెళ్లకూడదు. పాఠశాల వెళ్లే బాలికలు మాత్రం ఇంట్లో ఫోన్లు వాడుకోవచ్చు. బయటి ఫంక్షన్లకు వీటిని తీసుకెళ్లకూడదు. మహిళలకు స్మార్ట్‌ఫోన్లు ఉండటం వల్ల పిల్లలు వాటిని తీసుకుని బానిసలవుతున్నారని అందువల్లకంటిచూపు లోపిస్తోందని పెద్దలు చెపుతున్నారు. గాజిపూర్‌గ్రామంలోజరిగిని పంచా యతీలో తీర్మానం చేసారు. పట్టి కులానికి చెందిన అద్యక్షుడు సుజన్‌రామ్ చౌదరి ఈ తీర్మానం ప్రతిపాదించారు. ఈ కులపెద్దల నాయకత్వం ప్రకారం పంచ్ హిమమ్మతరం ఈ తీర్మానాన్ని చదివి వినిపించారు. ఈ నిర్ణయం ఇతర గ్రామాల్లోకూడా అమలుచేస్తున్నారు. భిన్మల్ ప్రాంతంలోని ఘాజిపూర్, పావాలి, కల్డా, మనోజ్‌ఉయావాస్, రాజికవాస్, దాట్లవాస్, రాజ్‌పుర, కోడి, సిద్‌రోడి, ఆల్డి, రోప్సి, ఖండేల్వాల్, సావిధర్, హత్మికి ధని, ఖాన్‌పూర్ తదితర పంచాయితీల్లోకూడా ఈతీర్మానం అమలవుతోంది. సోషల్ మీడియాలో తీవ్రస్థాయి విమర్శలు వెల్లువెత్తాయి. మహిళా హక్కుల సంఘా లు కూడా విమర్శించాయి. మహిళా వ్యతిరేకిగా ఈ తీర్మానం ఉందని, మహిళలపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు పెరిగాయి.

# తైవాన్‌లో తీవ్రస్థాయి భూకంపం

## రిక్టర్ స్కేలుపై 6.1గా నమోదు

**తైపేయి, డిసెంబరు 24:** తైవాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఆగ్నే య తీరప్రాంత కౌంటీ అయిన టైటుంగ్‌లో బుధవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.1గా నమోదైంది. ఈ ప్రభావంతో రాజధాని తైపీ లో భవనాలు కుప్పకూలిపోయాయి. అయితే, ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం.. భూకంపం భూమికి 11.9 కిలో మీటర్ల లోతులో నమోదైంది. స్థానిక మీడియా సంస్థ తైవాన్ న్యూస్ ప్రకారం.. భూకంపం కేంద్రం టైటుంగ్ కౌంటీ హాల్‌కు ఉత్తరాన 10 కిలోమీటర్ల దూరంలో ఉంది.

# కొత్త సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వాడకంపై ఈగల్ ఫోర్స్ నజర్

## బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్, న్యూఇయర్ వేడుకల నిర్వాహకులు డ్రగ్స్ వాడరాదని హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** ఈ నెల 31వ తేదీ రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా జం ట నగరాలు, శివార్లలో జరిగే వేడుక లపై ఈగల్ ఫోర్స్ (పూర్వపు టి.నాబ్) దృష్టి సారించింది. న్యూ ఈయర్ వేడుకల్లో మాదకద్రవ్యాల వాడకాన్ని ఎవరూ ప్రోత్స హించరాదని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించే నిర్వాహకు లతో పాటు పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు ఈ విషయంలో కచ్చితంగా వుండాలని ఎవరైనా డ్రగ్స్ వాడకాన్ని ప్రోత్స హించినా, అ మ్మకాలు జరిపినా వెంటనే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌తో పాటు ఈ సిగరెట్లను కూడా నిషేధించామని, వీటిని ఎవరూ వాడవద్దని ఆ యన కోరారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పబ్‌లతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లలో మైనర్లకు మద్యం అందుబాటులో వుంచకూడదని ఆయన తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా మైనర్లు మద్యం సేవించి పట్టుబడితే వారితో పాటు వారికి మద్యం సర ఫరా చేసిన వారు కూడా అరెస్టవుతారని ఆయన హెచ్చరించారు.
తెలంగాణ రాష్ట్రాన్ని నిషా విముక్త ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈగల్ ఫోర్స్ పనిచేస్తుందని, దీనికి అన్ని వర్గాల మద్దత్తు కావాలని ఆయన కోరారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వాడకంపై ఉక్కుపాదం మోపేందుకు ట్రై కమిషనరేట్ల పోలీసులు ఇప్పటికే ప్రత్యేక బృందాలను రంగంలో దించారని, దీనికి అదనం గా ఈగల్ ఫోర్స్ తరపున మాదకద్రవ్యాల స్మగ్లర్ల భరతం పట్టేందుకు సొంత బృందం రంగంలో దిగుతోందని సందీప్ శాండిల్యా తెలిపారు. నూతన సంవతన్సర వేడుకల్లో ఎవరైనా డ్రగ్స్ వాడితే వె ంటనే 8712671111కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

# నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే.. నా ప్రయాణం కాంగ్రెస్‌తోనే

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 24, ప్రభాతవార్త:** తాను పక్కాగా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అందులో ఎలాంటి సందేహం లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. తాను ఏ పార్టీలో ఉంటే అదే గెలుస్తుందని, అదే తన స్పెషాలిటీ అని ఆయన ఛలోక్తి విసిరారు. బంజారాహిల్స్ జహీరానగర్, సింగాడిబస్తీలో జలమండలి అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా వచ్చే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో హైదరాబాద్ నగరంపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యంగా పని చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం నగరం మొత్తం కలియతిరిగి పార్టీని బలోపేతం చేస్తానని ప్రకటించారు. ఎంఐఎంతో కలిసి ప్రచారం చేసి నగరంలోని దాదాపు 300 డివిజన్లలో తాను పర్యటిస్తానని దానం తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీతోపాటు, మిత్ర పక్షంగా ఉన్న ఎంఐఎం అభ్యర్థుల




గెలుపు కోసం కూడా తాను ప్రచారం చేస్తానని ఆయన వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల కూటమి సత్తా చాటుతుందని, ప్రజల మద్దతు తమకే ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఇంత బడ్జెట్ ఇచ్చి, అభివృద్ధి కార్యక్రమాలఉుల చేస్తుంటే కాంగ్రెస్ కాకుండా మరో పార్టీ ఎలా గెలుస్తుందన్నారు. ఫిరాయింపులపై సెటైర్లు, పార్టీ మార్పుల గురించి వస్తున్న వార్తలపై ఆయన తనదైన శైలిలో స్పందించారు. ఇతర ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో, ఎటు వెళ్తున్నారో తనకు తెలియదని, కానీ తాను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణం కాంగ్రెస్‌తోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు రాములు చౌహాన్

# విద్యార్థులు లేని 1,441 పాఠశాలలు తాత్కాలిక మూసివేత

## ఆయా ప్రాంతాల్లో తల్లిదండ్రులు కోరితే మళ్లీ తెరవడానికి సిద్ధం

## తెలంగాణ పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 24:** రాష్ట్రంలో విద్యార్థులు లేని జీరో ప్రభుత్వ పాఠశాలలపై పాఠశాల విద్యా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు లేని పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వాటిని ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం గణాంకాల్లో చూపించరు. ఒక్క విద్యార్థి కూడా లేని ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తెలంగాణలో అధికంగా ఉంది. 2024-25 విద్యా సంవత్సరపు లెక్కల ప్రకారం తెలంగాణలో ఇలాంటి పాఠశాలలు 2,245 ఉన్నాయి. పాఠశాల విద్యా శాఖ పరిధిలో 2 వేలకు పైగా పాఠశాలలు ఉండగా, వాటిలో 1,441 చోట్ల విద్యార్థులు లేరు.

ఉపాధ్యాయ పోస్టులు కూడా లేవు. మరో 600 పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతానికి 1,441 పాఠశాలలను తాత్కాలికంగా మూసి వేయనున్నారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలు పని చేయడం లేనందున తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామస్థులు తమ పిల్లలను బడికి పంపిస్తామని కోరితే పాఠశాలలను తిరిగి తెరుస్తామని, ఉపాధ్యాయులను కూడా నియమిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మారుమూల శివారు తండాల్లో కూడా తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది 200 పాఠశాలలను కొత్తగా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

# నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

## నన్ను ఎవరూ ఆపరేట్ చేయలేరు

## జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల బాణానని, తనను ఎవరూ ఆపరేట్ చేయడం లేదని జాగృతి వ్యవస్థాపకురాలు కవిత స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన జాగృతి జనం బాట కార్యక్రమంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 2029 ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామని, ఆ ఎన్నికల్లో జాగృతి కచ్చితంగా బరిలో ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటివరకు పార్టీ స్పష్టమైన కారణం చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉరి వేసే వ్యక్తికైనా కారణం చెబుతారని, కానీ తన విషయంలో మాత్రం ఎలాంటి వివరణ ఇవ్వలేదని వ్యాఖ్యా నించారు. బీఆర్ఎస్‌లో జరిగిన తప్పులకు ఆ పార్టీలో ఉన్న సమయంలో తానూ భాగస్వామి నేనని ఒప్పుకుంటూ, ప్రజలకు జరిగిన అన్యాయానికి క్షమాపణలు తెలిపారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో పెద్దల భూములను కాపాడేందుకు పేదల భూములను బలి పెడుతున్నారని ఆరోపించారు. నాయకుల అవినీతి కోసం ఇష్టాను సారం ఆలైన్‌మెంట్లు మార్చారని తెలిపారు. దీనిపై జాగృతి తరఫున క్షేత్రస్థాయిలో ఉద్యమ



యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించిన జాగృతి జనం బాట కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

పోరాటాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. జనవరి 5న హైదరాబాద్‌లో బాధిత రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్ట్‌లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని 11.7 టీఎంసీకి పెంచినా ఇప్పటివరకు చుక్క నీరు కూడా రాలేదన్నారు. కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ ఛానెల్స్ పూర్తి కాలేదని, 96 ఎకరాల భూములకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా తీసుకున్నారని విమర్శిం చారు. కలెక్టర్ చొరవ తీసుకుని వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జాగృతి ఓట్ల కోసం వచ్చిన సంస్థ కాదని, ప్రజల సమస్యలపై పోరాడే ఉద్యమని కవిత స్పష్టం చేశారు. 19 ఏళ్లుగా జాగృతి పేరుతో ప్రజల్లో ఉన్నానని, తెలంగాణ భాష, యాస, సంస్కృతి కోసం ఉద్యమం చేశామని గుర్తు చేశారు. బతుకమ్మ, బోనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కృషి చేశామని తెలిపారు. భువనగిరిలో ఏర్పాటు చేసిన ఎయిమ్స్‌లో ఇప్పటికీ ఎమర్జెన్సీ మందులు లేని పరిస్థితి ఉందని తెలిపారు. కేంద్రం నుంచి రూ.750 కోట్లు వచ్చినా భవన నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని విమర్శించారు. భవనాలను త్వరగా పూర్తి చేసి, ఎయిమ్స్‌లో వచ్చే ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకా యిలు వెంటనే చెల్లించకుండా పేద విద్యార్థులను ప్రభుత్వం అవమానిస్తోందని ఆరోపించారు.

ఈ విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని విమర్శించారు. ఎక్కడ జాగృతి పర్యటన చేసినా అక్కడి సమస్యలను ఫాలోఅప్ చేస్తామని, పటిష్టమైన క్యాడర్‌ను నిర్మించి ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.

# గర్భిణి పై దాడి చేసిన అజయ్‌కు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదు

## - తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికిన జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి భైరవ ప్రసాద్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్

**కదిరి, డిసెంబర్ 24 ప్రభాతవార్త** తనకల్లు మండలం ముత్యాల వారి పల్లెలో జగన్ బర్త్డే వేడుకల్లో నిండు గర్భిణీ పై దాడి చేసిన అజయ్‌కు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధం లేదని అజయ్ కు జనసేన పార్టీలో సభ్యత్వం కూడా లేదని... అజయ్ పక్కా వైసీపీ కార్యకర్త అని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భైరవ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసిపిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బర్త్ డే వేడుకల్లో పాల్గొనేది వైసిపి కార్యకర్తలని ఆ విషయం గ్రహించాలని హితవు పలికారు. స్టార్ హీరో పవన్ కళ్యాణ్ కు అభిమానులు అన్ని పార్టీల్లో ఉంటారన్నారు. పనిగట్టుకొని వైసీపీ సోషల్ మీడియా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. వైసీపీ అనుకూల మీడియా తప్పుడు ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు అజయ్ అనే వ్యక్తి ఏ రోజు జనసేన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఒక వ్యక్తిని ట్రాప్ చేసి ఆ వ్యక్తి మాటలు పరిగణలోకి తీసుకొని దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మహిళలను గౌరవించే పార్టీ జనసేన పార్టీ అని నిండు గర్భిణీ పై వైసీపీ కార్యకర్త దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తప్పుడు ప్రచారాలు తప్పుడు మాటలు మాట్లాడటం వైసిపికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మహిళల జోలికి వస్తే తాట తీయమని చెప్పింది డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అని తెలిపారు. వైసీపీ కార్యకర్తపై పోలీసుల స్పెషల్ ట్రీట్మెంట్ పూర్తి స్థాయిలో సమర్థిస్తున్నామన్నారు

ఇప్పటికైనా వైసీపీ సోషల్ మీడియా కొందరు జర్నలిస్టులు వాస్తవాలు తెలుసుకుంటే మంచిది అన్నారు. జనసేన పార్టీ పై బురద చల్లాలని చూస్తే అంతే స్టైల్ లో బదులిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భైరవ ప్రసాద్ హితువు పలికారు.

# దేశ సంపదను కొల్లగొట్టి దోపిడి దారులకు కాపలాకాయడం ధ్యేయంగా మోడీ పాలన సాగుతోంది

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**కదిరి, డిసెంబర్ 24 ప్రభాతవార్త** దేశ సంపదను కొల్లగొట్టి దోపిడి దారులకు కాపలాకాయడం ధ్యేయంగా మోది పాలన సాగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. బుధవారం పట్టణంలోని ఎన్జీఓ హోంలో సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ అధ్యక్షతన జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ..భారత కమ్యునిస్టు పార్టీ శ్రమ జీవుల సమరాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ వంద సంబరాలు పూర్తి చేసుకుని 101లోకి అడుగు పెడుతున్నామన్నారు. బ్రిటీష్ పాలనను పూర్తిగా తిరస్కరించాలని దేశ ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించి రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటు కోసం దేశ నలుమూలల నుంచి అంకిత భావం గల కమ్యునిస్టులంతా సమీకృతులై సీపీఐ పార్టీని స్థాపించారన్నారు. స్వాతంత్రర్య పోరాటంలో ఏ మాత్రం పాత్రలేని పార్టీలు నేడు అధికారాన్ని కౌవసం చేసుకుని దేశ రాజకీయ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. దేశ సంపదను క ఒల్లగొట్టడం, దోపిడీ దారులకు కాపలాకాయడం ద్యేయంగా మోదీ పాలన సాగుతోందని ఆరోపించారు. దేశంలో మత వాద శక్తులు రోజురోజుకు తమ ప్రభావాన్ని పెంచుకుంటూ లౌకిక ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దున్నేవాడిదే భూమి అంటూ వీధి పోరాటాల నుంచి పార్లమెంట్ వరకు పోరాటాలు చేసిన ఘనత భారత కమ్యునిస్టు పార్టీకే దక్కిందన్నారు. మణిపూర్‌లో మహిళ వివస్త్రను చేసి హింసకు గురి చేసి ప్రధాని నోరు ఉండి




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ వికసిత్ భారత్ అంటూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారు తప్పా ఎక్కడా పురోగతి సాధించింది లేదని, కార్మికుల పని 8 గంటల పనిదినాల కోసం సిపిఐ అనేక పోరాటాలతో సాధ్యమైందన్నారు.

ఏ ముఖ్యమంత్రినో..ఏ ప్రధానినో..ఇచ్చింది కాదన్నారు. 18 సంవత్సరాలు నిండిన అందరికీ ఓటు హక్కు కల్పన కోసం సిపిఐ విశేష కృషి చేసిందన్నారు. మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, విమాన, బ్యాంకులు, ఎల్ఐసి వంటి వాటిని విక్రయానికి పెట్టిందే తప్పా సాధించింది శూన్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి విధానంతో ప్రైవేటీకరణ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. జనవరి 18న కమ్మంలో జరిగే శత వసంత వేడుకలకు ఐదు లక్షల మందితో కమ్మంలో కదం తొక్కుదామని ఆయన పిలుపునిచ్చారు.

సమావేశం కంటే ముందు సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక మదనపల్లి రోడ్డులోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, రామచంద్రయ్య, సిపిఐ నాయకులు కాటమయ్య, జింక చలపతి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండు వారాల్లో యుపిఎస్‌సికి డిజిపి ఎంపిక ప్యానెల్

## ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశంజనవరిలో జాబితాను పంపనున్న సర్కారు?

**హైదరాబాద్, డిసెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఎంపికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో బుధవారం మరోసారి విచారణ జరిగిందఇ. శివధర్ రెడ్డి ఎంపిక నిబంధనల మేరకు జరగలేదని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యుపిఎస్‌సికి ఎలాంటి జాబితాను పం పలేదని పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది తెలిపారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, డిజిపి ఎంపిక నిబంధనల మేరకు మరోసారి జరపా లని ఆయన కోరారు. దీనిపై వారం రోజుల క్రితం విచారణ చేసిన హైకోర్టు బుధవారం నాడు మళ్లీ విచారించింది. అనంతరం దీనిపై రాష్ట్ర ప్రభు త్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సికి పంపాలని ప్రభుత్వాన్ని ఆదే శించింది. అయితే డిజిపిగా శివధర్ రెడ్డి నియామకం విషయంలో తాము జోక్యం చేసుకోబోమని పేర్కొన్న హైకోర్టు దీనిపై విచారణను రెండు వా రాలు వాయిదా వేసింది. కాగా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితాను సీనియారిటీ ప్రకారం యుపిఎస్‌సి పంపేం దుకు సర్కారు సిద్ధమవుతోంది. పోలీసు శాఖలో సీనియారిటీ ప్రకారం 1991 బ్యాచ్ అధికారి హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి ఆనంద్ సీనియర్. ఆయన తరువాత 1994 బ్యాచ్‌లో కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే ద్వితీయ స్థానంలో వున్నారు. వీరిద్దరి తరువాత ఇ దే బ్యాచ్‌కు చెందిన డిజిపి శివధర్ రెడ్డి మూడవ స్థానంలో వున్నారు. వీరి తరువాత ఇదే బ్యాచ్‌కు చెందిన తెలంగాణ పోలీసు అకాడమి డైరక్టర్ అ భిలాష్ బిస్త్, ఆమె తరువాత జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, ఆమె తరువాత తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్‌గా వున్న శిఖా గోయల్ సీనియర్లుగా వున్నారు. అయితే డిజిపి ఎంపికలో కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే పేరును పరిగణలోకి తీసుకునే అవకాశాలు లేవని తెలిసింది. దీంతో మిగతా వారి పేర్లను మాత్రమే పరిగణలోకి తీసుకునే వీలుంది. ఈ లెక్కన డిజిపి ఎంపికలో నలుగురి పేర్లను ప్రభుత్వం యుపిఎ స్‌సికి పంపాలని అనుకుంటే ఆనంద్, శివధర్ రెడ్డి, అభిలాష్ బిస్త్, సౌమ్యా మిశ్రా పేర్లను పంపే వీలుంది. ఒకవేళ ఐదుగురి పేర్లను పంపాలని అ నుకుంటే వీరితో పాటు శిఖా గోయల్ పేరును కూడా పంపే వీలుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన పేర్లలో ముగ్గురిని యుపిఎస్‌సి ఎంపిక చేసి ఈ జా బితాను తిరిగి రాష్ట్రానికి పంపుతుంది. ఇదంతా నిబంధనల మేరకు జరిగే ప్రక్రియ. ఈ జాబితా నుంచి ఒకరిని రాష్ట్రం డిజిపిగా ఎంపిక చేసుకునే వీలుంది. రాష్ట్రం నుంచి వచ్చే జనవరిలో యుపిఎస్‌సికి డిజిపి ఎంపికకు సంబంధించిన జాబితా వెళ్లే వీలుంది. అనంతరం అదే నెలలో యుపిఎస్ సి నుంచి ఎంపికకు సంబంధించిన జాబితా తిరిగి వచ్చే వీలుంది. దీని తరువాత డిజిపి ఎంపిక ఖరారవుతుంది. గతంలో అనురాగ్ శర్మ, మహేం దర్ రెడ్డిల విషయంలో ఇలాగే జరిగింది. ఈ కారణంగా అనురాగ్ శర్మ మూడేళ్లకు పైగా మహేందర్ రెడ్డి ఐదేళ్లకు పైగా డిజిపిగా విధులు నిర్వహిం చ గలిగారు. ఒకవేళ శివధర్ రెడ్డిని యుపిఎస్‌సి పంపిన జాబితా నుంచి రాష్ట్రం ఎంపిక చేస్తే ఆయన కచ్చితంగా రెండేళ్ల పాటు డిజిపిగా విధులు ని ర్వహించాల్సి వుంటుంది. ఆయన వచ్చే యేడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన మళ్లీ పూర్తిస్థాయి డిజిపిగా పదవీబాధ్యతలు చేబడితే మరో రెండేళ్లపాటు ఆ పదవిలో వుంటారు. ఎపి డిజిపి హరీష్‌గుప్తా ఇలాగే కొనసాగుతున్నారు.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం

## ప్రియుడు, ప్రియురాలు అరెస్ట్‌కాకినాడ యువతి హైదరాబాద్‌లో డ్రగ్స్ అమ్మకం

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబర్ 24, ప్రభాతవార్త :** మహానగరం క్రమంగా మత్తు పదార్థాల ప్రభావంలో చిక్కుకుంటోంది. తాజా లెక్కల ప్రకారం హైదరాబాద్‌లోనే 10 వేల మందికి పైగా మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు అంచనా ఉంది. ఇప్పటి వరకు డ్రగ్స్ సరఫరాలో నైజీరియన్ గ్యాంగులు, అంతర్రాష్ట్ర ముఠాలే ప్రధానంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు చదువుకున్న, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారే డ్రగ్స్ విక్రయాల్లోకి రావడం నగరాన్ని కలవరపెడుతోంది. బీటెక్ పూర్తి చేసి, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఓ యువతి డ్రగ్స్ అమ్మకాల్లో పాల్గొని పోలీసులకు చిక్కడం ప్రస్తుతం హైదరాబాద్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఏపీలోని కాకినాడకు చెందిన సుస్మిత అనే యువతి హైదరాబాద్‌కు వచ్చి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. ఆమె తన బాయ్‌ఫ్రెండ్ ఇమ్మాన్యుయెల్‌తో కలిసి డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిద్దరితో పాటు మరో ఇద్దరిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఎండీఎంఏ, ఎల్ఎస్డీ బాటిళ్లు, ఓజీ కుష్ వంటి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీసులు - హెచ్ఎన్ఈడబ్ల్యూ, చిక్కడపల్లి పోలీసులతో కలిసి సంయుక్త ఆపరేషన్ నిర్వహించి, (01) స్థానిక డ్రగ్ పెడ్లర్, (02) స్థానిక డ్రగ్ సబ్‌పెడ్లర్లు మరియు (01) వినియోగదారుడిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 22 గ్రాముల ఓజీ (హైడ్రోఫోనిక్ గంజాయి), 5 గ్రాముల ఎండిఎంఏ, 5.57 గ్రాముల ఎక్స్‌టసీ మాత్రలు, 06 ఎల్ఎస్‌డి బ్లాట్స్, 04 మొబైల్ ఫోన్లు, రూ. 50,000/ నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో కొండాపూర్ ప్రాంతానికి చెందిన ఈవెంట్ మేనేజర్ ఉమ్మిడి ఇమ్మాన్యుయేల్( (25 ), స్థానిక డ్రగ్ సబ్‌పెడ్లర్ల చోడవరుపు సుస్మితా దేవి లిల్లీ ( 21 ) , రాపిడో స్విగ్గీ డెలివరీ బాయ్ గోర్ల సాయి కుమార్ ( 28 ), వినియోగదారుడు, చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన తలబత్తుల తారక లక్ష్మీ ్మకాంత్ అయ్యప్ప, ( 24 ) లను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ లావాదేవీల కోసం గతంలో ఫోన్ కాల్స్, వాట్సాప్ వంటివి ఉపయోగించేవారు. అయితే వాటిని గుర్తించే అవకాశం ఎక్కువగా ఉండటంతో ఇటీవల టెలీగ్రామ్ యాప్ ద్వారా రహస్యంగా వ్యవహారాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. చదువుకున్న యువతే ఈ తరహా నేరాల్లో భాగస్వాములవడం హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియా ఎంత లోతుగా విస్తరించిందో చెబుతోంది.

# పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర చిన్నారుల విక్రయ ముఠా

**హైదరాబాద్ (గచ్చిబౌలి), డిసెంబరు 24, ప్రభాతవార్త:** రోజుల వయస్సు ఉన్న చిన్నారులను వి క్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠా సైబరాబాద్ పోలీసుల చేతికి చిక్కింది. ఈ ముఠాలోని మొత్తం 11మందిని అరెస్టు చేసిన పోలీసులు వీరి వద్ద నుంచి 10 రోజుల వయస్సు ఉన్న ఇద్దరు శిశువులను కాపాడి శిశువిహార్‌కు తరలించారు. గతంలో నగరంలోని గోపాలపురంలో సంచలనం స ృష్టించిన స ృష్టి కేసులో నిందితులుగా ఉన్న పలువురు ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. పాత కేసుల్లో బెయిలు మీద విడుదలైన నిందితులు మరోసారి పిల్లల అక్రమ రవాణా చేపడుతూ మియాపూర్ పోలీసులకు చిక్కారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి రితురాజ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కడప జిల్లాకు చెందిన వి.బాబురెడ్డి(49) నగరానికి వచ్చి మేడ్చల్‌లో నివాసం ఉంటూ ఐవిఎఫ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈస్ట్‌గోదావరి జిల్లా నుంచి నగరానికి వచ్చి సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్న వి.గంగాధర్‌రెడ్డి(39) సైతం గతంలో ఐవిఎఫ్ ఏజెంట్‌గా పనిచేశాడు. వీరు తమ అనుచరులతో గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకొని శిశువుల అక్రమ రవాణా, అక్రమ విక్రయాలకు పాల్పడసాగారు. వీరు స్పెమ్ డొనేషన్, ఐవిఎఫ్ ఏజెంట్, సరోగసి ఏజెంట్లుగా సైతం వ్యవహరించారు. తమ అనుచరులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులలో ఉండి అప్పుడే ప్రసవించిన కుటుంబాలను కలిసి డబ్బు ఆశ చూపించి శివుశులను కొనుగోలు చేస్తుంటారు. అనంతరం పిల్లలు లేక ఇబ్బందులు పడుతున్న వారికి లక్షల రూపాయలకు సదరు శిశువులను విక్రయించసాగారు. గంగాధర్‌రెడ్డి గతంలో నగరంలోని గోపాలపురం స ృష్టి కేసులో అరెస్టయి జైలుకు వెళ్లాడు. గతంలో ఇతనిపై 13 కేసులు నమోదయ్యాయి. బాబు రెడ్డి మీద సైతం గతంలో రెండు కేసులు ఉండగా, అరెస్టయి జైలుకు వెళ్లాడు. గతకొన్ని రోజుల క్రితం జైలు నుంచి విడుదలైన వీరు తమ అనుచరులతో కలిసి మరోసారి చిన్నారుల అక్రమ రవాణా చేపడుతున్నారు.

# వరల్డ్ కప్ కోసం ఆల్‌ఫార్మాట్ ప్లేయర్లకే ఛాన్స్






## టీమిండియా భవిష్యత్‌కు మెగా ప్లాన్

**న్యూఢిల్లీ:** వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. ఒకవేళ వారు రిటైర్మెంట్ ప్రకటించకపోతే, జట్టులో కచ్చితంగా మార్పులు ఉంటాయి. కానీ మేనేజ్‌మెంట్ మాత్రం యశస్వి జైస్వాల్, తిలక్‌వర్మ వంటి యువకులను 50 ఓవర్ల ఫార్మాట్ కోసం సిద్ధం చేస్తోంది. భారత క్రికెట్‌లో సీనియర్ల శకం ముగియనుండటంతో, వన్డే ఫార్మాట్ కోసం ప్రత్యేకంగా యువ జట్టును సిద్ధం చేయాలని సెలక్టర్లు భావిస్తున్నారు.

కేవలం రాబోయే టి20 ప్రపంచ కప్ 2026 పైనే కాకుండా, దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్ 2027 పై కూడా దృష్టి సారించాయి. భారత్ జట్టులో ఉండే ఆటగాళ్లలో కేవలం ఐదు గురు మాత్రమే వన్డే వీటికి ఎంపికయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రపంచ కప్ జట్టులోని అందరు ఆటగాళ్లు వన్డే ఫార్మాట్‌కు సరిపోరని, అందుకేకేవలం ఆల్‌ఫార్మాట్ ప్లేయర్లను మాత్రమే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు జరుగుతున్న కసరత్తులో ఐదుగురు ప్లేయర్లకు వాటిల్లో చోటు దక్కే అవకాశాలను సెలక్ట్ కమిటీ చర్చిస్తోంది. వీరిలో టీమ్ ఇండియా ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా నమ్మదగ్గ బౌలర్‌గా ఉండగా, ఆల్‌రౌండర్‌గా జట్టుకు సమతుల్యతను అందించే కీలక ఆటగాడు. హార్దిక్ పాండ్యా పేరు పరిశీలనలో ఉంది. అలాగే నిలకడైన ప్రదర్శనతో టీ20 వైస్ కెప్టెన్‌గా ఎదిగిన అక్షర్ పటేల్ వన్డేల్లోనూ కీలకంగా ఉన్నాడు. మరో పక్క టీ20 జట్టులో చోటు కోల్పోయినప్పటికీ, వన్డేల్లో భారత్‌కు కాబోయే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పరిగణిస్తున్నారు.

ఇక స్పిన్ విభాగంలో కుల్దీప్ యాదవ్ చైనామన్ బౌలింగ్ వన్డే ఫార్మాట్‌కు అత్యంత అవసరం. కాగా టి20ల్లో ప్రపంచ నంబర్ 1 బ్యాటర్‌గా, జట్టు కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ వన్డే ప్రపంచ కప్ రేసులో వెనుకబడినట్లు కనిపిస్తోంది. అతని వయస్సు (35 ఏళ్లు), గత వన్డే రికార్డులను పరిగణనలోకి తీసుకుంటే, 2027 నాటికి అతను వన్డే జట్టులో ఉండటం కష్టమేనని భావిస్తున్నారు. ఈ మెగా ప్లాన్ టీమిండియాను భవిష్యత్తులో మరింత బలోపేతం చేస్తుందని బోర్డు భావిస్తోంది. 2026 టీ20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే వన్డే జట్టుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




## విజయ్ హజారే ట్రోఫీ..
# రోహిత్, కోహ్లీ సెంచరీలు

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ పునరాగమనంలో రోహిత్, కోహ్లీ సెంచరీలు బాదారు. ఇద్దరు ఆటగాళ్లు తమ ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయించారు. ఈ టోర్నీ తొలి రోజు బుధవారం మొదటి అర్ధభాగం అంతా రికార్డు సెంచరీలతో సాగగా, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రెండవ అర్ధభాగంలో తమ తమ సెంచరీలతో అందరి దృష్టిని ఆకర్షించారు. బుధవారం ముంబై తరఫున ఏడు సంవత్సరాల తర్వాత తన తొలి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో సెంచరీ సాధించి, రోహిత్ దేశీయ క్రికెట్‌లోకి సంచలనాత్మక పునరాగమనం చేశాడు. సిక్కింపై ముంబై తరఫున రోహిత్ కేవలం 62 బంతుల్లోనే అద్భుతమైన 155 పరుగుతో సెంచరీ సాధించాడు. జైపూర్‌లో సిక్కిం జట్టు 236 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించాడు, వరుసగా సిక్సర్లు, ఫోర్లు బాదడంతో లక్ష్యాన్ని సులభంగా చేరుకునే అవకాశం లభించింది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో 14,000 పరుగులకు చేరుకున్న రోహిత్ సెంచరీ లిస్ట్ ఎ క్రికెట్‌లో 37వ సెంచరీగా నిలిచింది, ఇది భారత్ తరఫున అతని 33 అంతర్జాతీయ సెంచరీల సంఖ్యకు జోడించింది. ఇక కోహ్లీ కూడా ఆంధ్రప్రదేశ్‌పై 83 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. బెంగళూరులో ఆంధ్రతో జరిగిన 299 పరుగుల ఛేదనలో కోహ్లీ 15 సంవత్సరాల తర్వాత విజయ్ హజారే ట్రోఫీకి తిరిగి వచ్చాడు. కోహ్లీ తన సాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుతమైన సెంచరీని సాధించాడు. ఇది అతని 58వ లిస్ట్ ఎ సెంచరీ. ఈ నెల ప్రారంభంలో దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత నాలుగు ఇన్నింగ్స్‌లలో అతని మూడవ సెంచరీ. ఇన్నింగ్స్‌లో తన తొలి పరుగుతోనే కోహ్లీ లిస్ట్ ఎ లో 16,000 పరుగులు సాధించిన తొమ్మిదవ ఆటగాడిగా ఎలైట్ క్లబ్‌లో చేరాడు.

# గ్లోబల్ చెస్ లీగ్ ఛాంపియన్‌గా ఆల్పైన్ పైపర్స్

**న్యూఢిల్లీ:** గ్లోబల్ చెస్ లీగ్-2025 ఛాంపియన్‌గా ఆల్పైన్ ఎస్‌జి పైపర్స్ నిలిచింది. రెండు సార్లు డిఫెండింగ్ ఛాంపియన్స్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్‌ను ఓడించిన ఆల్పైన్ టైటిల్ గెలుచుకుంది. గుకేశ్ దొమ్మరాజుకు చెందిన పిబిజి అలస్కాన్ నైట్స్ మూడో స్థానంలో నిలిచింది. పైపర్స్ మొదటి రాపిడ్ మ్యాచ్‌ను నల్లటి పావులతో 4-2 తేడాతో గెలవగా. తరువాత తెల్లటి పావులతో 4.5-1.5 తేడాతో విజయం సాధించింది. టైబ్రేక్‌లో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్‌లను ఓడించి పిబిజి అలాస్కాన్ నైట్స్ మూడవ స్థానంలో నిలిచింది. త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ ఫేవరెట్‌గా ఫైనల్‌లోకి ప్రవేశించింది. కానీ లీగ్ దశ రెండవ భాగంలో ఫామ్‌తో ఉన్న పైపర్స్‌లో నినో బాట్సియాష్విలి, లియోన్ ల్యూక్ మెండోంకాలు గెలవడం ద్వారా జట్టు ఆధిపత్యంలోకి వచ్చింది.

బిషప్‌నైట్ ఎండ్‌గేమ్‌లో నినో అలెగ్జాండ్రా కోస్టెనిక్‌పై విజయం సాధించగా, మెండోంకా 52 ఎత్తుగడల తర్వాత మార్క్ ఆండ్రియా మోరిజ్జీని వెనుకబడేలా చేశాడు. కాంటినెంటల్ కింగ్స్ స్టార్ ప్లేయర్ అలిరేజా ఫిరోజ్జా ఐకాన్ బోర్డులో ఫాబియానో కరువానాను ఓడించి తన జట్టును తిరిగి పోటీలోకి తీసుకువచ్చాడు. కానీ అనిష్ గిరి వీయిపై విజయం సాధించడంతో పైపర్స్ మొదటి మ్యాచ్‌ను 4-2 తేడాతో కైవసం చేసుకున్నాడు. మ్యాచ్‌లో సజీవంగా ఉండటానికి కాంటినెంటల్ కింగ్స్ 4 పాయింట్లు సాధించాల్సి ఉండగా, ఆర్ ప్రజ్ఞానంద పైపర్స్‌కు విదిత్ గుజరాతీపై విజయంతో తొలి ఆధిక్యాన్ని అందించాడు. మరియు అనీష్ గిరి ఆ తర్వాత వీ యిపై రెండవ విజయాన్ని నమోదు చేశాడు. గుకేష్‌పై ఆనంద్ 49 ఎత్తుగడలలో గెలిచి ఆల్పైన్ ఎజీ పైపర్స్‌కు ట్రోఫీని రావడంలో కీలకంగా వ్యవహరించాడు.




## సబ్ జూనియర్ పురుషుల హాకీ..
# పంజాబ్, ఎస్ఎజి, సెయిల్ విజయాలు

**న్యూఢిల్లీ:** హాకీ ఇండియా సబ్‌జూనియర్ మెన్ అకాడమీ ఛాంపియన్‌షిప్ 2025-జోన్ ఎ, బిలో రెండవ రోజు నామ్‌ధారి, రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ హాకీ అకాడమీ, మరియు సెయిల్ హాకీ అకాడమీ కీలక విజయాలు నమోదుచేశాయి. గుజరాత్‌లో బుధవారం పూల్ డి మ్యాచ్‌తో ప్రారంభమైంది, నామ్ ధారి జట్టు ఎస్‌జిపిసి హాకీ అకాడమీపై 2-1 తేడాతో విజయం సాధించింది. విజేతల తరపున కెప్టెన్ గంగా సింగ్ (21వ నిముషం), కరణ్‌బీర్ సింగ్ (22) గోల్స్ చేయగా, ఎస్‌జిపిసి తరపున సుఖ్‌ప్రీత్ సింగ్ (60) గోల్స్ చేశారు. అలాగే పూల్ సిలో రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీక్లబ్ అకాడమీ 18-1 తేడాతో సాల్యూట్ హాకీ అకాడమీపై విజయం సాధించింది. వరిందర్ సింగ్ (10, 15, 20, 42, 51), అర్జన్‌దీప్ సింగ్ (24, 27, 31, 49, 58) ఐదు గోల్స్ సాధించగా, మన్వీర్ సింగ్ (7, 22, 34, 60+) నాలుగు గోల్స్ సాధించారు. అర్షదీప్ సింగ్ (24, 36), శామ్యూల్ (3), షన్ముఖ్ సింగ్ (25) కూడా రౌండ్‌గ్లాస్ పంజాబ్ హాకీ క్లబ్ అకాడమీకి తమ వంతు సహకారం అందించారు. సాల్యూట్ హాకీ అకాడమీ తరపున అరుణ్ (18) ఏకైక గోల్ సాధించాడు. ఇదే పూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ హాకీ అకాడమీ చీమా హాకీ అకాడమీపై 2-1 తేడాతో విజయం సాధించింది. చీమా హాకీ అకాడమీ తరపున గురుప్రీత్ సింగ్ (54) గోల్స్ సాధించారు. ఇక ఈ రోజు జరిగిన చివరి మ్యాచ్‌లో సెయిల్ హాకీ అకాడమీ జట్టు పూల్ బి పోరులో రిపబ్లికన్ స్పోర్ట్స్ క్లబ్‌పై 5-0 తేడాతో విజయం సాధించింది. విజేతల తరపున షాహిద్ మహ్మద్ (15+), కునాల్ కవ్రే (34), మిలన్ అథోక్‌పామ్ (43), సుమన్ కిండో (48), మరియు బికాష్ స్వైన్ (54) గోల్స్ చేశారు.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో..
# శుభ్‌మాన్‌కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ:** ఐసిసి వరల్డ్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మాన్ గిల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. భారత టెస్ట్, వన్డే కెప్టెన్ ఇప్పుడు ఐసిసి టాప్10 టెస్ట్‌బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్ నుండి తప్పుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేయలేకపోయిన పరిణామాలను గిల్ ఎదుర్కొన్నాడు. గతవారం వరకు, టెస్ట్‌ర్యాంకింగ్స్‌లో గిల్ 10వ స్థానంలో ఉన్నాడు. కానీ బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో, అతను ఒక స్థానం దిగజారి టాప్10 నుండి తప్పుకున్నాడు. టాప్10లో మిగిలి ఉన్న ఏకైక భారతీయ బ్యాట్స్‌మన్ యశస్వి జైస్వాల్ ఇప్పుడు 8వ స్థానంలో ఉన్నాడు. అడిలైడ్‌లో జరిగిన మూడవ యాషెస్ టెస్ట్‌లో పేలవమైన ప్రదర్శన ఇచ్చినప్పటికీ ఇంగ్లాండ్ దిగ్గజ బ్యాట్స్‌మన్ జోరూట్ నెంబర్ 1 స్థానంలో కొనసాగుతున్నాడు.అడిలైడ్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టులో స్టీవ్ స్మిత్ స్థానంలో వచ్చిన ఉస్మాన్ ఖవాజా మూడు స్థానాలు ఎగబాకి ఇప్పుడు 20వ స్థానంలో ఉన్నాడు. టాప్ 10లో ఉన్న ఇతర బ్యాట్స్‌మెన్‌లలో హెడ్, కారీ మరియు జైస్వాల్ కాకుండా, జో రూట్ నంబర్ వన్ స్థానంలో, న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ రెండవ, ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ మూడవ, ఇంగ్లాండ్‌కు చెందిన హ్యారీ బ్రూక్ ఐదవ, శ్రీలంకకు చెందిన కమిందు మెండిస్ ఆరవ, దక్షిణాఫ్రికాకు చెందిన టెంబా బావుమా ఏడవ, పాకిస్తాన్‌కు చెందిన సౌద్ షకీల్ పదవ స్థానంలో ఉన్నాడు.




Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# ఎమ్మెల్యే బత్తుల కృషితో ఆరోగ్య రాజానగరం



ఫైల్‌ఫొటో

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబర్24,(ప్రభాతవార్త** రాజానగరం నియోజకవర్గంలో ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి 5.728 కోట్ల రూపాయల మంజూరు అయ్యాయి.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా 12 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి, అభివృద్ధికి కూటమి సర్కార్ నిధులు మంజూరు చేసింది. ఎన్నికల్లో రాజానగరాన్ని ఆరోగ్య రాజానగరంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారి హామీ ఇచ్చారు. ఏడాదిన్నర కాలంలోనే ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషి. రాజానగరం నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా అహర్నిశలు శ్రమించిన పేదల పక్షపాతి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషితో 8 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు,మూడు బ్లాక్ ప్రజా ఆరోగ్య యూనిట్లు,ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాలు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి రానున్న మరింత మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు.పట్టువదలని విక్రమార్కుడిలా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకుడు ఎమ్మెల్యే.తూర్పుగోదావరి జిల్లాలో రాజానగరం నియోజకవర్గం జన నాయకుడు ఎమ్మెల్యే బత్తుల కృషి, పట్టుదలతో అభివృద్ధి పథంలో పయనిస్తోంది.నా నియోజకవర్గం నా ప్రజలు ఇది ఎన్నికలకు ముందుబత్తుల బనినాదం.ఈ నినాదం కేవలం ప్రచారానికే పరిమితం కాలేదు.ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఈ నినాదాన్ని తన జీవన నాదంగా మార్చుకున్నారు.ఎన్నికలకు ముందు ప్రజలకు ఏమైతే హామీలను ఇచ్చామో వాటిని నెరవేర్చేందుకు నిరంతరం తపన పడుతున్నారు.ఆ ఎన్నికల హామీలో ఒకటే రాజానగరాన్ని ఆరోగ్య రాజానగరంగా అభివృద్ధి చేస్తానని.ఈ హామీని నిలబెట్టుకునే యజ్ఞంలో విజయం సాధిస్తున్నారు ఎమ్మెల్యే. నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ,సీతానగరం మండలాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే బలరామకృష్ణ అనేక ప్రతిపాదనలను తయారుచేసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకుని వెళ్లారు. ప్రజల కోసం పడుతున్న తపనకు ఫలితం లభించింది. నియోజకవర్గం లో ప్రాథమిక స్థాయిలో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు12 కొత్త ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం 5.728 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది.ఈ నిధులతో నియోజకవర్గంలో 8 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు (బూరుగుపూడి, లాలాచెరువు హౌసింగ్ బోర్డు, ఫరిజల్లిపేట, కాటవరం, మునికూడలి ,రఘుదేవపురం, కూనవరం, మిర్తిపాడు) మూడు బ్లాక్ ప్రజా ఆరోగ్య యూనిట్లు (కోటికేశవరం,రాజానగరం, బొబ్బిల్లంక )ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం (బొబ్బిల్లంక) అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సుపరిపాలనలో భాగంగా ఈ ఆరోగ్య కేంద్రాలను రాజానగరం నియోజకవర్గానికి మంజూరు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఒక ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు ఆలోచనలు చేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే బత్తుల కృషికి ప్రభుత్వం మంజూరు చేసిన ఈ కొత్త ఆరోగ్య కేంద్రాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం. ప్రస్తుత సమాజంలో వైద్యం అతి ఖరీదైన సౌకర్యంగా మారిపోయింది.ముఖ్యంగా సామాన్య, పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలు ప్రాథమిక వైద్యం కోసం కూడా అష్ట కష్టాలు పడుతున్నారు.గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ప్రాథమిక వైద్యం ఉంటే వారికి నాణ్యమైన వైద్య సేవలను అందించడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే ఆలోచించారు. దీంట్లో భాగంగానే ఎప్పుడు అమరావతి వెళ్లినా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇంకా మంత్రులను కలవడం,తన నియోజకవర్గ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం వినతి పత్రాలు సమర్పించడం చేస్తూ వస్తున్నారు. దీంట్లో భాగంగానే ఎమ్మెల్యేగా గెలిచిన తొలి రోజు నుంచే రాజానగరం నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికలు తయారుచేసి.. ప్రభుత్వానికి అందించారు. ఇప్పుడు నియోజకవర్గానికి 12 వైద్య సేవ కేంద్రాలు మంజూరు కావడం అభినందనీయం. ఈ ఆరోగ్య కేంద్రాల ద్వారా రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన 5.728 కోట్ల రూపాయలతో ఈ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టి, శరవేగంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే బలరామకృష్ణ ముందుకు సాగుతున్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం గురువారం 25 డిసెంబర్ 2025 I


# ఆక్రమిత చెరువును పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 24(ప్రభాతవార్త):** ప్రభుత్వ చెరువును ఆక్రమించిన వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని ట్రైనీ కలెక్టర్ మనీషా అన్నారు. మండలంలోని కొండెవరంలో సర్వే నెంబర్ 32లో 64.50ఎకరాల ఆక్రమణకు గురైన చెరువును బుధవారం తహాశీల్దారు చిన్నారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు ఆక్రమించి సాగు చేస్తున్న వారిని గుర్తించాలన్నారు. వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. నీటి పారుదల శాఖ, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

# వేసవికి ముందే తాగునీటి సమస్య పరిష్కరిస్తాం..

**ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ - రాచపల్లిలో జి ఎల్ ఆర్ ట్యాంక్ ప్రారంభం**



**ప్రత్తిపాడు,డిసెంబరు24(ప్రభాతవార్త)** వేసవికి ముందే తాగునీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించడం జరుగుతుందని ప్రతిపాద ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ అన్నారు. బుధవారం ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో జిఎల్ఆర్ వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో వేసవి ముందే తాగునీటి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ఇప్పటి నుండే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# "అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో క్రిస్మస్ సంబరాలు"



**పి.గన్నవరం డిసెంబర్ 24(ప్రభాత వార్త)** పి.గన్నవరం మండలం అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో క్రిస్మస్ సంబరాలు టీచర్స్,స్కూల్ పిల్లలు ఆట పాటలు డాన్స్ తో సందడి చేశారు.అక్షర స్కూల్ డైరెక్టర్ జి. మురళి కృష్ణ ,స్కూల్ ప్రిన్సిపాల్ జి.రాణి మరియు పాస్టర్ డేవిడ్,నాయకులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బొబ్బర్లంక వద్దిపర్రు రహదారి ప్రస్తుత మరమ్మతుల కోసం రూ 70 లక్షల మంజూరు

**మెర్లపాలెం నుంచి లొల్ల వరకు నూతన రహదారి నిర్మాణానికి రూ 3కోట్లు**

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట, డిసెంబర్ 24,(ప్రభాతవార్త)** ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకు రహదారి విస్తరణ పనుల కోసం ఇప్పటికే రూ 35 కోట్లు ప్రతిపాదనలు పంపడం జరిగిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు ప్రభుత్వం నుంచి అనుమతుల కోసం వేచి చూస్తున్నామని ఆయన అన్నారు బొబ్బర్లంక నుంచి వద్దిపర్రు వరకు రహదారి ప్రస్తుత మరమ్మత్తు పనుల నిమిత్తం రూ 70లక్షలు ఆర్ అండ్ బి నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలియజేశారు మెర్లపాలెం నుంచి లొల్ల వరకూ నూతన రహదారి నిర్మాణం కొరకు రూ 3కోట్లు ఆర్ అండ్ బి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు త్వరలోనే టెండర్లు పిలిచి నిర్మాణాలు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బండారు తెలిపారు.

# సేవా భావంతో మెలగడమే క్రైస్తవం..

**వైసీపీ నేత మురళీ కృష్ణం రాజు**

**ధర్మవరం బెతెస్థ యెరూషలేము దైవసన్నిధిలో క్రిస్మస్ వేడుకలు**



**ప్రత్తిపాడు,డిసెంబరు 24( ప్రభాతవార్త)** సేవా భావంతో మెలగడం క్రైస్తవమని, క్రీస్తుబోధనలు నేటి ప్రపంచానికి అవసరమని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి కృష్ణం రాజు అన్నారు. బుధవారం ధర్మవరం బెతెస్థ యెరూషలేము దేవాలయం దైవసన్నిధిలో రెవ.అంబటి ఎలీషా, విశ్వసమ్మ (పాప) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో మురళి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి, కొవ్వొత్తులు వెలిగించి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మురళి రాజు మాట్లాడుతూ మానవాళికి ప్రేమ,దయ,కరుణ పంచిన మహనీయుడని ఏసుక్రీస్తు అన్నారు. కుల, మత,వర్ణ బేధాలు మెలగడమే క్రైస్తవమన్నారు. క్రైస్తవ విశ్వాసులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యెరూషలేము దేవాలయం దైవసన్నిధి స్వస్థతశాల బిషన్. పి. జ్ఞానరాజు,కోలా తాతబాబు,బొల్లు నాగేశ్వరరావు,జువ్వల దొరబాబు, యాళ్ల ఏసు,జువ్వల మసలయ్య,అంబటి గణేష్,మడికి నాగు,అంబటి కిషోర్ ,యెరూషలేము దేవాలయం కమిటీ సభ్యులు యూత్, దైవజనులు తదితరులు పాల్గొన్నారు

# క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి రక్షణ మార్గం

**చైర్మన్ తమ్మయ్య నాయుడు**



**శంఖవరం, డిసెంబర్ 24 (ప్రభాతవార్త) :** సమస్త మానవాళికి శాంతి, ప్రేమ, సమాధానం కలిగి ఈ సమాజంలో ఎలా నడుచుకోవాలో క్రీస్తు బోధనలు తెలియజేస్తాయని మాధురి విద్యాలయం చైర్మన్ తమ్మయ్య నాయుడు పేర్కొన్నారు మండలంలోని కత్తిపూడి లో గల మాధురి విద్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అహింస మార్గంలో శాంతియుతంగా పొరుగువారిని ప్రేమిస్తూ సమాధానం కలిగి ఉండడమే నిజమైన క్రిస్మస్ అన్నారు. యేసు క్రీస్తు పుట్టుక గురుంచి,క్రిస్మస్ పండుగను ఎందుకు జరుపుకుంటారో, ఎలా జరుపుకోవాలో పిల్లలకు తెలియజేసారు. యేసు క్రీస్తు జీవితం నుండి తల్లితండ్రులను ఎలా గౌరవించాలో, మంచి ప్రవర్తన కలిగి ఇతరుల కోసమే మన జీవితాన్ని త్యాగం చేయ్యాలని, మనం నేర్చుకున్నది ఆచరించాలని పిల్లలకు సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్దులు క్రిస్మస్ పాటలు పాడి, నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు యేసు క్రీస్తు, దైవ దూతలు మరియు శాంతా క్లాజ్ వేష ధారణలో వచ్చి ఆనందోత్సవాలతో ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సీతాదేవి ప్రిన్సిపల్ అడపా ఆదినారాయణ విద్యార్థులు,ఉపాద్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మసీదులు అభివృద్ధికి ఎంపీ కి వినతి



**అమలాపురం,డిసెంబర్24,ప్రభాతవార్త** అమలాపురం పార్లమెంట్ పరిధిలో నీ మసీదులు మరియు(ఖబరస్థాన్) బరియల్ .గ్రౌండ్ ల అభివృద్ధికి సహకరించవలసిందిగా ఎంపీ గంటి హరీష్ మాధుర్ను బుధవారం ఎంపీ కార్యాలయంలో కోనసీమ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ బషీర్, జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ మీరాన్ షరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రానున్న రంజాన్ నెల ను పురస్కరించుకుని మసీదులు మరియు బరియల్ గ్రౌండ్ ల అభివృద్ధికీ సహకరించి నిధులు కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మొల్ల ముస్తఫా మస్జిద్ కమిటీ సభ్యులు మొయినుద్దీన్, జిఎం ఖాన్, వలి, ఆలీ, ఇమామ్ మొహమ్మద్ రజ, ఎస్ లాల్, షఫీ, హుస్సేన్,రాజా అబ్బాస్, మహమూద్, తదితరులు పాల్గొన్నారు

# భాష్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**శంఖవరం, డిసెంబర్ 24 (ప్రభాతవార్త) :**మండలంలోని కత్తిపూడి లో గల భాష్యం లో క్రిస్మస్ పండుగను ఘనంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని క్రిస్మస్ అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రదర్ రవి కుమార్ విచ్చేసి విద్యార్థులకు క్రిస్మస్ యొక్క గొప్పతనం తమ మాటలతో మరియు వాక్యం ద్వారా వివరించి అందరిని అలరించారు. విద్యార్థులు జీసస్ పుట్టుక గురించిన నాటకం ద్వారా ప్రదర్శించారు. సాంటా క్లాజ్ ,మేరీ మాత దేవదూతలు వేషధారణలో సందడి చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేడుకల్లో భాగంగా క్రిస్మస్ ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ జయ ధనర్జున మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ యొక్క ప్రాముఖ్యత, ప్రేమ, శాంతి, సేవా భావం వంటి విలువలపై ప్రసంగించారు. పాఠశాల ప్రైమరీ హెచ్‌ఎం కాత్యాయనీ మాట్లాడుతూ, క్రిస్మస్ సందేశం విద్యార్థుల్లో మానవీయ విలువలను పెంపొందిస్తుందని తెలిపారు. చివరగా ప్రిన్సిపాల్ శ్రీ జయ ధనర్జున, కాత్యాయనీ క్రిస్మస్ కేకును కట్ చేసి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ,వైస్ చైర్మన్ హనుమంతరావు పాఠశాల జోనల్ ఇన్చార్జ్ వి గోవిందరాజు విద్యార్థులకు,తల్లిదండ్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే నానాజీ క్రిస్మస్ శుభాకాంక్షలు

**400 చర్చిలకు కేకులు పంపిణీ**



**కాకినాడ రూరల్, డిసెంబర్ 24 (ప్రభాతవార్త):** సర్వ మానవాళికి పవిత్ర బోధనలు పంచిపెట్టిన ఏసుక్రీస్తు పుట్టినరోజు పురస్కరించుకుని క్రైస్తవ సోదర సోదరీమణులకు కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ క్రిస్మస్ శు భాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని బుధవారం గోదారిగుంట క్యాంపు కార్యాలయంలో నాలుగవ సంవత్సరం సుమారు 400 చర్చిలకు ప్లమ్ కేకులు, పాస్టర్లకు బహుమతులు ప్రధానం చేశారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శం అని క్రిస్మస్ సందర్భంగా ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తాటికాయలు వీరబాబు, జనసేన పార్టీ నాయకులు మానేపల్లి బాబ్జి, బస్సా చంటిబాబు, పుల్ల వీరబాబు, మాదారపు తాతాజీ, జీని శ్రీనివాస్, దాసరి శివ, పోసిన రాము , దొడ్డిపట్ల అప్పారావు , ముద్దన ప్రకాష్ జనసేన పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతి సంబరాలకు లొల్ల లాకుల వద్ద ఏర్పాట్ల పై అధికారులతో సమీక్ష...



**ఆత్రేయపురం, డిసెంబర్, 24,(ప్రభాత వార్త)** సంక్రాంతి సంబరాలలో భాగంగా సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ ఉత్సవాల ను జనవరి 11 నుండి 13వ తేదీ వరకు నిర్వహించాలని సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం లొల్ల లాకుల నందు తహసీల్దార్ రాపాక రామచంద్ర మూర్తి, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్ లు ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పిఈటిలు జనవరి 11, 12, 13, తేదీలలో జరిగే కోనసీమ సంక్రాంతి సంబరాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. జనవరి 11వ తేదీ ఉదయం ఏడు గంటల నుండి ఆత్రే యపురం కాలువ రేవు నందు ఈతల పోటీలు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నేతృత్వంలో జిల్లా కలెక్టర్ ఆర్, మహేష్ కుమార్ ప్రారంభిస్తారని, ప్రథమ బహుమతిగా రూ 8 వేలు, ద్వితీయ బహు మతిగా రూ 6 వేలు, తృతీయ బహుమతిగా రూ 4 వేలు ప్రకటించినట్లు తెలిపారు. అదే రోజు ఉదయం 9 గంట ల నుండి రంగోలి ముగ్గుల పోటీలు ఆత్రేయపురం ప్రధాన రహదారిపై నిర్వహించి ప్రథమ బహుమతిగా రూ 20 వేలు, ద్వితీయ బహు మతిగా రూ 10 వేలు, తృతీయ బహుమతిగా రూ. 5 వేలు ప్రకటించారన్నారు. జనవరి 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు ఆత్రేయపురం కెనాల్ వద్ద గాలిపటాల పోటీలు ప్రారంభిస్తారని వీటిలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ 6 వేలు, ద్వితీయ బహుమతిగా రూ 4 వేలు, తృతీయ బహుమతిగా 3 వేలు ప్రకటించనున్నట్లు తెలిపారు. కోనసీమ సంక్రాంతి సంబరాలు గోదావరి ట్రోఫీ డ్రాగన్ బోట్ ఫెస్టి వల్ జనవరి 12 13 తేదీల లో ఆత్రేయపురం కాలువ రేవు బ్రిడ్జి నుండి ఉచ్చిలి దుర్గాదేవి ఆలయం వరకు నిర్వహిస్తామన్నారు. ఈ డ్రాగన్ పడవల పోటీల లో కేరళ తమిళనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి సుమారుగా 28 టీములు పాల్గొని అవకాశం ఉందన్నారు. అలాగే లొల్ల లాకులు నందు ఫుడ్ ఫెస్టివల్ మన కోనసీమ చుట్టుపక్కల ఉండే వివిధ రకాల వంటకాలను ఈ ఫెస్టివల్ కు వచ్చే వారికి రుచికరమైన వంటలు చూపించేందుకు ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు అధికారులు, సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ అసోసియేషన్ సభ్యులు తెలియజేశారు.ఈ పోటీలలో మొదటి స్థానంలో గెలుపొందిన బృందానికి రూ 2 లక్షలు , ద్వితీయ స్థానంలో గెలుపొం దిన బృందానికి లక్ష రూపాయలు బహు కరించడం జరుగుతుందన్నారు. ఈ సంక్రాంతి సంబరాలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జనవరి 11 వ తేదీ రాత్రి 7 గంటలకు సినీ ఆర్కెస్ట్రా కార్యక్రమం ఆత్రేయపురంమహాత్మా గాంధీ హై స్కూల్ గ్రౌండ్ నందు నిర్వహించడం జరుగుతుం దన్నారు. అదే విధంగా 12 వ తేదీ రాత్రి 7 గంటల నుండి బాండ్ సేహరి మ్యూజికల్ కార్యక్రమం ఉంటుందన్నారు. పర్యాటక శాఖ ద్వారా రెండు స్పీడ్ బోట్లు రెండు జెట్ స్పీడ్ బోట్లు రాకపోకలకు అనువుగా జెట్టిని ఏర్పాటు చేయాలన్నారు. అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో మూడు రోజులు కార్యక్రమాలు పర్యవేక్షణకు ఇన్చార్జిలను నియమించమన్నారు. ఈ సంబరాలలో పాల్గొనేందుకు రోజువారీగా వచ్చే పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్, మొబైల్ టాయిలెట్లు, పర్యాటకుల ఆరోగ్య భద్రత కై పీహెచ్ సి, వైద్యులతో కూడిన వైద్య శిబిరాలు లొల్ల లాకుల వద్ద, హై స్కూల్ వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ వారు ట్రాఫిక్ జామ్ కు అవకాశం లేకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది ద్వారా నిత్యం పారిశు ధ్యన్ని మెరుగుపర్చాలన్నారు. ఈత పోటీలకు గాను జిల్లా స్పోర్ట్స్ డెవల ప్మెంట్ అథారిటీ వారి పర్యవేక్షణలోడ్రిల్ మాస్టార్లను నియమించి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు బలోపేతం చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారులు మూడు పడవలను లైఫ్ జాకెట్లతో సహా సిద్ధం చేయాలన్నారు. శ్రేయాస్ మీడియా వారు మొత్తం ప్రక్రియను డాక్యుమెంటేషన్ చేసి సమర్పించాలని ఈ డాక్యుమెంట్ ఆధారంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను నిర్దేశించు కోవడం జరుగుతుందన్నారు. రంగోలి పోటీల లో పాల్గొనేందుకు ఇప్పటివరకు 150 మంది మహిళలు నమోద యినట్లు తెలిపారు. వచ్చిన అతిథులకు రావులపాలెం సి ఆర్ సి,సిరి గార్డెన్స్ తదితర ప్రదేశాల్లో వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలోతహసీల్దార్ రాపాక రామచంద్ర మూర్తి, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, ఆర్ ఐ, ఎం భాను, వెలుగు ఏపిఎం ఆర్.యం.డి గంగాధర్, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు, గణపతిరాజు, తోట రజిని, పి ఈ టి.నంబూరి రవిరాజు, పీఈటీలు, ఎలక్ట్రికల్ లైన్ ఇన్స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)**
**ABR.CF.No: HS 187 OF 2025**

BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** Ameerpet BRANCH, represented by its Foreman/Branch Manager
...DISPUTANT

And

**MR. G. DEV SAI SANKAR & OTHERS**
...OPPONENT

1. **MR GUDALA DEV SAI SANKAR,** S/O GUDALA VENKATA RAMANA, DOB: 31/07/1990, W/AS: J.C-2941, EMP CODE: 4225, GREY HOUNDS, 8A UNIT, REGIONAL HEAD QUARTERS, CHEPALUPFADA, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531163., R/O QUARTER NO.G15, C-BLOCK, NAVYA QUARTERS, KAPULUPPADA (VL), BHEEMILI (M), VISAKHAPATNAM, A.P. 531163.
2. MR VADISELA SIMHACHALAM, S/O VADISELA VEERA RAGHAVULU, DOB: 14/09/1989, W/AS: J.C-685, EMP CODE: 3933, GREY HOUNDS, 8A UNIT, REGIONAL HEAD QUARTERS, CHEPALUPPADA, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531163, R/O. D.NO.14-63/1, SRI RAMA NILAYAM, TAILORS COLONY, MADHURAWADA, VISAKHAPATNAM, ANDHRA PRADESH
3. **MR VALETI MOHANA** RAO, S/O VALETI RAJULU, DOB: 05/01/1988, W/AS: J.C-2092, EMP.CODE: 3565, GREY HOUNDs, 8A UNIT, REGIONAL HEAD QUARTERS,, CHEPALUPPADA, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531163., R/O. QUARTER.NO.422-22/1, C/O SRINIVAS, SIVA SHAKTHI NAGAR, KUMMARI VEEDHI, VISAKHAPATNAM, ANDHRA PRADESH-530048.
4. **MR CHANDAKA GOVINDA,** S/O CHANDAKA SURYA NARAYANA, DOB: 06/06/1993, W/AS: J.C 253, EMP.CODE: 3422, GREY HOUNDS, 8A UNIT, REGIONAL HEAD QUARTERS, CHEPALUPPADA, VISAKHAPATNAM, ANDHRA PRADESH-531163., R/O. G.NO.1-218, NEAR GOVERNMENT HOSPITAL, SYAM NAGAR, MADHURAWADA, VISAKHAPATNAM, A.P-530048.
5. **MRS GUDALA LAKSHMI,** W/O GUDALA VENKATA RAMANA DOB: 01/01/1976, OCC: LAND LADY, R/O H.NO.6-125, KAJULURUM), REGUBADAVA, KUYYERU, EAST GODAVARI DISTRICT ANDHRA PRADESH-533468

...Respondents/Opponents

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.64,825=00** (Rupees Sixty Four Thousand Eight Hundered Twenty Five Only) same posted to **17-01-2026** to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator HYDERABAD (SOUTH) at 3.00 p.m. If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.

//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//

**Sd/- R. CHAKARDHAR**
**Advocate**
H.No.6-1-295/1,
Padmarao Nagar,
Secunderabad.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)**
**ABR.CF.No: HS 190 OF 2025**

BETWEEN:
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** Ameerpet BRANCH, represented by its Foreman/Branch Manager
...DISPUTANT

And

**MR. Y.V.N. SRI HARSHA & OTHERS**
...OPPONENT

1. **MR YELLAPRAGADA VENKATA NAGA SRI HARSHA,** S/O YELLAPRABADA SAMBA SIVA RAO, DOB: 15/09/1988, OCC: PRIVATE EMPLOYEE, R/O FLAT NO.502, BLOCK-A, MAHALAKSHMI TOWERS, DONKA ROAD, TADIGADAPA, PENAMALUR (M), KRISHNA DIST, A.P-521151.
2. **MS DWARA TEJASWI,** D/O DWARA SYAMALA RAO, DOB: 10/07/1992, OCC: PRIVATE EMPLOYEE, R/O H.NO.46-6-19, TEMPLE STREET, NEAR GANDHI BOMMA, JAMPETA, RAJAHMUNDRY URBAN, EAST GODAVARI, A.P-533101.
3. **MR ERAMALLY HARISH,** S/O ERAMALLY LINGA MURTHY, DOB: 14/06/1989, W/AS: SR.BENCH SALES RECRUITER, EMP. CODE: STH1004, M/S: SCHRILL TECHNOLOGIES, D.NO:1-98-10, FLAT NO.102, 2ND FLOOR, SAI MADHU TOWERS, HI-TECH CITY, HYDERABAD-500081., R/O H.NO.6-84/A/103, FLAT NO.103, LAXMI RESIDENCY, PRAGATHI NAGAR, DAMMAIGUDA, HYDERABAD-500083.
4. **MR KATAMANENI AJAY KUMAR,** S/O KATAMANENI VENKATESWARA RAO, DOB: 11/04/1985, W/AS: SR.US HR EXECUTIVE, EMP. CODE: 205649, M/S: PYRAMID SOFTSOL PVT LTD, #5TH FLOOR, UNIT#2, BLDG#9, K RAHEJA IT PARK, CYBERABAD, SY.NO.64, MINDSPACE, MADHAPUR, HYDERABAD-500081., R/O FLAT NO: 202, TRINITY ENCLAVE, KUKATPALLY, HYDERABAD-500072.

...Respondents/Opponents

Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.84,300=00** (Rupees Eighty Four Thousand Three Hundred only) same posted to **17-01-2026** to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, HYDERABAD (SOUTH) at 3.00 pm. If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.

//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//

**Sd/- R. CHAKRADHAR**
**Advocate**
H.No.6-1-295/1,
Padmarao Nagar,
Secunderabad.

## విజేతలకు 25 వేల రూపాయల అందచేసిన వైసీపీ నేత రమణారావు



**అమలాపురం,డిసెంబర్24, ప్రభాతవార్త** వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏ.వేమవరం గ్రామంలో విద్యార్థి విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జిల్లెళ్ళ రమేష్ ఆధ్వర్యంలో 21, 22, 23 తేదీలలో వైఎస్ జగన్స్ వాలీబాల్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్ లో మొత్తం 32 జట్లు హోరాహోరీగా జరిగాయి.పోటా పోటీ పడగా విశ్వవిజేతగా వైజాగ్ టీం గెలుపొందిందగా రెండవ స్థానంలో మాగం టీం నిలిచింది. గెలుపొందున వైజాగ్ టీంకు కుంచే రమణారావు చేతుల మీదగా మొదటి బహుమతిగా 25 వేల రూపాయల చెక్కు, ట్రోఫీ బహుకరించారు. రెండవ బహుమతి మాజీ ఎంపీ చింత అనురాధ 15 వేల రూపాయల చెక్కు, ట్రోఫీ ను అందజేశారు. పోటీలో పాల్గొన్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జిల్లెళ్ళ రమేష్ ను నాయకులు గ్రామ పెద్దలు అందరు చేతుల మీదుగా చిరు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ఐటీ విభాగం జిల్లా అధ్యక్షులు తొరం గౌతమ్, నక్కా చంద్రశేఖర్, వంటేద్దు వెంకనాయుడు, కుడిపూడి భరత్భూషణ్, చీకట్లకిషోర్,చెట్ల రామారావు, చిత్రపుజయరాజు జిల్లా నలుమూలల నుండి వచ్చిన ముఖ్య నాయకులు గ్రామ పెద్దలు అత్యధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన ట్రస్ట్ కు భక్తులు విరాళాలు.




**ఆత్రేయపురం, డిసెంబర్, 24,(ప్రభాత వార్త)** స్వయంభూ క్షేత్రంగా విరాజిలుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాల స్వామి వారి ఆలయానికి బుధవారం అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చిస్వామివార్ని దర్శించు కున్నారు. ఆత్రేయపురం గ్రామానికి చెందిన అద్దేపల్లి వెంకటేశ్వరరావు శ్రీమతి మాణిక్యాంబ దంపతులుస్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116/- వేలు. మచిలీపట్నం చెందిన కీ.శే. శ్రీ సాదు మాల్యాద్రి వారి జ్ఞాపకార్థం వారి భార్య రాధిక, రూ.5,116/- వేలు. విరాళంగా అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను, అందజేశారు.

## వ్యవసాయ ఉత్పత్తుల పై డ్వాక్రా మహిళా సంఘాలకు అవగాహన...



**ఆత్రేయపురం, డిసెంబర్, 24,(ప్రభాత వార్త)** డ్వాక్రా సంఘాల మహిళలకు అరటి కొబ్బరి ఉత్పత్తులలో వ్యాపార అభివృద్ధికి ఆత్రేయపురం వెలుగు కార్యాలయం నందు బుధవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కాల్ గుడి డిఆర్పి నాగార్జున, జీవనోపాధి అభివృద్ధికి వారు ఏ విధంగా వ్యాపారుల ముందుకు సాగాలి అనేదానిపై అవగాహన కల్పించారు. ఏ వ్యాపారం చేసుకున్న వారికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫీజి సంఘ సభ్యులు టాప్ డైరెక్టర్స్ సీసీలు వివో ఏలు ఏపీఎం, ఆర్. యం.డి గంగాధర్, సీసీ. పైడ్రాజు, పాల్గొన్నారు.

## పీహెచ్ సీలో డీఎంహెచ్ఓ తనిఖీ



**రామచంద్రపురం,డిసెంబర్24(ప్రభాతవార్త):** మండలంలో వెల్ల,ద్రాక్షారామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర ఆకస్మిక తనిఖీ చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రికార్డులు పరిశీలించారు.పీహెచ్ సీలో సాధారణ ప్రసవలు ఎక్కువ జరగాలని సిబ్బందికి సూచించారు.24గంటలు ప్రసూతి సేవలు అందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవలు జరిగే విధంగా ప్రోత్సహించాలని సిబ్బందికి తెలియజేశారు.రోగుల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో నమోదు చేయాలని దుర్గారావు తెలిపారు.అలాగే క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించి తదుపరి వైద్యం నిమిత్తం జిజిహెచ్ కాకినాడకు తరలించాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో వైద్యధికారులు డాక్టర్ ఎం.రత్న సుధా,డాక్టర్ వి.స్వాతి భవాని,డాక్టర్ వి.లక్ష్మీ ప్రసన్న,డివిజనల్ సూపర్వైజర్ జి కమల్ శేషు,సిహెచ్ఓ వీరవేణి,సూపర్వైజర్లు జి.రత్నం,పి.జానకమ్మ,డి.వైకుంఠ రావు,కె.శ్రీనివాస్,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు..

## రైతులకు అందుబాటులో యూరియా



**రామచంద్రపురం, డిసెంబర్24 (ప్రభాతవార్త):** రైతులను గుర్తించి,వారి శ్రమను గౌరవిస్తూ,వ్యవసాయ అభివృద్ధికి అందరూ కలిసి పురోభివృద్ధి చేయాలని వ్యవసాయ అధికారి మణిదీప్ ఆకాంక్షించారు .తాడిపల్లి, కందులపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్ మణిదీప్ హాజరయ్యారు.వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు,ఎరువులు,యాంత్రికరణ వ్యవసాయం పై రైతులకు వివరించారు.యూరియా విషయమై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండలంలో ప్రస్తుతం రబీ సీజన్ కు ఎరువుల కొరత లేదని సీజన్ కు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని మణిదీప్ తెలిపారు.మండలం మొత్తానికి 314 టన్నుల యూరియా అందించామని,సహకార సంఘాలు,ప్రైవేట్ డీలర్ల వద్ద154 మెట్రిక్ టన్నులు ఎరువులు ముఖ్యంగా యూరియా అందుబాటులో ఉందని రైతులకు తెలియజేశారు.రబీ సీజన్ రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేష్,శ్రీరామ్,రైతులు పాల్గొన్నారు...

## డివిజన్ ఇన్చార్జి డివైఈఓ గా వెంకటేశ్వరరావు..

**అంబాజీపేట,డిసెంబర్ 24, (ప్రభాతవార్త):** కొత్తపేట డివిజన్ ఇన్చార్జి డీవైఈవోగా అంబాజీపేట మండల విద్యాశాఖాధికారి-1 కాండ్రేగుల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.ఇప్పటి వరకు డివైఈవోగా పనిచేసిన పి.రామలక్ష్మణమూర్తి రామచంద్రపురం డీవైఈవోగా పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.దీంతో కొత్తపేట ఇన్చార్జి డీవైఈఓగా వెంకటేశ్వరరావును నియమిస్తూ కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుండి బుధవారం ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా పలువురు హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రేమ దయ కరుణ ప్రతీఒక్కరూ ఆచరించాలి

### జనసేనపార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి



**గండేపల్లి డిసెంబర్ 24 (ప్రభాతవార్త):** ప్రేమ దయ కరుణ ప్రతీ ఒక్కరూ ఆచరించాలని జగ్గంపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు.గండేపల్లి మండలం యర్రంపాలెంలో పాస్టర్ మధు కిరణ్ బైబిల్ మిషన్ క్రిస్టమస్ వేడుకలలో రమేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏసుక్రీస్తు జన్మదినం ఎంతో ఘనంగా జరుపుకుంటారని ప్రేమ కరుణ దయ అనేవి ప్రతి ఒక్కరు ఆచరించి ఒకరికొకరు సహాయపడే విధంగా ఉండాలని అన్నారు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసారు. ఆయన వెంట పులి ప్రసాద్, మాదారపు వీరబాబు, అడబాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## యనమలను కలిసిన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ



**తుని, డిసెంబర్ 24, ప్రభాతవార్త** మాజీ మంత్రి, రాష్ట్ర టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ని మండపేట నియోజకవర్గ శాసనసభ్యుడు వేగుళ్ళ జోగేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తుని మండలం తేటగుంట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద టీడీపీ సీనియర్ నేత యనమలను కలిసిన వేగుళ్ళ జోగేశ్వరరావు పలు అంశాలపై చర్చించారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



**మామిడికుదురు.డిసెంబర్ 24(ప్రభాతవార్త)** ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు పాటించాలని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ సూచించారు.పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మూడు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు సేఫ్టీ ప్రమాధాలను తగ్గించి ప్రాణనష్టాన్ని నివారిస్తుందన్నారు.సురక్షిత ప్రయాణం అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు,మానసిక రుగ్మతలు కలుగుతాయన్నారు.మహిళలు తమకు ఏసమస్య వచ్చినా కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకుని వెళ్ళాలన్నారు. ఏ అనర్ధం జరగకముందే జాగ్రత్త పడాలన్నారు.విద్యార్థులు తమకు తెలిసిన విషయాలను ఇతరులకు వివరించి వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు.

## దీప్తిలో ఆకట్టుకున్న క్రిస్మస్ వేడుకలు.



**మామిడికుదురు.డిసెంబర్ 24 (ప్రభాతవార్త)** మామిడికుదురు దీప్తి పాఠశాలలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు శ్యాంతాక్లాజ్,ఏంజిల్ దుస్తులు వేసుకొని ఆట,పాటలతో అందరినీ ఆకట్టు కున్నారు. కరస్పాండెంట్ డివివి సత్యనారాయణ ఆధ్వర్యంలో హెచ్ఎం యక్కలదేవర నాగన్నబాబు క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు.క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.నగరం గీతాంజలి పాఠశాలలో కూడా క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**మామిడికుదురు.డిసెంబర్ 24(ప్రభాతవార్త)** లూటుకుర్రు గ్రామంలో కపిలేశ్వరపురం ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అడబాల తాతకాపు ప్రారంభించారు.శిబిరంలో పలువురికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి,కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించి వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు.కంటి శుక్లా ల సమస్యతో బాధ పడుతున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు.ఉచిత కంటి సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని తాతకాపు తెలిపారు. ఎంపిటీసీ నామన వెంకటేశ్వరరావు,పంచాయతీ పాలకవర్గ సభ్యులు,సచివాలయ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానవాళికి ప్రభువు సూచనలు అనుసరణీయం



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 24(ప్రభాతవార్త):** ఏసుక్రీస్తు బోధనలు, సూచనలు మానవాళికి ముక్తి మార్గమని వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గం ఇన్చార్జి, పీఏసీ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. మండలంలోని నాగులపల్లి లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ప్రముఖ సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణ రెడ్డి, సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ ఆరాధన వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తనను తాను తెలుసుకోవాలని, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని ప్రభువు బోధనలు అన్నారు. మిమ్ము వలే మీ పొరుగు వారిని ప్రేమించాలని దైవ కుమారుని వాక్యమన్నారు. క్రీసు ఆచరించి చూపించిన ఉత్తమ మార్గాన్ని ప్రతీ ఒక్కరూ పాటించదగినదన్నారు. కార్యక్రమంలో రావు చిన్నారావు, ఆనాల సుదర్శన్, దైవజనులు ఉన్నారు.

## సేంద్రియ పద్ధతే మేలు, రసాయనాలు వద్దు



**గోపాలపురం, డిసెంబర్ 24 ప్రభాతవార్త:** రసాయనాలు ఎరువులతో పండించిన ఆహారం తిని జబ్బుల పాలవుతున్న ప్రస్తుత రోజుల్లో సేంద్రియ ఎరువులతో పండించిన ఆహారాన్ని ప్రతిఒక్కరూ తినాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీ.తాతారావు, అడిషనల్ డిపిఎం వల్లీ లు సూచించారు. గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన గెడా జోగేంద్ర ప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో దేవరపల్లి, గోపాలపురం సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది, రైతులు కలిసి పలు రకాల ఆకుకూరలు, కాయగూరలు ఏటీఎం పద్ధతిలో వేయడం జరిగింది. ముందుగా సేంద్రీయ పద్ధతిలో బెల్లం తయారీ విధానాన్ని రైతు జోగేంద్ర ప్రసాద్, జిల్లా అధికారులు, సిబ్బందికి వివరించారు. బెల్లం తయారీలో ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా సేంద్రీయ పద్ధతిలో బెల్లం తయారీ విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఏడాది పొడుగునా ఆదాయం ఎలా పొందాలనే విషయంపై రైతులకు సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా పీడీ తాతారావు మాట్లాడుతూ.. రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి మరల్చితే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం మానవ ఆరోగ్యంపై అనేక దుష్ప్రభావాలు చూపుతున్నాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంపై ప్రజల్లో విస్తృత ప్రచారాలు చేపట్టాలని సూచించారు. ఇక్కడ వ్యవసాయ క్షేత్రంలో జరిగే పలు రకాల కూరగాయలు, మిరప, చెరకు, వరి, ఆకుకూరలు, తదితర వాటిని రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తారు. ఈ కార్యక్రమంలో రైతులు జొన్నలగడ్డ రాంబాబు, ఉండవల్లి రామకృష్ణ, సుభాష్ చంద్రబోస్, కాకర్ల శ్రీరామ్, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసరావు, సత్యనారాయణ, అరుణ, శేషగిరి, రాజలక్ష్మి, దుర్గాదేవి, కోమటికుంట, వాదాలకుంట సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## భద్రత, నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం



**కె గంగవరం, డిసెంబర్ 24, (ప్రభాతవార్త):** విద్యార్థినీవిద్యార్థులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని గంగవరం నూతన ఎస్సై జి. సోమేంద్ర సూచించారు. పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, బాలికలు ఎక్కడైనా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా మాటల ద్వారా గానీ, చేతల ద్వారా గానీ, చూపుల ద్వారా గానీ తమ మనోభావాలను ఇబ్బంది పెట్టేలా ఎవరు ప్రవర్తించినా వెంటనే సమాచారం ఇవ్వాలని స్పష్టంగా తెలియజేశారు.ప్రయాణ సమయంలో ఎవరైనా యువకులు వెనకపడితే తక్షణమే తనకు ఫోన్ చేయాలని, మహిళా పోలీస్ నంబర్ను తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని విద్యార్థినీలకు సూచించారు. ఇలాంటి విషయాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, తల్లిదండ్రులకు లేదా నేరుగా పోలీసులకు తెలియజేయాలని అన్నారు.ఏ విధమైన ఆటంకాలు లేకుండా విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని చక్కగా కొనసాగించాలని, చిన్నతనంలోనే దురలవాట్లకు దూరంగా ఉండాలని, తోటి విద్యార్థుల పట్ల సోదరభావంతో మెలగాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులకు కూడా సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, సైన్స్ ఉపాధ్యాయులు పితాని శ్రీనివాసు, రామలక్ష్మి, రాఘవకుమారి, బేబీ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల భద్రత, నైతిక విలువల పెంపుదలకు దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## రైతులకు యూరియా కార్డులు పంపిణీ

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న కరెడ్ల గోవిందు.



**కాకినాడ రూరల్, డిసెంబర్24 (ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు , తూరంగి రైతులకు యూరియా ఎరువులకు సంబంధించి వ్యవసాయ శాఖ జారీ చేసిన కార్డుల పంపిణీ కార్యక్రమానికి కొవ్వూరు రైతు సేవా కేంద్రంలో గ్రామ ప్రెసిడెంట్ పిల్లి చక్రారావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ మండల జనసేన పార్టీ అధ్యక్షులు కరెడ్ల గోవిందు పాల్గొని తూరంగి 242 కార్డులు, కొవ్వూరు 420, మొత్తం 662 కార్డులు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈ కార్డుల వల్ల రైతులు రైతు భరోసా కేంద్రాలలో, సొసైటీలలో ఎరువుల షాపుల లో తీసుకొనవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా కొవ్వూరు, తూరంగి రైతులు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి నీటి సంఘం అధ్యక్షులు సింగం బాబ్జి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు ముమ్మిడి వెంకటరావు, తూరంగి జనసేన మాజీ ఎంపీటీసీ పితాని వెంకట రాము, ఏడి. దుర్గా లక్ష్మి, బీసీఎల్. ఏడి ప్రశాంతి , ఏవో .సత్యనారాయణ, వి. ఏ. ఏ. వెంకటరమణ, రైతులు మేర్నడి దొరబాబు, ఊబా భద్రం, పిల్లి సూర్యప్రకాష్ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు రైతులు పాల్గొన్నారు.

## ఆడపిల్లల జోలికెళ్తే కఠిన చర్యలే. : ఐ జి అశోక్ కుమార్




**గోపాలపురం ,డిసెంబర్ 24 (ప్రభాతవార్త):** ఆడపిల్లల జోలికి వెళ్ళిన మహిళలను వేధించిన కఠిన చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ ఐజి జి వి జి అశోక కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన గోపాలపురం పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఐ జి అశోక్ కుమార్ కు స్వాగతం పలికారు. ముందుగా ఐజి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్టేషన్లో రికార్డులను పరిశీలించారు పెండింగ్ కేసుల విషయమై ఎస్సై మనోహర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐ జి అశోక్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో నేరాలు తగ్గుముఖం పట్టాయి అన్నారు అయితే రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు . గోపాలపురం దేవరపల్లి స్టేషన్ల పరిధిలో మూడు ప్రధాన రహదారులు ఉండడం వల్ల ఈ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు గత మూడు సంవత్సరాలుగా జరిగిన రోడ్డు ప్రమాదాలు గురించి తెలుసుకొని ప్రమాద స్పాట్లను గుర్తించి రోడ్ సేఫ్టీ సమావేశాలలోనూ ఇంజనీర్లతోనూ చర్చించి అక్కడ మరల ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రజల్లో కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ప్రజల సహకారం కూడా ఉండాలన్నారు. అందుకోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేవరపల్లి గోపాలపురం హైవేల మీదుగా గంజాయి కూడా రవాణా జరుగుతుందని ఈ రవాణాపై నిఘాతో పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు ఇప్పటికే చాలా కేసులు పట్టుకోవడం జరిగిందని ఐజి తెలిపారు మహిళలు బాలికల రక్షణ కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు హాస్టల్లో వద్ద ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు ఆడపిల్లల ను మహిళలను వేధించిన చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడిన వేధించినఅటువంటి వారిపై రౌడీషీటు ఓపెన్ చేయడం జరుగుతుందని ఐ జి అశోక్ కుమార్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్పీతోపాటు కొవ్వూరు డిఎస్పి దేవకుమార్ దేవరపల్లి సిఐ నాగేశ్వర నాయక్ గోపాలపురం ఎస్సై పి మనోహర్ ఉన్నారు.

## ఘనంగా క్రిస్టమస్ వేడుకలు



**కడియం, డిసెంబరు 24 (ప్రభాతవార్త):** క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం దుళ్ళలోని అమరావతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో క్రిస్మస్ వేడుకలు ప్రిన్సిపాల్ మోహన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఏంజిల్స్ మరియు శాంతాక్లాజ్ వేషధారణలో పాఠశాల ఆవరణలో సందడి చేస్తూ యేసు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ సోమశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులకు అన్ని మతాల పండుగలపై అవగాహన కల్పించేందుకు తమ పాఠశాలలో ప్రతి పండుగను నిర్వహిస్తామని తెలిపారు. యేసు చూపిన సన్మార్గంలో నడిచి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో ఎస్. రాంబాబు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన ప్రార్థనా మందిరాలు..



**అంబాజీపేట,డిసెంబర్ 24, (ప్రభాతవార్త):** శాంతి,దయ, ప్రేమతో నిండిన హృదయాలతో క్రిస్మస్ వేడుకలను నిర్వహించుకునేందుకు మండలంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి.చర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంబాజీపేట, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మొసలపల్లి, ఇసుకపూడి, చిరతపూడి తదితర గ్రామాల్లో ఉన్న చర్చిలు నూతన హంగులు దిద్దుకున్నాయి. చర్చిల్లో యువజనులు అలంకరణ పనుల్లో నిమగ్నమయ్యారు. క్రైస్తవ విశ్వాసకుల గృహాలపై ఇప్పటికే క్రీస్తు జననం గుర్తుగా స్టార్లను, క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసుకున్నారు. అవి ప్రత్యేకమైన విద్యుత్ అలంకరణలతో కళకళలాడుతున్నాయి. చర్చిల వద్ద యువజనులు క్రీస్తు జనన వృత్తాంతం తెలిపే నాటికలను ప్రదర్శించేందుకు సన్నద్ధమవుతున్నారు. స్థానిక హౌడ్కో కాలనీలో ఉన్న కల్వరి క్రిస్టియన్ ప్రేయర్ హౌస్, గంగలకుర్రులోని గిఫ్ట్ ఆఫ్ లివింగ్ గాడ్ మినిస్ట్రీస్ ప్రార్థన మందిరాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ ప్రార్థన మందిరం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో దగదగలాడుతోంది. కముజువారిపేటలోని చెరువులో నిర్మించిన క్రీస్తురాజు,కారుణ్యక్రీస్తు మందిరాలు ఆకట్టుకుంటున్నాయి.

## ప్రధాన రహదారులపై చెత్త దహనం

### విషవాయువులతో స్థానికులు, వాహనదారుల ఉక్కిరిబిక్కిరి





**రామచంద్రపురం, డిసెంబర్ 24 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం వచ్చే జనవరి నుంచి 'రోడ్లపై చెత్త లేని గ్రామాలు,పట్టణాలు' చూడాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రణాళికలు సిద్ధం చేస్తుంటే, రామచంద్రపురం మండలంలో మాత్రం క్షేత్రస్థాయి పరిస్థితులు దానికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. రహదారులపై చెత్త కనపడకుండా ఉండాలంటే దాన్ని కాల్చి పారేయడమే ఏకైక మార్గమని అధికారులు భావిస్తున్నారో ఏమిటో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని కందులపాలెం, వెంకటాయపాలెం, వెల్ల తాళ్లపాలెం గ్రామాల్లో ప్రధాన రహదారుల పక్కనే చెత్తను కుప్పలుగా పోసి నిప్పు పెడుతున్నారు. దీనివల్ల వచ్చే దట్టమైన పొగ రహదారిని పూర్తిగా కమ్మేస్తోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నిర్లక్ష్యం వల్ల ఏ క్షణమైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తా చెదరాలు మాత్రమే కాకుండా, ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా యథేచ్ఛగా కాల్చేస్తుండడంతో ప్రమాదకరమైన విషవాయువులు గాలిలో కలుస్తున్నాయి. దీంతో అటు వాహనదారులు, ఇటు స్థానికులు శ్వాస తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పర్యావరణ నిబంధనల ప్రకారం బహిరంగంగా చెత్తను కాల్చడం నేరమని తెలిసినా, పర్యవేక్షించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తను సేకరించి ఎవరికీ ఇబ్బందిలేని ప్రదేశాలకు డంప్ యార్డ్ లకు తరలించాల్సిన సిబ్బంది, శ్రమ తగ్గించుకోవడానికి రహదారి పక్కనే పారబోసి నిప్పు పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి దీనివల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రభుత్వ లక్ష్యం కాగితాలకే పరిమితం కాకుండా, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రహదారుల పక్కన చెత్తను కాల్చే ప్రక్రియను ఆపివేయాలని, చెత్త సేకరణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కొమ్మన విజయ దుర్గకి ఎస్ టీ యూ ఆర్థిక సహాయం.



**పి . గన్నవరం డిసెంబర్ 24 (ప్రభాత వార్త)** కటారులంక గ్రామమునకు చెందిన . కొమ్మన విజయదుర్గ కి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బంది పడుతున్న కారణంగా ఎస్ టీ యూ పి. గన్నవరం మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయల ద్వారా విరాళాలు సేకరించి 20,000 ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షురాలు కొప్పుల సత్యవేణి, ప్రధాన కార్యదర్శి కాపవరపు గోపాలకృష్ణ, స్టేట్ కౌన్సిలర్ నల్లా బాలాజీ, ఎంటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చొల్లంగి కేశవకుమార్ ,సీనియర్ నాయకులు ముద్రగళ్ళ జగదీశ్వరరావు, పోల్నాటి నాగప్రసాద్, అరిగెల నాగేశ్వరరావు, నీతిపూడి శ్రీనివాసరావు, తోలేటి స్వామి నాయుడు, అల్లు అర్జున్ కుమార్ యన్.మందేశ్ కుమార్ పాల్గొన్నారు.

## సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ కు ఎంపికైన ఊబలంక విద్యార్థులు



**రావులపాలెం, డిసెంబరు 24 (ప్రభాతవార్త) :** సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ ( ఎస్.ఐ.ఎస్.ఎఫ్) - 2026 కు రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ లో సోలార్ బేస్డ్ ఎనర్జీ సేవర్ ఫర్ స్కూల్ అనే అంశంపై ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమ స్థానం సాధించి సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ కు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.ఎన్.ఎస్. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులు కె. ఈశ్వర్ సంజీవ్, సి.హెచ్. పవన్ సాయి, ఎ. నోకిధర్, గైడ్ టీచర్ సి.హెచ్. విజయలక్ష్మిలను హెచ్.ఎం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.బి.ఎస్.వి.వి.రాఘవరెడ్డి, బి.అపరాజి తదితరులు అభినందించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps